# కలలు చెప్పే కథలు

## మానవుడి అచేతనలో దాగిన అద్భుత రహస్యాలు

## (Man and his symbols)

## కార్ల్ యుంగ్

అనువాదం – వి. శ్రీనివాస చక్రవర్తి

పరిచయం

ఇది ప్రఖ్యాత మనస్తత్వ విశ్లేషకుడు కార్ల్ యుంగ్ రాసిన Man and his Symbols పుస్తకానికి అనువాదం.

వివిధ మానవ సంస్కృతులలో ఎలా విలక్షణమైన ప్రతీకలు వాడబడుతూ వచ్చాయో చెప్తూ ఎంతో విభిన్నమైన సంస్కృతులలో కూడా కొన్ని సామాన్య ప్రతీకలు వాడబడడం ఆశ్చకరంగా ఉంటుందని సూచిస్తాడు రచయిత. దేశ కాలాలలో ఎంతో దూరం ఉన్న మానవ సంస్కృతులకి చెందిన ప్రతీకలలో ఏకత్వం ఉండడానికి కారణాలు మన 'అచేతన' (unconscious) లో ఉన్నాయన్న చిత్రమైన భావన యుంగ్ యొక్క చింతనకి మూలస్తంభం లాంటిది అని చెప్పుకోవచ్చు.

మన మనసుని సచేతన మనసు (conscious mind), అచేతన మనసు (unconscious mind) అని రెండు విభాగాలుగా విభజించవచ్చు. ఇంద్రియాల ద్వార, ఆలోచన ద్వార తెలుసుకునే దంతా మన సచేతన మనస్సులో జరుగుతోంది. మన సచేతన మనస్సుకి 'అడుగున' లేక 'వెనుక' గుప్తంగా ఉన్న మనో విభాగమే అచేతన మనస్సు. (అచేతన మనస్సు అనే బదులు దాన్ని క్లుప్తంగా అచేతన (unconscious) అని పిలుస్తారు). దాన్ని మనం ప్రత్యక్షంగా అనుభవించలేం. కాని దాని రహస్య ప్రభావాన్ని మనం సచేతన మనస్సులో అనుభవిస్తాము.

చిన్న ఉదాహరణ. ఏదో సమావేశంలో లోతుగా మునిగిపోయి వుంటాము. ఏదో ముఖ్యమైన అంశం మీద చర్చ బాగా వేడిగా కొన్ని గంటల తరబడి సాగింది. చర్చ ముగిశాక ఒక్కసారిగా నాలుక పిడచకట్టుకు పోయినట్టు అనిపిస్తుంది. బాగా దాహం వేస్తుంది. అయితే ఎప్పట్నుంచో దాహం వేస్తూ ఉండోచ్చు. చర్చలో పడి దాన్ని మనం పట్టించుకోలేదు. చర్చ పూర్తయ్యాక గాని అంతవరకు 'అచేతనంగా' ఉండిపోయిన 'దాహం వేస్తోంది' అన్న విషయం 'సచేతన మనస్సు'లోకి ప్రవేశించలేదు.

అలాగే కొందరంటే మనకు ఎందుకో ఇష్టం ఉంటుంది. ఎందుకో చెప్పలేం. మరి  కొందరంటే మనకి అస్సలు పడదు. అందుకు కారణం ఏంటో తెలీకపోవచ్చు. అంటే ఆ కారణం మన సచేతన మనస్సుకి తెలీదు. అసలు 'కారణం' అచేతన లో  ఉంటుంది. కాని అచేతనకి భాష రాదు. కనుక కారణం ఏంటో బాహటంగా, భాషని వాడి చెప్పలేం. ఈ విధంగా మనకి సచేతన మనసులో జరిగే వ్యవహారాల మీద (అంటే మన ఆలోచనలు, నమ్మకాలు, అభిప్రాయాలు…) అచేతన మనస్సు యొక్క ప్రభావం రహస్యంగా వున్నా, ప్రబలంగా ఉంటుంది.

అచేతనకి భాష రాకపోయినా కొన్ని ప్రత్యేక ప్రతీకలు అనే మాధ్యమాన్ని వాడుకుంటూ అచేతన మనతో అంటే మన సచేతనతో సంభాషిస్తుంది, మనకి సంజ్ఞలు చేస్తుంది అంటాడు కార్ల్ యుంగ్. అచేతన యొక్క ఈ 'పరిభాష' ని అర్థం చేసుకుంటే మనం మన జీవితాలని మరింత సమర్థవంతంగా జీవించొచ్చు అంటాడు. మన అచేతనలో ఏముందో తెలుసుకోగలిగితే మన గురించి మనకి మరింత లోతైన అవగాహన ఏర్పడుతుంది అంటాడు.

కార్ల్ యుంగ్ చింతనలో ఈ అచేతన గురించిన ప్రస్తావన, వర్ణన చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఎన్నో ఉదాహరణలతో కలల ద్వార అచేతన మనకి అందించే సందేశాలు మన జీవితం మీద ఎంత బలమైన ప్రభావాన్ని చూపించగలవో విడమర్చి చెప్తాడు.

ఈ అనువాదం తెలుగు పాఠకులకి విజ్ఞానదాయకంగా ఉంటుందని ఆశిస్తూ.

అనువాదకుడు.

అచేతన పట్ల ఒక అవగాహన -

కలల ప్రాధాన్యత

భావాలని వ్యక్తం చెయ్యడానికి మనిషి భాష వాడుతాడు. భాషతో పాటు ఎన్నో చిత్రాలను, ఆకృతులని భావవ్యక్తీకరణ కోసం వాడడం జరుగుతుంది. మూడు గీతలు ఒక బిందువులో కలిసినట్టు ఉండే 'మెర్సిడెస్' కారు కంపెనీ చిహ్నం గాని, ఐదు వృత్తాలు కలిసినట్టు ఉండే ఒలింపిక్స్ చిహ్నం ఆ కోవకి చెందినవే. అవి ఒక వస్తువుకి, లేదా భావనకి దృశ్యరూపాలు. United Nations అనే పదావళికి ఏ విధంగా UN అనేది సంక్షిప్త రూపమో, అదే విధంగా పైన చెప్పుకున్న చిహ్నాలు (signs) ఒక కంపెనీనో, ఒక సంస్థనో, వస్తువునో సూచించే సంక్షిప్త చిహ్నాలు. అవి ప్రతీకలు (symbols) కావు. 'ప్రతీక' అన్న పదాన్ని నేను పూర్తిగా భిన్నమైన రీతిలో, ఒక ప్రత్యేక అర్థంతో వాడుతున్నాను.

ప్రతీక అనేది ఒక పదం కావచ్చు, ఓ చిత్రం కావచ్చు. దానికి సామాన్య వ్యావహారిక ప్రపంచంలో ఓ అర్థం, ఓ బాహ్యార్థం ఉంటుంది. అది కాకుండా ఆ పదానికి, లేదా చిత్రానికి మరో రహస్యమైన, గూడార్థం కూడా ఉంటుంది. గ్రీకు దేశంలో క్రీట్ (Crete) ప్రాంతానికి చెందిన స్మారక చిహ్నాలనే తీసుకుంటే ఎన్నో సందర్భాలలో మనకి బాడిస (adze) అనే చిహ్నం కనిపిస్తుంది. ఇది మనకి బాగా తెలిసిన ఓ సామాన్య పనిముట్టు. కాని ఆ వస్తువు ఈ సందర్భంలో మరేదో వాస్తవానికి ప్రతీకగా నిలుస్తోంది.


అలాగే నాకు తెలిసిన ఓ భారతీయుడు ఒక సారి ఇంగ్లండు సందర్శించి తిరిగి ఇండియాకి వెళ్లి ఇంగ్లండులో మనుషులు జంతువులని పూజిస్తారని చెప్పాడు. ఎందుకంటే అతగాడు ఇంగ్లండ్ లో ఎన్నో పాతకాలపు చర్చిలలో డేగలు, సింహాలు, ఎద్దులు మొదలైన జంతువుల బొమ్మలు చూశాడు. అతడికి తెలియనిది ఏంటంటే ఈ జంతువులు ఎవాంజెలిస్ట్ లకి ప్రతీకలు. క్రైస్తవ సాంప్రదాయంలో ఎవాంజెలిస్ట్ లు నలుగురు. వాళ్లు – మాథ్యూ, మార్క్, ల్యూక్, జాన్ లు. వీరిలో మాథ్యూ ని మానవ రూపంలోను, మార్క్ ని సింహం రూపంలోను, ల్యూక్ ని ఎద్దు రూపం లోను, జాన్ ని డేగ రూపం లోను వ్యక్తం చెయ్యడం పరిపాటి. ఇంచుమించు ఇదే విధంగా జంతువులని ప్రతీకలుగా వాడే మరో తార్కాణం మనకి ఈజిప్షియన్ సంస్కృతిలో ఒక చోట తారసపడుతుంది. ఈజిప్షియన్ల సూర్య భగవానుడి పేరు హోరస్ (Horus). అతడికి నలుగురు కొడుకులు. వాళ్లు – ఇమ్సెటీ (Imsety), హాపీ (Hapy), డ్యుయాముటెఫ్ (Duamutef), కెబెసెన్యుయెఫ్ (Qebehsenuef) లు. వీరిలో ఇమ్సెటీని మానవ రూపంలోను, హాపీని కొండముచ్చు రూపంలోను, డ్యుయాముటెఫ్ ని తోడేలు రూపం లోను, కెబెసెన్యుయెఫ్ ని డేగ రూపంలోను వ్యక్తం చేస్తారు. దీన్ని బట్టి నాలుగు జంతు రూపాల కూటమి అనేది ఒక విధమైన విశ్వజనీన ప్రతీక కావచ్చని అనిపిస్తోంది.



హోరస్ నలుగురు కొడుకులు - ఇమ్సెటీ, డ్యుయాముటెఫ్, హాపీ, కెబెసెన్యుయెఫ్ లు.

అలాగే ప్రపంచంలో ఎన్నో చోట్ల చక్రం, శిలువ మొదలైన ప్రతీకలు కనిపిస్తాయి. సందర్భాన్ని బట్టి, సంస్కృతిని బట్టి ఈ ప్రతీకలకి ఏదో గూడార్థం ఉంటుంది. ఆ అర్థం ఏంటి అన్న దగ్గర కొన్ని చోట్ల వివాదం తలెత్తుతూ ఉంటుంది. ఏదేమైనా ఓ స్థూలార్థం, ఓ గూడార్థం ఉన్న వాటినే ప్రతీకలు అంటాము.

కనుక బాహ్యార్థం కన్నా లోతైన అంతరార్థాన్ని సూచించే ఏ పదాన్నయినా, చిత్రాన్నయినా మనం ప్రతీక అంటున్నాం. అలాంటి ప్రతీకకి మరింత విశాలమైన, "అచేతనమైన" పార్శ్వం ఉంటుంది. ఆ ముఖాన్ని ఎవరూ స్పష్టంగా నిర్వచించలేరు, వర్ణించలేరు. మనిషి మనస్సు ప్రతీక యొక్క అంతరార్థాన్ని శోధిస్తూ లోతుగా పోతున్నప్పుడు కొన్ని సార్లు హేతువుకి అందని తలాలలోకి ప్రవేశించే పరిస్థితి ఏర్పడవచ్చు. ఉదాహరణకి చక్రాన్ని చూడగానే మన మనసులో "దివ్యమైన" సూర్యుడు అన్న భావనకి చెందిన ఆలోచనలు మెదలవచ్చు. ఇక్కడ మనసు యొక్క పరిమితులు బయటబడతాయి. "దివ్యం" అంటే ఏంటో నిర్వచించడం కష్టం. ఒక దాన్ని మనం "దివ్యం" అన్నప్పుడు దానికి ఊరికే ఏదో పేరు పెడుతున్నాం. ఓ నమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నాం. అంతే గాని అది బాహ్య ఆధారాల మీద, అనుభవం మీద ఆధారపడ్డ విషయం కాదు.



ప్రాచీన ఈజిప్ట్ లో  సూర్యోపాసనని  సూచించే చిత్రపటం. జలాలకి దేవత అయిన 'నున్' సూర్యుణ్ణి ఒక పడవలో మోసుకు పోతున్నట్టు ఇక్కడ చిత్రీకరించబడింది.

మనిషి అవగాహనకి అందని విషయాలు ఎన్నో వున్నాయి. కొన్ని సార్లు మనిషి తన అవగాహనకి అందని, తనకి కచ్చితంగా అర్థం కాని విషయాలని అర్థం చేసుకోడానికి ప్రతీకలు వాడుతాడు. మత సాంప్రదాయాలు అందుకే ప్రతీకలని, చిత్రాలని విరివిగా వాడుతాయి. ఇలా సచేతనంగా ప్రతీకలని వాడే సాంప్రదాయం

ఎప్పట్నుంచో ఉంది. కాని విశేషం ఏంటంటే కొన్ని సార్లు మనిషి అచేతనంగా, అప్రయత్నంగా, తన కలలలో కొన్ని ప్రతీకలని ఎదుర్కొంటాడు.

ఈ విషయాన్ని అర్థం చేసుకోవడం కొంచెం కష్టం. మనిషి కలలలో ప్రతీకలు కనిపించడం ఏంటి? ఇది అర్థం కావాలంటే మనిషి మనసు పని చేసే తీరుని ఒక సారి గమనించాలి. ఇంద్రియాల ద్వార మనం బాహ్య ప్రపంచం గురించి తెలుసుకుంటాం. ఇంద్రియాల సాక్ష్యం మేరకు బాహ్య ప్రపంచం గురించి ఒక అవగాహన కల్పించుకుంటాం. అయితే ఇంద్రియాల సామర్థ్యం అందరిలో ఒకేలా ఉండదు. కొందరికి నిశిత దృష్టి ఉంటుంది. ఒక్కసారి చూస్తే ఎన్నో వివరాలు గ్రహిస్తారు. మరి కొందరు ఎంత సేపు చూసినా ఎన్నో వివరాలు గుర్తించలేకపోతారు. కనుక ఇంద్రియాలు ఒక్కటే అయినే మనం గ్రహించే సారంలో ఎంతో వైవిధ్యం ఉంటుందని అర్థం చేసుకోవచ్చు.

అలాగే ఇంద్రియాలు బాహ్య ప్రపంచం యొక్క మన అవగాహనకి పరిమితులు ఏర్పరుస్తాయని కూడా సులభంగా తెలుసుకోవచ్చు. ఇంద్రియాల సామర్థ్యాన్ని పెంచుకోవాలంటే వైజ్ఞానిక పరికరాలు వాడుకోవచ్చు. ఓ టెలిస్కోప్ తో దూరంగా ఉన్నవి చూడగలం. ఓ ఆంప్లిఫయర్ వాడి బలహీనమైన శబ్దాలని సంవర్ధనం చేసి వినగలం.  అలా మన ఇంద్రియాల సామర్థ్యాన్ని కొంత మేరకు విస్తరింపజేసుకున్నా, ఒక దశలో ఆ ప్రక్రియకి కూడా హద్దులు కనిపించక మానవు. ఆ విధంగా మన ఇంద్రియాల సామర్థ్యంలోని పరిమితుల వల్ల మన ఎరుకకి పరిమితులు ఏర్పడతాయి.

మన ఎరుకకి లేదా చేతనకి మరో విధమైన పరిమితులు కూడా ఉంటాయి. మన అంతర్యంలో జరిగే సంఘటనలు అన్నీ మన సచేతనమైన స్పృహలోకి రావాలని లేదు. కొన్ని సంఘటనలు మన సచేతన మనస్సు అనే స్థాయి కన్నా కాస్త కిందుగా అంటే అచేతనంగా జరిగిపోతాయి. గొప్ప లోదృష్టి చేతనే అవి జరిగినట్టు తెలుసుకోగలం. మొదట్లో వాటి ప్రాముఖ్యతని మనం గుర్తించలేకపోయినా, అచేతన అనే చీకటి ప్రాంతం నుండి అవి కొన్ని సార్లు తదనంతరం పైకి తేలి మన సచేతన మనసులోకి ప్రవేశిస్తాయి.

కొన్ని సార్లు అలాంటి ఎరుక మనకి కలలలో సంభవిస్తుంది. సామాన్యంగా ఆంతరిక విషయాలలో అచేతనమైనది ఏదైనా ఉంటే అది మనకి కలలలో తేటతెల్లం అవుతుంది. అలా తేటతెల్లం అయిన విషయం తార్కికమైన భాషా రూపంలో ఉండదు. చిత్రాల రూపంలో, ప్రతీకల రూపంలో ఉంటుంది. అసలు మనకి చరిత్ర వల్ల తెలిసేదేమంటే అచేతన గురించి మన అవగాహన మొట్టమొదట స్వప్నాల అధ్యయనం వల్లనే తెలిసింది.

మనలో ఉండే "రెండు మనసులు"

కలల మీద చేసిన అధ్యయనాల ఆధారంగానే మనస్తత్వ శాస్త్రవేత్తలకి అసలు అచేతన అనేది ఒకటి వుందన్న అవగాహన కలిగింది. దీన్ని బట్టి ప్రతీ మనిషిలోను "ఇద్దరు వ్యక్తులు" ఉన్నారని అనుకోవాలి. ఒకే మనిషిలో రెండు మనసులు అన్న మాట. ఒకే వ్యక్తిలో పలు వ్యక్తిత్వాలు ఉండడం అనేది ఒక విధమైన మనోవైకల్యంగా భావిస్తాం. దీన్నే మనస్తత్వ శాస్త్రంలో Multiple Personality Disorder (MPD) అంటారు. కాని ఇది అలాంటిది కాదు. ఇక్కడ మనం చెప్పుకునే రెండు మనసులు – సచేతన మనస్సు, అచేతన మనస్సు –

అనేవి సహజమైనవి. అవి వైకల్యానికి చిహ్నాలు కావు. ఈ రకమైన మనోనిర్మాణం మానవ చరిత్రలో తొలి దశల నుండి వస్తున్న ఒక విధమైన మానసిక వారసత్వం.




మలయాళం సినిమా మణిచిత్ర తరు లో MPD  తో బాధపడుతున్న ఓ వ్యక్తి చిత్రీకరణ

మానవ చేతన ఎంతో నెమ్మదిగా, ప్రయాసభరితంగా ఎన్నో సహస్రాబ్దాల పాటు ఎదిగి ప్రస్తుతం మనం చూస్తున్న నాగరక దశకి చేరుకుంది. లిఖిత భాష మొదలైన నాటి నుండి నాగరికత మొదలయ్యింది అని తలపోస్తూ ఉంటారు. అంటే సుమారు క్రీ.పూ. 4000 అన్నమాట. అయితే ఈ నియమానికి లోతైన తార్కిక సంజాయిషీ వంటిది ఏమీ లేదు.  ఆ ఎదుగుదల లేక మానసిక పరిణామ యాత్ర ఇంకా ముగియలేదు. ఎందుకంటే మానవ చేతనలో ఇంకా ఎన్నో భాగాలు గాఢమైన చీకటిలో మునిగి వున్నాయి.



ఆర్. ఎల్. స్టీవెన్సన్ రాసిన డా. జెకిల్ అండ్ మిస్టర్ హైడ్ నవలలో ముఖ్య పాత్ర చిత్రం. ఈ కథలో ఆ పాత్ర చేతన రెండుగా విభజించబడి ఉంటుంది. ఒక అంశం సంస్కారవంతమైనది (డాక్టర్ జెకిల్), రెండవది దాని చీకటి పార్శ్వం (మిస్టర్ హైడ్).

అచేతన అనేది లేదు అని ఎవరైనా అనుకుంటున్నారంటే వాళ్లు చేతన పట్ల మన అవగాహన సంపూర్ణంగా వుందని భావిస్తున్నారన్న మాట. భాహ్య ప్రకృతి గురించి మనకి సంపూర్ణ  జ్ఞానం ఉందని అనుకోవడం ఎంతో పొరబాటో, మనలో అచేతన అనేది లేదని అనుకోవడం కూడా అంతే తప్పు. కొంత మంది ఎప్పుడూ పాత భావాలనే పట్టుకు వేలాడుతూ, కొత్త భావాలకి అడ్డుపడుతుంటారు. అలాంటి వాళ్లే అచేతన యొక్క ఉన్కిని తిరస్కరిస్తుంటారు.

మానవ చిత్తంలో ఈ అజ్ఞాత విభాగం యొక్క ఉన్కిని ఒప్పుకోవడంలో ఎందుకింత సమస్య ఎదురవుతోంది? దానికి కొన్ని చారిత్రక కారణాలు ఉన్నాయి. మన పరిణామ చరిత్రలో చైతన్యం అనేది ఇటీవలే అలవడిన ఒక సామర్థ్యం. అది ఇంకా "ప్రయోగాత్మక" దశలో వుంది. కాస్త పెళుసుగా, అస్థిరంగా, సులభంగా భంగపడే లక్షణం కలిగి వుంది. ఆదిమ, ఆటవిక తెగలని అధ్యయనం చేసే మానవశాస్త్రవేత్తలు (anthropologists) ఒక ఆసక్తికరమైన విషయం గమనించారు. అలాంటి తెగల వారిలో కనిపించే ముఖ్యమైన మానసిక రుగ్మత "ఆత్మ నాశనం" ("loss of soul"). అంటే "నేనొక వ్యక్తిని" అన్న భావన పూర్తిగా తుడిచిపెట్టుకుపోవడం గాని, లేదా ఆ భావనలో లోతైన దుష్పరిణామాలు రావడం గాని జరగడం. దీన్ని బట్టిలో మన చేతన ఎంత అస్థిరంగా, పెళుసుగా ఉంటోందో అర్థమవుతుంది.

ఆధునిక మానవుడిలో చేతనకి, ఆ ఆదిమ తెగలకి చెందిన మానవుడి చేతనకి మధ్య ఎంతో తేడా వుంటుంది. మనలో ఉన్నట్టుగా వారికి చేతన అంటే ఒక అఖిలమైన, అవిభాజ్యమైన ఏకైక తత్వం కాదు. ఉదాహరణకి వారిలో కొన్ని తెగలలో ప్రతీ వ్యక్తికి తన సొంత ఆత్మతో పాటు ఒక "వృక్షాత్మ" (bush soul) ఉంటుంది అన్న నమ్మకం ఒకటి వుంటుంది. ఈ వృక్షాత్మ ఒక అడవి మృగంలోనో, ఓ చెట్టులోనో అవతరించి వుంటుంది. దాన్ని కలిగిన వ్యక్తికి ఆ మృగంతోనో, లేక చెట్టుతోనో ఒక విధమైన అవినాభావ సంబంధం ఉంటుంది. దాంతో ఒక విధమైన తన్మయత్వాన్ని (తత్ + మయ త్వం = 'అదే నేను' అనే భావన) అనుభూతి చెందుతాడు. ఫ్రాన్స్ కి చెందిన మానవజాతుల శాస్త్రవేత్త (ethnologist) లూసియెన్ లివీ బ్రూల్ కూడా ఇలాంటి అనుభూతిని, నమ్మకాన్ని ఒప్పుకుంటూ దానికి "అధ్యాత్మిక పాత్రత్వం" (mystical participation) అని పేరు పెట్టాడు. ఒక వస్తువుతోనో, వ్యక్తితోనో తన్మయత్వాన్ని అనుభూతి చెందడం అనేది చాలా సహజమైన మానసిక ప్రవృత్తి అని నేను కూడా భావిస్తాను.

ఆదిమ తెగలలో ఇలాంటి తన్మయత్వం ఎన్నో రూపాలు తీసుకుంటుంది. ఆ "వృక్షాత్మ" ఒక జంతువు అయినట్లయితే ఆ జంతువు దానికి సంబంధించిన మనిషికి ఒక విధమైన సోదర జీవి అవుతుంది. ఉదాహరణకి ఒక మనిషికి ఓ మొసలి సోదర జీవి అయినట్లయితే, ఆ మనిషి మొసళ్లు ఎక్కువగా ఉండే నదిలో ఈదుతున్నప్పుడు కూడా మొసళ్ల నుండి అతడికి ఏ ప్రమాదమూ ఉండదని వాళ్లు నమ్ముతారు. అలాగే ఒక మనిషికి ఓ చెట్టు సోదర జీవి అయినట్లయితే, ఆ చెట్టుకి ఆ మనిషి మీద ఒక విధమైన అధికారం ఉంటుందని నమ్ముతారు. అంతే కాకుండా సోదర జీవికి (ఆ మొసలికి గాని, చెట్టుకి గాని) ఏదైనా అపాయం కలిగితే, ఆ మనిషికి కూడా హాని కలిగినట్టే భావిస్తారు.

ఇక మరి కొన్ని తెగలలో అయితే ఒకే మనిషిలో ఎన్నో ఆత్మలు ఉంటాయని భావిస్తారు. అంటే మనిషి యొక్క చేతన చిన్న చిన్న ముక్కలుగా విభజించబడి వుందన్నమాట. అంటే వారిలో చేతన పరస్పర అనుభంధం గల పలు అంశాలుగా ఉందన్నమాట. ఇలాంటి తార్కాణాలు చూస్తుంటే మానవ చేతన ఇంకా పూర్తిగా ఏకీకృతం కాలేదని అర్థమవుతోంది. చిన్న పాటి మనోఘాతం తగిలినా, భావావేశం ఏ మాత్రం కట్టలు తెంచుకున్నా అఖిలంగా, సమైక్యంగా ఉండే చేతన ముక్కలయ్యే ప్రమాదం వుందని అర్థమవుతోంది.


మానవ చేతన విచ్ఛిన్నమైన ఉన్న స్థితి మానవాళి యొక్క శైశవ దశలకి మాత్రమే సంబంధించింది కాదు. మనం 'ఆధునిక' అని చెప్పుకునే ప్రస్తుత మానవతకి కూడా ఈ స్థితి వర్తిస్తుంది. మనకి కూడా కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మనం అంటే ఎవరో తెలీని, మనని మనమే మర్చిపోయే విచిత్ర పరిస్థితి ఏర్పడే అవకాశం వుంది. భావావేశం చేత చేతన పూర్తిగా క్రమ్ముకోబడినప్పుడు, హేతువుని విస్మరించి మనం విపరీతంగా ప్రవర్తించినప్పుడు, మనకి సంబంధించిన ముఖ్యమైన విషయాలని కూడా మనం తాత్కాలికంగా

మార్చిపోయినప్పుడు మన చేతనలో కూడా చీలికలు ఏర్పడ్డాయన్నమాట. అలాంటప్పుడే అవతలి వాళ్లు మనని "ఏవయ్యింది నీకు? ఏమైనా దెయ్యం పట్టిందా?" అని అడుగుతుంటారు. అలాంటప్పుడు మనం "అట్టే ఏం లేదు, నా మీద నాకు వశం తప్పింది" అని సంజాయిషీ చెప్పుకుంటాం. కాని ఆత్మసంయమనం లేదా ఆత్మనిగ్రహం అనేది చాలా అరుదైన లక్షణం. మన మీద మనకి అన్ని వేళల్లో పూర్తి నిగ్రహం ఉన్నట్టు అపోహ పడతాం. కాని మన మీద మనకి ఎంత నిగ్రహం ఉందో మన కన్నా మన హితులకి, స్నేహితులకి తెలుస్తుంది.

అత్యుత్తమమైన నాగరికత ఉన్న సందర్భాలలో కూడా మానవ చేతన స్థిరమైన అవిచ్ఛిన్నత గల చేతనని సాధించలేదు. చిన్న దెబ్బకే విరిగి ముక్కలయ్యే లక్షణం చేతనది. చేతనలోని ఒక భాగాన్ని తక్కిన చేతన నుండి వేరు చేసుకోగలిగడం చాలా విలువైన లక్షణం. దాని వల్లనే ఒక తరుణంలో ఒక దాని మీదనే చిత్తాన్ని కేంద్రీకరించగల సామర్థ్యం ఏర్పడుతుంది. కాని ఉద్దేశపూర్వకంగా చేతనలోని ఒక భాగాన్ని వేరుచేసుకోవడం వేరు, అప్రయత్నంగా, అసంకల్పితంగా, మనకే తెలియకుండా మన చేతన రెండుగా చీలిపోవడం వేరు. మొదటిది నాగరిక విజయం, సంస్కృతికి కొలమానం, రెండవది ఆదిమమైన "ఆత్మ నాశనం" లేదా న్యూరోసిస్ ని కలుగజేసే ఓ దుష్పరిమాణం.

ఈ నేపథ్యంలోనే మనం కలల ప్రాముఖ్యత గురించి కొంచెం చెప్పుకోవాలి. మనలో అప్రయత్నంగా జరుగుతూ అస్థిరంగా, అవిస్పష్టంగా, అవిశ్వసనీయంగా ఉండే ఊహాగానాలు కలలు. ఈ రంగంలో నా భావాలు కొన్నేళ్లుగా ఎలా పరిణామం చెందిందీ చెప్తాను. మనలో ప్రతీకాత్మకంగా వ్యవహరించే సామర్థ్యానికి వేళ్లు మన కలలలో ఉన్నాయని నేను ఎలా తెలుసుకున్నదీ వివరిస్తాను.

మన చేతనకి ఒక అచేతనమైన నేపథ్యం ఉందని గుర్తించి, ఆ అచేతనని ప్రయోగాత్మకంగా పర్యటించిన మార్గగాములలో ప్రథముడు సిగ్మండ్ ఫ్రాయిడ్. మన కలలలోని సంఘటనలు కేవలం యాదృచ్ఛికం కావని, మన చేతనలోని సంఘటనలకి, సమస్యలకి అవి అద్దం పడతాయని ఫ్రాయిడ్ గుర్తించాడు. ఇది నిరాధారిత భావనో, నమ్మకమో కాదు. మన సచేతన అనుభవాలకి, న్యూరాటిక్ రోగ లక్షణాలకి మధ్య సంబంధం వుందని ప్రకటించి పియర్ జేనెట్ (Pierre Janet) వంటి ప్రఖ్యాత న్యూరాలజిస్టుల భావాలతో ఈ భావం ఏకీభవిస్తోంది. ఒకప్పుడు సచేతనంగానే వున్నా, రోగ ప్రభావం వల్ల చేతన నుండి వేరు పడ్డ స్థితులే న్యూరాటిక్ రోగ లక్షణాలుగా వ్యక్తం అవుతున్నాయని దీన్ని బట్టి మనం అర్థం చేసుకోవాలి.




1 Sigmund Freud (Vienna)
2 Otto Rank (Vienna)
3 L u d w i g Binswanger (Kreuzlingen)
4 A A Brill
5 Max Eitingon (Berlin)
6 James J. Putnam (Boston)
7 Ernest Jones (Toronto)
8 W i l h e lm Stekel (Vienna)
9 Eugen Bleuler (Zurich)
10 Emma J u n g (Kusnacht)
11 Sandor Ferenczi (Budapest)
12 C. G J u n g (Kusnacht)

ఇరవయ్యవ మనోవిశ్లేషణకి మూలకర్తలైన పలువురు ప్రముఖుల కూటమి. 1911 లో జర్మనీ లోని వైమార్ లో, కాంగ్రెస్ ఆఫ్ సైకోఅనాలిసిస్ లో తీయబడ్డ ఫోటో.

ఇరవయ్యవ శతాబ్దపు తొలిదశలలో ఫ్రాయిడ్ మరియు జోసెఫ్ బ్రాయర్ లు ఈ రంగంలో ఓ ముఖ్యమైన విషయాన్ని కనుక్కున్నారు. హిస్టీరియా, కొన్ని రకాల నొప్పి, విపరీతమైన ప్రవర్తన మొదలైన న్యూరాటిక్ లక్షణాలకి నిజానిక ఒక ప్రతీకాత్మక అంతరార్థం వుందని గమనించారు. ఆ లక్షణాల ద్వార మన అచేతన మనస్సు తనను తాను వ్యక్తం చేసుకుంటోంది.  అది మన సచేతన మనస్సుకి ఏదో చెప్తోంది. ఉదాహరణకి ఓ బాధాకరమైన క్లిష్టపరిస్థితిలో చిక్కుకున్న వ్యక్తికి, ఏదైనా మింగడానికి ప్రయత్నించినప్పుడల్లా గొంతులో కండరాలు బిగుసుకుపోయి, బాధ కలగవచ్చు. అంటే ఆ పరిస్థితిని అతడు “దిగమింగలేక పోతున్నాడు” అన్నమాట. అలాంటి పరిస్థితుల్లోనే, మానసిక వత్తిడి బాగా ఎక్కువగా ఉన్న స్థితిలో, మరో వ్యక్తికి ఆస్తమా దెబ్బ తగలవచ్చు. అలాంటప్పుడు “అతడి ఇంట్లో పరిస్థితి ఉక్కిరిబిక్కిరి చేస్తూ ఊపిరి సలపనీయకుండా వుంది” అంటామేమో. ఇక మూడో వ్యక్తి విచిత్రమైన పరిస్థితుల్లో కాళ్లు చచ్చుబడిపోయి నడవలేకపోవచ్చు. అతడిది “ఇక ఒక్క అడుగు కూడా ముందుకు వెయ్యలేని గడ్డు పరిస్థితి” అన్నమాట. ఇక నాలుగో వ్యక్తికి ఏం తిన్నా వాంతి అవుతూ వుంటుంది. ఏదో చేదు వాస్తవాన్ని అతడు “జీర్ణించుకోలేక పోతున్నాడు” అన్నమాట. ఇలాంటి ఉదాహరణలు ఎన్నయిన ఇవ్వొచ్చు. మనని అచేతనంగా కలవరపెడుతున్న సమస్యలు ఈ విధంగా భౌతికంగా వ్యక్తం కావచ్చు. ఇలా విపరీత ధోరణిలో కాకుండా, సామాన్యంగా  తరచుగా మన అచేతన కలల ద్వార కూడా వ్యక్తం అవుతూ ఉంటుంది.

తమ పేషెంట్ల కలలతో పరిచయం వున్న ఏ మనస్తత్వ శాస్త్రవేత్తకైనా ఆ కలలలోని వైవిధ్యం, ఆ పేషెంట్ల భౌతిక లక్షణాలలోని వైవిధ్యం కన్నా చాలా ఎక్కువ అని అర్థమవుతుంది. వారి కలలలో చిత్రవిచిత్రమైన లోకోత్తర ఊహాగానం కనిపిస్తుంది. కాని మనోవిశ్లేషకులు (psychoanalysts) ఫ్రాయిడ్ రూపొందించిన స్వేచ్ఛానుసంధాన (free association) పద్ధతితో ఈ కలలని శోధించడానికి పూనుకుంటే, ఈ కలలన్నీ కొన్ని ప్రాథమిక వర్గాలుగా విడిపోవడం కనిపిస్తుంది. వాటిలో ఒక గుర్తించదగ్గ విన్యాసం కనిపిస్తుంది. మనోవిశ్లేషణ యొక్క అభివృద్ధి క్రమంలో ఈ విధానానికి ముఖ్య పాత్ర వుంది. ఫ్రాయిడ్ ఈ విధానాన్ని ఉపయోగించి, కలలని ఆసరాగా చేసుకుని, రోగి యొక్క అచేతనలో దాగి వున్న సమస్యని శోధించడానికి ప్రయత్నించాడు.

ఈ రంగంలో ఫ్రాయిడ్ ఓ అద్భుతమైన సత్యాన్ని గమనించాడు. స్వాప్నికుణ్ణి (dreamer) తన కలల గురించి స్వేచ్ఛగా మాట్లాడనిస్తే, ఆ కలలు స్ఫురింపజేసిన ఆలోచనలని స్వేచ్ఛగా వ్యక్తం చేయనిస్తే, క్రమంగా తన అంతర్యాన్ని బయటపెడతాడు. తన సమస్యకి మూలమైన అచేతనా నేపథ్యాన్ని బహిర్గతం చేసుకుంటాడు. తను చెప్పిన విషయాల ద్వార మాత్రమే కాక, తను కావాలని చెప్పకుండా వొదిలేసిన విషయాల ద్వార కూడా తన అచేతనలోని అంశాలు అనుకోకుండా బయటపడతాయి. మొదట్లో అతడి ఆలోచనలు అర్థం లేకుండా, సంబంధం లేకుండా అనిపించొచ్చు. కాని కాలక్రమేణా ఏ భావాలనైతే అతడు తప్పించుకోవాలని చూస్తున్నాడో,

ఏ బాధాకరమైన ఆలోచనని, లేక అనుభవాన్ని అతడు అణగదొక్కాలని చూస్తున్నాడో దాన్ని సులభంగా పట్టేయొచ్చు. రోగి ఎంత కప్పిపుచ్చుకోవాలని ప్రయత్నించినా తను మాట్లడే ప్రతీ మాట తన అచేతన లోని సమస్యనే గుంభనంగా సూచిస్తూ ఉంటుంది. అనుభవజ్ఞుడైన మనోవిశ్లేషకుడు అయితే ఆ రహస్యం ఏంటో ముందే ఊహిస్తాడు. తదనంతరం రోగి తన రహస్యాన్ని బయటపెట్టినప్పుడు విశ్లేషకుడు తను ఊహించిన దాంతో పోల్చుకుని నిర్ధారించుకుంటాడు. ఫ్రాయిడ్ ప్రతిపాదించిన “అణగదొక్కబడ్డ భావావేశాల సిద్ధాంతం” (theory of repression) లోని మూలభావన ఇదే. ఈ సిద్ధాంతం గురించి అభ్యంతరం చెప్పడానికేమీ లేదు. కలలలో కనిపించే ప్రతీకల అంతరార్థం “ఇష్టకామ్యసిద్ధి” (wish fulfilment) అన్న భావన కూడా సమంజసంగానే వుంది.



స్విస్ మనస్తత్వ శాస్త్రవేత్త హెర్మన్ రోర్షాహ్ రూపొందించిన “ఇంకుమచ్చ” పరీక్ష. మనోవిశ్లేషణలో అలాంటి చిత్రాన్ని చూపించి అది రోగి మనసులో ఎలాంటి ఆలోచనలని ప్రేరేపిస్తోందో చెప్పమంటారు. ఆ ప్రక్రియ వల్ల రోగి ఉపచేతనలోని అంశాలని బయటపెట్టే ప్రయత్నం జరుగుతుంది.

ఫ్రాయిడ్ కలలకి చాలా ప్రాముఖ్యత నిచ్చాడు. స్వేచ్ఛానుసంధాన పద్ధతికి కలలు ఒక రకమైన కొనసాగింపుగా పరిగణించాడు. కాని ఈ దృక్పథం పూర్తిగా సరికాదని కొంతకాలం తరువాత నాకు అనిపించింది. కలలలో మన

అచేతన నుండి పుట్టుకొచ్చే పలువన్నెల ఊహాగానాలన్నీ కేవలం కోర్కెలు తీర్చుకోడానికి చేసే ప్రయత్నం అంటే మింగుడు పడలేదు. కలల నుండి మనం తెలుసుకోవలసిన మరింత ప్రగాఢమైన సత్యం మరింకేదో ఉంటుందని అనిపించింది.

ఈ దిశలో నా సందేహాలు బయల్దేరడానికి కారణం నా మిత్రుడికి జరిగిన ఓ అనుభవం. ఆ మిత్రుడు ఓ సారి రష్యాలో ఓ సుదీర్ఘమైన రైలు యాత్రలో ఉండగా ఆ అనుభవం జరిగింది. ఆ వ్యక్తికి సిరిలిక్ లిపి[1] (Cyrillic script) అంతకు ముందు తెలీదు. దారి పొడవునా రైల్వే స్టేషన్లలో ఊరి పేర్లు ఆ లిపిలోనే రాసి వున్నాయి. ఆ లిపిలో రాసిన సూచనలు చదువుతూ, ఆ అక్షరాల కేసి తదేకంగా చూస్తూ, వాటి గురించి ఆలోచిస్తూ, ఒక రకమైన ధ్యాన స్థితిలో మునిగిపోయాడు ఆ వ్యక్తి.

ఆ స్థితిలో ఆ అక్షరాలు అతడి చేతన లోతులని తడిమాయి. అతడి మనసులో ఏవో పాత జ్ఞాపకాలు వేగంగా మెదిలాయి. ఎప్పుడో మనసు లోతుల్లో పూడుకుపోయిన కొన్ని చేదు సంగతులు పైకి తేలాయి. సచేతన మనస్సు ఎప్పుడో మరచిపోయిన, సచేతన మనసు నుండి ఎప్పుడో బహిష్కరించబడిన సంగతులవి. ఆ స్థితిలో అతడు తనలో దాగిన “మానసిక సంక్లిష్టాల” (complexes) ని స్పృశించాడన్నమాట. తనని కలవరపెడుతున్న మనోవికారాలకి, న్యూరాటిక్ లక్షణాలకి కారణాలైన, అణగదొక్కబడ్డ భావావేశాలవి.

[1] సిరిలిక్ లిపి – రష్యా లోను, దానికి పొరుగు దేశాల్లోను వాడబడే ఓ ప్రముఖ లిపి.

ఈ ఉదంతం విన్నాక స్వేచ్ఛానుసంధాన పద్ధతికి కొనసాగింపుగా కలలని మాత్రమే వాడాల్సిన పన్లేదని అర్థమయ్యింది. రోగి యొక్క అచేతనలో దాగి వున్న మానసిక సంక్లిష్టాలని చేరుకోడానికి ఇతర మార్గాలు కూడా ఉన్నాయి. ఆ యాత్రకి ప్రేరణ ఎన్నో చోట్ల నుండి రావచ్చు. అవి సిరిలిక్  అక్షరాలు కవచ్చు, ఓ స్ఫటిక గోళం (crystal ball) కావచ్చు, ఓ ఇష్టదేవతా మూర్తి కావచ్చు, లేదా ఓ ఆధునిక చిత్తరువు కావచ్చు... మరే ఇతర అత్యంత సామాన్య దైనిక సంఘటన అయినా కావచ్చు. ఇవన్నీ అచేతనలోకి అడుగుపెట్టడానికి వీలైన ద్వారాలు.  వాటి లాగే కల కూడా మరో ద్వారం. కాని కలలకి ఓ ప్రత్యేకత వుంది. ఏదో హార్దిక సంక్షోభం వల్ల ఏర్పడ్డ స్వాభావిక సంక్లిష్టాల (habitual complexes) నుండి ఉత్పన్నం చెందుతాయి కలలు. (స్వాభావిక సంక్లిష్టాలు అంటే మన చేతనలోని అత్యంత సున్నితమైన స్థానాలు. బాహ్య ప్రపంచపు ప్రేరణలకి సున్నితంగా స్పందించి బాధపడే అంతరంగ అంశాలు.) అందుచేతనే స్వేచ్ఛానుసంధానం వల్ల ఏ కలనైనా ఆరంభంగా తీసుకుని  మన చేతనలోని అత్యంత కీలక రహస్యాలని చేరుకొవచ్చు.

ఈ రకమైన చింతనతో మనస్తత్వ శాస్త్రంలో నా పురోగమనం ఓ కొత్త మలుపు తిరిగిందని చెప్పాలి. అప్పట్నుంచి కలలలోని కేంద్ర భావన నుండి మారీ దూరంగా తీసుకుపోయే "స్వేచ్ఛానుసంధానా"లని అనుసరించడం మానేశాను. కల నుండి దూరంగా పోతూ, కలలో లేని దాన్ని అల్లుకుపోవడం కన్నా, కేవలం కల మీద దృష్టి కేంద్రీకరించి కల ఏం చెప్తుందో చూడాలని నిశ్చయించుకున్నాను. అలా  చేసినప్పుడు కల ద్వార అచేతన మనకు ఏం చెప్పాలని చూస్తోందో అర్థమవుతుందని అనిపించింది.

కల పట్ల ఈ విధంగా నా దృక్పథం మారాక కలలని విశ్లేషించే విధానం కూడా క్రమంగా మార్చుకున్నాను. ఈ కొత్త పద్ధతితో కలల యొక్క వివిధ ముఖాలని క్షుణ్ణంగా విశ్లేషించడానికి వీలయ్యింది. సచేతన మనసు చెప్పే కథకి  ఓ ఆది, ఓ క్రమం, ఓ అంతం ఉంటాయి. కాని కలకి అలాంటివేం ఉండవు. దేశకాలాలలో కల యొక్క అమరిక చాలా భిన్నంగా ఉంటుంది. ఒక వస్తువుని క్షుణ్ణంగా పరిశీలించాలంటే దాన్ని చేతిలో పట్టుకుని అటు ఇటు తిప్పుతూ అన్ని కోణాల నుంచి చూస్తాము. అలాగే కలని అర్థం చేసుకోవాలంటే దాన్ని పలు కోణాల నుండి చూడాలి.

ఇవన్నీ ఎందుకు చెప్తున్నానో మీకు అర్థమయ్యే ఉంటుంది. ఫ్రాయిడ్ వాడిన 'స్వేచ్ఛానుసంధాన" పద్ధతి పట్ల నాకు విముఖత ఎలా పెరిగిందో చెప్పుకోవడమే నా ఉద్దేశం. కల నుండి బయల్దేరి 'స్వేచ్ఛానుసంధానం' పేరుతో ఇష్టమొచ్చినట్టు ఊహాగానాలు అల్లడం నాకు మంచిది కాదనిపించింది. అందుకు బదులుగా వీలైనంత వరకు కలకే పరిమితమై వుండాలి, కలకి సన్నిహితంగా ఉండాలి. నిజమే స్వేచ్ఛానుసంధానాలని జాగ్రత్తగా అనుసరిస్తే రోగి యొక్క మానసిక సంక్లిష్టాలని కనిపెట్టొచ్చు. కాని నా ఉద్దేశంలో అంతకన్నా లోతైన లక్ష్యం ఒకటుంది. కేవలం మానసిక సంక్లిష్టాలని కనిపెట్టడమే ఉద్దేశం అయితే అందుకు మరెన్నో పద్ధతులు ఉన్నాయి. ఉదాహరణకి మనస్తత్వ శాస్త్రవేత్తలు ఇందుకోసం 'పదానుసంధాన పరీక్షలు' (word-association tests)  వాడుతారు. ఈ పరీక్షల్లో రోగికి కొన్ని పదాలు చూపించి ఆ పదాలు రోగి మనసులో ఎలాంటి భావాలు స్ఫురింపజేస్తున్నాయో ఏకరువు పెట్టమంటారు. అలా పెడుతున్నప్పుడు రోగి మనసులో, అచేతనలో ఏం దాగి వుందో బయటపడుతుంది. ఒక వ్యక్తి యొక్క అంతర్యాన్ని, అంతర్వ్యక్తిని సమగ్రంగా అర్థం చేసుకోవాలంటే, ఆ ప్రయత్నంలో ఆ వ్యక్తి యొక్క కలలు, కలలు ప్రదర్శించే ప్రతీకలు ఎంతో దోహదం చేస్తాయి.

ఉదాహరణకి లైంగిక చర్యని ప్రతీకాత్మకంగా వ్యక్తం చెయ్యడానికి ఎంతో వైవిధ్యం గల ప్రతీకలని, చిత్రాలని వాడుకోవచ్చని అందరికీ తెలిసిందే. ఆ ప్రతీకలు చూపిస్తున్న ఆనవాళ్ల వెంబడి 'అనుసంధాన' పద్ధతిలో వెతుక్కుంటూ పోతే రోగి యొక్క లైంగిక భావాల గురించి, ఆ భవాలలో వేళ్లూని వున్న మానసిక సంక్లిష్టాల గురించి తెలుసుకునే అవకాశం వుంది. కాని విషయం ఏంటంటే అలాంటి సంక్లిష్టాలని వెలికి తీయడానికి లైంగిక చిత్రాలే అక్కర్లేదు. ఏదో అజ్ఞాత లిపికి చెందిన అక్షరాలని ధ్యానిస్తూ  పగటి కలలోకి జారుకున్న స్థితిలో కూడా సంక్లిష్టాలని కనిపెట్టొచ్చు. ఇలాంటి తార్కాణాలు చూశాక నేనో నిర్ణయానికి వచ్చాను. కలలు మనకిచ్చే సందేశం కేవలం ఒక లైంగిక ఉపమాలంకారం కాదు. కలలలో అంతకన్నా విలువైన సారం ఎంతో ఉంటుంది అనిపించింది.

ఈ  విషయాన్ని సోహరణంగా వివరిస్తాను. ఉదాహరణకి ఓ తాళం కప్పలో తాళం చెవి తిప్పినట్టో, ఓ ధృఢమైన కర్రని విసిరినట్టో, ఓ పెద్ద దుంగతో ఓ బలమైన ద్వారాన్ని బద్దలు కొట్టినట్టో కల వచ్చిందని అనుకోండి. ఈ చిత్రాలన్నిటినీ లైంగిక ఉపమాలంకారాలుగా పరిగణించొచ్చు. కాని ఒక వ్యక్తిలో అతడి అచేతన వీటిలో ఏదో ఒక ప్రత్యేక ప్రతీకను మాత్రమే ఎందుకు ఎంచుకుంది? ఒక వ్యక్తి తాళం చెవి గురించి కల గంటాడు, కర్ర గురించి కలగనడు. మరో వ్యక్తి బలమైన దుంగని కల గంటాడు, అతడి కలలో తాళం చెవి కనిపించదు. దీన్ని బట్టి నాకు అర్థమవుతున్నది ఏంటంటే కలలో మనం చూడాల్సింది లైంగిక విషయాన్ని కాదు. కల నుండి మనం అర్థం చేసుకోవాల్సినది మరింకేదో వుంది.



తాళంచెవి – తాళంకప్పులకి లైంగికేతర అన్వయాలు కూడా ఉండే అవకాశం వుంది. పదిహేనవ శతాబ్దపు ఫ్లెమిష్ చిత్రకారుడు  కాంపిన్ వేసిన పై వర్ణచిత్రంలో ద్వారం ఆశకి చిహ్నం, తాళం కప్ప కరుణకి చిహ్నం, తాళంచెవి భక్తికి సంకేతం.

ఈ విధంగా ఆలోచిస్తూ నేనో అవగాహనకి వచ్చాను. కలలో అత్యంత స్పష్టంగా, నిర్ద్వంద్వంగా ఉన్న అంశాలనే మనం అన్వయానికి వాడుకోవాలి. కలలతో ఓ చిక్కుంది. కలలతో ఒక విధంగా వ్యవహరిస్తూ మనం కల నుండి దూరంగా పోతాం. మరో రకంగా వ్యవహరిస్తే కల యొక్క సారాన్ని తాకుతాం. “స్వేచ్ఛానుసంధాన” పద్ధతి మనని జిగిబిగి గతిలో కల నుండి దూరంగా తీసుకుపోతుంది. కాని నేను రూపొందించిన పద్ధతి కల చుట్టూ ప్రదక్షిణ చేయిస్తూ కల యొక్క కేంద్రానికి తీసుకుపోతుంది. తన కలని వర్ణిస్తున్నప్పుడు స్వాప్నికుడు (కల గన్నవాడు) ఒక్కోసారి కల నుండి దూరంగా వెళ్లిపోతుంటాడు. అలా వెళ్లి పోయే ధోరణి కనిపించినప్పుడల్లా నేను తిరిగి అతణ్ణి కల వద్ద ఈడుస్తుంటాను. నా వద్దకి వచ్చిన రోగులతో నేను ఎన్నో సార్లు అంటుంటాను, “మళ్లీ మీ కల వద్దకే వద్దాం. సరిగ్గా మీ కల ఏం చెప్తోందో చెప్పండి.”

ఉదాహరణకి ఒక సారి ఒక రోగి చింపిరి జుట్టుతో, మాసిన బట్టలతో, తప్పతాగి వున్న ఓ స్త్రీ గురించి కల గన్నాడు. ఈ కలలో ఆ స్త్రీ అతడి భార్య అనిపించింది అతడికి. కాని వాస్తవంలో అతడి భార్య అందుకు పూర్తిగా భిన్నంగా వుంటుంది. కనుక పైపైన చూస్తే ఆ కల వట్టి కల్ల అని కొట్టిపారేయాల్సి ఉంటుంది. కలలలో ఎప్పుడూ కనిపించే చెత్తే ఇదీను అని రోగి దాన్ని త్రోసిపుచ్చాడు మొదట్లో. ఒక డాక్టరుగా నేను రోగిని అనుసంధాన పద్ధతిని వాడి కలని అన్వయించడానికి ప్రయత్నించమని ప్రోత్సహించి వుంటే అతగాడు ఆ అప్రియమైన కల నుండి వీలైనంత దూరంగా తొలగిపోయి వుండేవాడు. తన భార్యతో సంబంధం లేని ఏదో

అసంబంధమైన మానసిక సంక్లిష్టతని చేరుకునే వాడు. అందువల్ల ఈ కల గురించి ప్రత్యేకించి మనకి అర్థమయ్యేదేమీ వుండదు.

వాస్తవానికి దూరమైన అలాంటి చిత్రాన్ని (కల ద్వారా) ప్రదర్శించి అతడి అచేతన అతడికి ఏం చెప్పాలని చూస్తోంది? ఆ వ్యక్తితోను, అతడి జీవితం తోను దగ్గరి సంబంధం వున్న ఓ దిగజారిన స్త్రీ అన్న భావనని అతడి అచేతన వ్యక్తం చేస్తోంది. అయితే అలాంటి భావనని అతడి భార్య మీద ఆపాదించడం వాస్తవాల దృష్ట్యా శుద్ధ తప్పు. కనుక ఆ వికృతమైన కలకి అర్థం మరింకేదో అయ్యుంటుంది.

మనలోని గ్రంథుల నిర్మాణం బట్టి ప్రతీ మనిషిలోను స్త్రీ, పురుష అంశాలు కలగలిసి ఉంటాయని ఆధునిక జీవశాస్త్రం చెప్తుంది. కాని చాలా కాలం క్రితమే, మధ్య యుగపు కాలంలో "ప్రతీ పురుషుడి లోను ఓ స్త్రీ దాగి వుంటుంది" అనే నానుడి చలామణిలో ఉండేది. మగవాడిలో ఉండే స్త్రీ అంశానికి నేను "anima" అని పేరు పెట్టాను. పురుషుడిలో దాగి వుండే ఈ స్త్రీ అంశం ఒక విధంగా ఆ వ్యక్తి తన పరిసరాలతో ఏర్పరచుకునే సంబంధాలకి, ముఖ్యంగా స్త్రీలతో ఏర్పరచుకునే సంబంధాలకి మూర్తిరూపం. ఆ వ్యక్తి యొక్క వ్యక్తిత్వం బయటికి మామూలుగానే కనిపించొచ్చు. కాని "తన లోపల వున్న స్త్రీ" యొక్క అధమ స్థితిని అతడు బయటికి కనిపించకుండా దాచి ఉంచడానికి ప్రయత్నిస్తూ ఉండొచ్చు.

ఇందాక చెప్పుకున్న రోగి విషయంలో సరిగ్గా అదే జరిగింది. అతడిలో స్త్రీ పార్శ్వం అంత గొప్పగా లేదన్నమాట. తన కల కూడా అతడితో అదే చెప్తోంది – "నువ్వే దిగజారిన స్త్రీ లాగా ప్రవర్తిస్తున్నావు సుమా!" అంటోంది. ఆ కలకి అతడు ఖంగు తిన్నాడు. (ఇలాంటి కలలని చూసి మన అచేతన మనకి "నైతిక"

ఆదేశాలు ఇస్తుందని భావిస్తే పొరబాటే అవుతుంది. అతడి కల అతణ్ణి "నీ ప్రవర్తన మార్చుకో" మని శాసించడం లేదు. అంతవరకు అతడి సచేతన మనస్సు అతడికి "నువ్వు చాలా పెద్దమనిషివి" అన్న అపోహ కల్పిస్తోంది. కాని అతడి అచేతన ఆ అపోహ మీద దెబ్బ కొడుతూ, అతడి చిత్తంలో ఉండే అసమతౌల్యాన్ని ఎత్తి చూపుతోంది.)



"ఆనిమా" అంటే పురుషుడి అచేతనలో ఉండే స్త్రీ అంశం. "ఆనిమస్" అంటే స్త్రీ అచేతనలో ఉండే పురుషాంశం.

దీన్ని బట్టి స్వాప్నికులు (కలలు కనేవారు) తమ కలలని ఎందుకు పట్టించుకోరో, తమ కలలలోని సందేశాన్ని ఎందుకు లెక్కచెయ్యరో అర్థమవుతోంది. సచేతనకి అచేతన అంటే గిట్టదు. అలాగే చేతనకి తెలియనితనం అంటే పడదు. తనకి తెలియని దాన్ని త్రోసిపుచ్చుతుంది. ఆదిమ తెగలలో తరచు కొత్త విషయాల పట్ల

వ్యతిరేకత కనిపిస్తూ ఉంటుంది. దీన్నే మానవశాస్త్రవేత్తలు (anthropologists) “misoneism” (నవ్యతాద్వేషం?) అంటారు. ఏవైనా అవాంఛనీయ సంఘటనలు, అనుకోని సంఘటనలు జరిగినప్పుడు ఓ క్రూరమృగం ఎలా ప్రవర్తిస్తుందో, ఆదిమ తెగల వారు కూడా ఇంచుమించు అలాగే స్పందిస్తారు. కాని చిత్రం ఏంటంటే = “నాగరిక” జీవులు కూడా నూతన భావాల విషయంలో అలాగే ప్రవర్తిస్తారు. కొత్త భావాలు లోపలికి ప్రవేశించకుండా తమ మనసుల్లో బలమైన గోడలు ఏర్పాటు చేసుకుంటారు. అది నవ్య భావాల దాడి నుండి తమని తాము ఆత్మరక్షణ చేసుకునే ప్రయత్నం అన్నమాట. మనుషులు తమ కలలకి ఎలా స్పందిస్తారో చూసినప్పుడు, లేదా తమకి విభ్రాంతి కలిగించే ఆలోచనని ఎదుర్కున్నప్పుడు వారి స్పందన చూస్తే సరిగ్గా ఇదే కనిపిస్తుంది. తత్వ, విజ్ఞాన, సాహితీ రంగాల్లో  నూతన భావాలతో ముందుకు వెళ్లే యువతరానికి పాత భావాలని పట్టుకు వేళ్లాడే ఛాందసుల అవరోధం, అభ్యంతరం ఎప్పుడూ ఉంటుంది. వైజ్ఞానిక రంగాలు అన్నిట్లోకి మనస్తత్వ శాస్త్రం వయసులో ఎంతో చిన్నది. ఎప్పుడూ అచేతనతో తలపడడానికి ప్రయత్నిస్తుంది కనుక అది ఎదుర్కునే అవరోధం, లేదా “misoneism”,  అంతా ఇంతా కాదు.

## అచేతనలో గతము, భవిష్యత్తు

ఇంతవరకు కలలు అనే సమస్యని అర్థం చేసుకోడానికి కావలసిన కొన్ని ప్రాథమిక సూత్రాలని చిత్రీకరిస్తూ వచ్చాను. కలలు ఎందుకు ముఖ్యం అవుతాయంటే, మనిషిలో ప్రతీకలని ఉత్పన్నం చేసే అంతరంగ విభాగాన్ని శోధించాలంటే, అందుకు కలలు అత్యంత విలువైన మూలాలుగా పరిణమిస్తాయి. కలలతో వ్యవహరించేటప్పుడు రెండు ముఖ్యమైన విషయాలు జ్ఞాపకం ఉంచుకోవాలి. మొదటిది ఏంటంటే కలలని ఓ వాస్తవంగా స్వీకరించాలి. కలలు నిజాలు. వాటిలో ఏదో అంతరార్థం వుంది అన్న భావన తప్ప మరే ఇతర

నిరాధారిత పూర్వభావనలు  మనసులో పెట్టుకోకూడదు. రెండవది ఏంటంటే, కలలు అచేతన యొక్క  ప్రత్యేక అభివ్యక్త రూపాలు.

ఈ సూత్రాలు ఎంత లోతైనవి అంటే, ఎంత ప్రాథమికమైనవి అంటే వీటిని ఇంత కన్నా సరళంగా వ్యక్తం చెయ్యడానికి వీలుపడదు. అచేతన గురించి ఎవరికి ఎలాంటి అభిప్రాయమైనా ఉండొచ్చు. కాని అందులో శోధించి తెలుసుకో దగ్గది ఏదో వుందని మాత్రం అందరూ ఒప్పుకోక తప్పదు. కలలతో ఎంతో కొంత పరిచయం ఉన్నవారు కలలు వట్టి గందరగోళ సంఘటనలు అని అనుకుంటే అది వారి ఇష్టం. కాని కలలని మామూలు, వాస్తవ సంఘటనలుగా (నిజమే వాటికీ ఒక రకమైన వాస్తవికత ఉంటుందిగా మరి) పరిగణిస్తే వాటి అస్తిత్వానికి ఓ హేతువు ఉందని, వాటికీ ఓ లక్ష్యం, ఓ అంతరార్థం ఉంటుందని అనుకోవాల్సి వుంటుంది.

అచేతన యొక్క తత్వం ఎలాంటిదో తెలుసుకోవాలంటే మనసులో అచేతన, సచేతన అంశాల మధ్య సంబంధాన్ని ఓ సారి నిశితంగా పరిశీలించాలి. అందరికీ సుపరిచితమైన ఓ దైనిక ఘటననే తీసుకుందాం. ఏదో అనాలని నోటిదాకా వస్తుంది, కాని ఉన్నట్లుండి ఏమనాలని అనుకున్నారో మర్చిపోతారు. కొద్ది క్షణాల ముందే మన నాలిక చివర్లో ఆడిన విషయాలు ఒక్కసారిగా మనసులోంచి తుడిచిపెట్టుకుపోతాయి. లేదా ఓ స్నేహితుణ్ణి మరో మూడో మనిషికి పరిచయం చెయ్యబోతుంటారు. ఆఖరు క్షణంలో ఆ మనిషి పేరు మర్చిపోతారు. తల దిమ్మెక్కిపోతుంది, నోట మాట పెగలదు. పేరు నాలిక కొసన ఆడుతుంటుంది గాని పైకి రాదు. ఆ మనిషి పేరు మీరు మర్చిపోయారని కాదు. ఆ క్షణం ఆ పేరు అచేతనలో ఉండిపోయింది. లేదా సచేతనలో ఉన్న పేరు తాత్కాలికంగా అచేతనలోకి జారుకుంది. ఇంద్రియాల క్రియలో కూడా ఇలాంటి పరిణామాలు కనిపిస్తుంటాయి. నిరంతరాయంగా మోగుతున్న ఓ స్వరాన్ని వింటున్నారనుకోండి. పైగా ఆ

స్వరం యొక్క తీవ్రత సరిగ్గా మన వినికిడి శక్తి యొక్క సరిహద్దు వద్ద ఉందనుకోండి. అంటే దాని తీవ్రత అంతకన్నా కాస్త బలహీనంగా ఉంటే ఇక వినిపించదు అన్నమాట. అలాంటి పరిస్థితుల్లో, నిజానికి స్వరం ఆగకుండా మోగుతూనే వున్నా, మనకి మాత్రం ఆగాగి మోగుతున్న భ్రమ కలుగుతుంది. ఈ సందర్భంలో శబ్దం యొక్క మన సంవేదన (sensation) లో డోలనం (oscillation) కలగడానికి కారణం స్వరంలో వచ్చిన మార్పు కాదు. స్వరం మారకుండా మోగుతోంది. ఆ స్వరం మీద లగ్నమైన మన ధ్యాసలో ఉంది ఆ డోలనం. ఆ ధ్యాస నిలకడగా లేకుండా వస్తూ, పోతూ ఉందన్నమాట. అంటే ఆ శబ్దం మన సచేతనకి, అచేతనకి మధ్య ఊగిసలాడుతోందన్నమాట. అచేతనకి, సచేతనకి మధ్య సరిహద్దుని అటు ఇటు డోలాయమానంగా దాటుతోందన్నమాట.

ఒక అంశం మన సచేతన లో నుండి జారుకున్నంత మాత్రాన అసలు దానికి సంబంధించిన వస్తువే మాయమైనట్టు కాదు. సందు తిరిగిన కారు కనిపించకుండా పోతుంది. అంత మాత్రాన అసలు కారే గల్లంతు అయినట్టు కాదుగా! అది మన కను చూపు మేరని దాటిందంతే. అలాగే మన సచేతన లోంచి జారుకున్న ఆలోచనలు అచేతనలో ప్రవేశించాయన్నమాట. అంతేగాని అంతర్థానమై పోయాయని కాదు.

కనుక అచేతనలో ఒక భాగంలో తాత్కాలికంగా మరుగుపడ్డ ఆలోచనలు, అనుభూతులు, మనోచిత్రాలు దాగి వుంటాయి. అవి సచేతన నుండి కనుమరుగైనా తెర చాటు నుండి సచేతన మీద ప్రభావం చూపుతుంటాయి. ఓ వ్యక్తి పరధ్యానంగా ఒక గది లోంచి పక్క గదిలోకి వెళ్తాడు. తీరా ఆ గదికి వెళ్లేసరికి అక్కడికి ఎందుకు వచ్చాడో మర్చిపోతాడు. నిద్రలో నడుస్తున్నట్టు చుట్టుపక్కన వస్తువులని తడుముకుంటాడు. తన లక్ష్యాన్ని

మర్చిపోయాడు. కాని అతడి అచేతనే అక్కడి వరకు అతణ్ణి తీసుకొచ్చింది. అంతలో లక్ష్యం  జ్ఞాపకం వస్తుంది. అంటే అచేతనలో వున్నది సచేతనలోకి పైకి తేలింది అన్నమాట.

ఓ న్యూరాటిక్ వ్యక్తి ప్రవర్తనని  గమనిస్తే అతడు ఎన్నో పనులు సచేతనంగా, ఉద్దేశపూర్వకంగా చేస్తున్నట్టు కనిపిస్తాడు. కాని తీరా వాటి గురించి అతణ్ణి అడిగితే వాటి పట్ల అతడు అచేతనంగా ఉన్నట్లు తెలుస్తుంది. లేదా వాటి పట్ల అతడి ఎరుక మనం ఊహించిన దాని కన్నా చాలా భిన్నంగా ఉన్నట్టు మనకి అర్థమవుతుంది. అతడు వింటాడు గాని వినిపించుకోడు. చూస్తాడు గాని గుర్తించడు, గుడ్డిగా ఉండిపోతాడు. ఇలాంటి ఉదాహరణలు కోకొల్లలు. ఈ విషయాలు మనస్తత్వ శాస్త్రవేత్తలకి సుపరిచితాలు. న్యూరాటిక్ వ్యక్తుల మనసుల్లోని అచేతన విషయాలు సచేతనంగా ఉన్నట్టు కనిపిస్తాయి. అలాంటి వ్యక్తుల్లో ఆలోచన, భాష, చర్య సచేతనంగా ఉన్నాయో లేదో కచ్చితంగా చెప్పడం చాలా కష్టం.

ఇలాంటి సందర్భాల బట్టే హిస్టీరియాతో బాధపడుతున్న రోగులు చెప్పేదంతా అబద్ధం అని డాక్టర్లు కొట్టి పారేస్తుంటారు. నిజమే. మనతో పోల్చితే వాళ్లు చెప్పే అసత్యాలు ఎక్కువే. అయితే వాటిని “అబద్ధాలు” అనడానికి వీల్లేదు. ఎందుకంటే అవి పూర్తిగా సచేతనంగా అన్న విషయాలు కావు. వారి మనోస్థితి వల్ల వారి ప్రవర్తనలో ఒక రకమైన అనిశ్చితి నెలకొంటుంది. ఎందుకంటే వారి అచేతన వారి సచేతన వ్యవహారాలలో కలుగజేసుకుని అనూహ్యమైన విధంగా సచేతనని క్రమ్ముకుంటుంది. నిజానికి వారి స్పర్శానుభూతి లో కూడా ఈ రకమైన ఆటుపోట్లు, అనూహ్యమైన మార్పులు కనిపించవచ్చు. హిస్టీరియా పేషెంట్ విషయంలో ఒక సందర్భంలో చేతికి గుచ్చుకున్న సూది యొక్క స్పృహ కలగవచ్చు. కాని మరు క్షణం మళ్లీ గుచ్చితే ఈ సారి సూది గుచ్చిన అనుభూతి కలగకుండా పోవచ్చు. అతడి ధ్యాస ఒక ప్రత్యేక బిందువు మీద నిలపగలిగేలా

చెయ్యగలిగితే తాత్కాలికంగా అతడి శరీరం మొత్తం మీద సంవేదన లేకుండా చెయ్యడం సాధ్యమవుతుంది. అలా చెయ్యడం వల్ల ఏ గుప్త ఆందోళన వల్లనైతే అతడి సచేతనలో ఆ విధంగా చీకటి క్రమ్ముకుంటోందో ఆ ఆందోళనని నయం చెయ్యవచ్చు, తొలగించవచ్చు. ఆ తరువాత ఇంద్రియాల సంవేదన మునుపట్లా తిరిగొస్తుంది. కాని అంతవరకు మాత్రం అతడికి జరిగేదంతా అచేతనంగా మాత్రమే తెలుస్తుంటుంది.



సామూహిక "పూనకం" (mass hysteria) జరుగుతున్న సన్నివేశం. బాలీలో తన్మయత్వంలో కత్తి పట్టుకుని నాట్యాలాడే నర్తకులు కొన్ని సార్లు ఆ కత్తితో తమనే పొడిచేసుకునే ప్రమాదం వుంది.



హైటీలో (Haiti) ఘేడే అనే దేవత “పూనిన” వ్యక్తి. ఆ దేవత “పూనిన” వ్యక్తి ఎప్పుడూ కాలు మీద కాలేసుకుని, నోట్లో సిగరెట్టు పెట్టుకుని ఉంటాడట!

ఈ వైఖరి అంతా నిపుణుడు పేషెంట్ ని హిప్నటైజ్ చేసినప్పుడు స్పష్టంగా కనిపిస్తుంది. పేషెంటు అచేతనంగా ఉన్నట్టు కనిపించినా తనకి జరుగుతున్నదంతా వివరంగా తెలుసని తర్వాత నిర్ధారణ చేసుకోవచ్చు. సూదితో చేతి మీద గుచ్చిన సంఘటన గాని, సచేతన ఆవరించబడ్డ స్థితిలో  డాక్టర్ అన్న మాటలు గాని  - అన్నీ కచ్చితంగా తరువాత పేషెంట్ కి జ్ఞాపకం వచ్చేలా చెయ్యొచ్చు. ఈ సందర్భంలో నాకో స్త్రీ పేషెంట్ సంగతి గుర్తొస్తోంది. ఈ మహిళని పూర్తిగా అచేతనమైన స్థితిలో ఆసుపత్రిలో చేర్పించారు. మర్నాడు తనకి స్పృహ వచ్చినప్పుడు తనెవరో తనకి గుర్తుంది గాని, తను ఎక్కడుందో, అక్కడికి ఎలా వచ్చిందో, ఎందుకొచ్చిందో, అసలు ఆ రోజు తేదీ ఏంటో ఏమీ గుర్తులేదు. తరువాత తనని హిప్నటైజ్ చేస్తే తనకి అనారోగ్యం ఎలా కలిగిందో, ఆస్పత్రికి ఎలా వచ్చిందో, ఎవరు చేర్పించారో అన్నీ చెప్పింది. ఆ వివరాలన్నీ నిజాలేనని వేరేగా నిర్ధారణ చేసుకోవచ్చు. ఆస్పత్రిలో కచ్చితంగా ఎప్పుడు చేర్పించారో కూడా తనకి గుర్తుంది. ఆస్పత్రి లోకి వస్తున్నప్పుడు గోడ గడియారాన్ని చూడడం ఆమెకి గుర్తు.

ఇలాంటి విషయాలు చర్చిస్తున్నప్పుడు సాధారణంగా క్లినికల్ పరిశీలనలని ఆధారంగా చేసుకుని మేం మాట్లాడుతాం. ఆ కారణం చేత అసలు అచేతన గురించిన చర్చ అంతా అనారోగ్యానికి సంబంధించిన చర్చేనని వాదిస్తారు కొందరు. అచేతన గురించి ఏం ప్రస్తావించినా అది న్యూరోసిస్ కి గాని, సైకోసిస్ కి గాని సంబంధించిన విషయం అని, మామూలు మానసిక వృత్తులతో సంబంధం లేనిదని కొందరు అపోహపడతారు. కాని న్యూరాటిక్ పరిణామాలు కేవలం ఏదో వ్యాధికి సంబంధించిన చిహ్నాలు అనుకోవడం పొరబాటే. అవన్నీ

కేవలం సామాన్య మనో వ్యవహారాల యొక్క విపరీత పరిణామాలు మాత్రమే. విపరీతంగా ఉన్నాయి కనుక సామాన్య మనో వృత్తులకి వీటికి మధ్య ఏదో మౌలికమైన తేడా ఉన్నట్టు అనుకుంటారు. కాని హిస్టీరిక్ చిహ్నాలు ఆరోగ్యవంతులలో కూడా చూడొచ్చు. కాని అవి అత్యంత సూక్ష్మంగా ఉంటాయి కనుక సులభంగా గుర్తించబడవు.

ఉదాహరణకి విస్మృతి అనేది మనసులో సహజంగా జరిగే ఓ ప్రక్రియ. ధ్యాస వాటి మీద నిలవకపోవడం వల్ల కొన్ని సచేతన సంగతులు స్మృతి లోంచి జారిపోతాయి. లైట్ హౌస్ యొక్క కాంతి ఒక ప్రాంతం మీద పడి దాన్ని ప్రస్ఫుటం చేసినప్పుడు, మరొక ప్రాంతం నీడలో మిగిలి కనుమరుగు అవుతుంది. అదే విధంగా మనం ధ్యాస లగ్నం చేసిన సంగతులు స్మృతిలోకి ప్రవేశించే అవకాశం ఉంటుంది. ధ్యాస నిలవని సంగతులు విస్మరించబడే అవకాశం ఎక్కువ. ఎందుకంటే మన సచేతనలో ఒక సమయంలో కొన్ని సంగతులు మాత్రమే నిలవగలవు.

కాని విస్మరించబడ్డ విషయాలు అసలు లేకుండా పోయాయనో, లేక స్మృతి లోంచి తొలగించబడ్డాయనో కాదు. సంకల్పమాత్రం చేత వాటిని మన సచేతన లోకి రప్పించుకోలేక పోయినా, అవి ప్రచ్ఛన్నంగా ఉంటాయి. స్మృతి యొక్క గుమ్మానికి అవతల వేచి వుంటాయి. కొన్ని సార్లు ఎన్నో ఏళ్ళ పాటు పూర్తి విస్మృతిలో మిగిలిపోయిన సంగతులు కూడా ఒక్కసారిగా, అప్రయత్నంగా సచేతన లోనికి భళ్లున పెల్లుబకవచ్చు.

ఇక్కడ నేను ప్రస్తావిస్తున్నది ఒకప్పుడు సచేతనంగా చూసి, విని తరువాత మర్చిపోయిన సంగతుల గురించి. మనం అనుక్షణం ఎన్నో విషయాలు  చూస్తుంటాం, వింటుంటాం, వాసన చూస్తుంటాం, రుచి చూస్తుంటాం. అవన్నీ మనకి గుర్తుండకపోవచ్చు. ఎందుకంటే ఆ సమయంలో మనం వాటి మీద సచేతనంగా ధ్యాసం

నిలుపక పోయి ఉండొచ్చు. లేదా ఆ సంవేదనలు మరీ సూక్ష్మమైనవి కావడం వల్ల మనలో సచేతనమైన ముద్ర వేయకపోయి ఉండొచ్చు. కాని సచేతన విస్మరించినా ఆ సంగతులని అచేతన గుర్తిస్తుంది. ఇలాంటి అచేతనమైన, ప్రచ్ఛన్నమైన ఐంద్రియ సంవేదనలకి మన దైనిక జీవితంలో ముఖ్య పాత్ర ఉంటుంది. వివిధ సంఘటనలకి, వ్యక్తులకి మనం ఎలా స్పందిస్తాం అన్న దాని మీద ఈ ప్రచ్ఛన్న సంవేదనలకి గొప్ప ప్రభావం ఉంటుంది.

ఈ సందర్భంలో నాకో సంఘటన గుర్తొస్తోంది. ఆ సంఘటన గురించి నాకు చెప్పిన వ్యక్తి ఓ ప్రొఫెసరు. ఓ సారి ఇతడు తన శిష్యుడితో కలిసి ఊరి బయట ఓ రోడ్డు మీద నడుస్తున్నాడు. అలా వెళ్తుంటే ఉన్నట్లుండి తన చిన్నప్పటి జ్ఞాపకాలు వెల్లువలా తన్నుకొచ్చి తన మానసాన్ని క్రమ్ముకున్నాయి. వాళ్లు మాట్లాడుకుంటున్న మాటలకి ఆ జ్ఞాపకాలకి ఏ సంబంధమూ లేదనిపించింది. వెంటనే వెనక్కి తిరిగి ఏ చోటి నుండి అయితే ఈ జ్ఞాపకాలు మొదలయ్యాయో ఆ చోటి వరకు నడుద్దామని తన శిష్యుడికి సూచించాడు ఆ ప్రొఫెసరు. అలా వెనక్కి వెళ్తుంటే ఒక చోట అడవి బాతుల వాసన తగిలింది. తన చిన్ననాటి జ్ఞాపకాలకి కారణం ఈ వాసనే అని ప్రొఫెసరు కి వెంటనే అర్థమయ్యింది.

ఇతగాడు తన చిన్నతనంలో అడవి బాతులు ఉండే పొలాల మధ్య పెరిగాడు. ఇప్పుడు మర్చిపోయినా ఆ వాసన తన చిత్తం మీద గాఢంగా ముద్రపడిపోయింది. మొదట ఆ దారిన పోతున్నప్పుడు ఆ వాసనని అతడు ఉపచేతనంగా అనుభూతి చెందాడు. ఈ ఉపచేతన (subconscious) సంవేదన అతడి చిన్ననాటి జ్ఞాపకాలని బయటికి రప్పించింది. ఆ సమయంలో ధ్యాస మరెక్కడో వుంది కనుక ఈ వాసనని ఉపచేతనంగా మాత్రమే గుర్తుపట్టడం జరిగింది. ఆ వాసనలో ధ్యాసని మరల్చి సచేతనలోకి ప్రవేశించగలిగేంత శక్తి లేదు. అయినా ఆ కాస్త ప్రేరణ కూడా ఎప్పుడో “మర్చిపోయిన” జ్ఞాపకాలని వెలికి రప్పించింది.

ఏ విధంగా అయితే మామూలు మనుషుల్లో ఓ దృశ్యం, ఓ శబ్దం, ఓ వాసన పాత జ్ఞాపకాలని వెలిక తీయగల హేతువు అవుతుందో, న్యూరాటిక్ రోగులలో అలాంటి “సంజ్ఞ” ఓ ట్రిగ్గర్ లా పని చేసి న్యూరాటిక్ లక్షణాలు వ్యక్తమయ్యేలా చేస్తుంది. ఉదాహరణగా మంచి ఆరోగ్యం కలిగి, తన ఆఫీసులో చక్కగా పని చేసుకుంటున్న ఓ అమ్మాయినే తీసుకుందాం. మరుక్షణమే ఏ కారణమూ లేకుండా ఆమె విపరీతమైన తలనొప్పి బాధతో చతికిలబడిపోయిందని అనుకుందాం.  మరి కొన్ని ఇతర న్యూరాటిక్ లక్షణాలు కూడా అందుకు వ్యక్తమయ్యాయి. ఏం జరిగిందని శోధిస్తే విషయం అర్థమయ్యింది. ఆమెకి తెలియకుండానే ఎక్కడో దూరంలో ఓ ఓడ కూత విందామె. ఆ శబ్దం ఎప్పుడో తన ప్రియుడితో తెగిపోయిన బంధాన్ని గుర్తుకు తెచ్చింది. మర్చిపోవాలనుకున్న చేదు జ్ఞాపకాలని మళ్లీ వెలికి తెచ్చింది. ఆ బాధామయ జ్ఞాపకాలే తలనొప్పి తదితర భౌతిక లక్షణాలుగా అభివ్యక్తం అయ్యాయి.

మామూలు విస్మృతి కాకుండా, బాధామయ జ్ఞాపకాలని “మర్చిపోయే” ప్రత్యేక సందర్భాలెన్నిటినో ఫ్రాయిడ్ వర్ణించాడు. అహంకారం అడ్డొచ్చినప్పుడు స్మృతి దానంతకదే ఓడిపోతుంది అంటాడు నీషే (Nietzshe). మనం మర్చిపోయిన జ్ఞాపకాలు, ఉపచేతనంగా ఉంటూ పిలిచినా పైకి రాని జ్ఞాపకాలు, అలా ఉపచేతనంగా ఉండడానికి ఒక కారణం వుంది. అవి బాధామయ జ్ఞాపకాలు, సచేతన స్థితితో పొత్తు కుదరని జ్ఞాపకాలు. వీటినే మనస్తత్వ శాస్త్రవేత్తలు ‘అణగ దొక్కిన అంశాలు’ (repressed contents) అంటారు.

ఈ సందర్భంలో ఓ సెక్రటరీ కథని ఉదాహరణగా తీసుకుందాం. ఈమెకి తన బాస్ యొక్క స్నేహితులలో ఒకరంటే అసూయ. సమావేశాలకి అందరికీ ఆహ్వానాలు పంపేటప్పుడు ఈ స్త్రీని పిలవడం  అలవాటుగా

మర్చిపోతుంది. అయితే ఆమె వాడే ఆహ్వానితుల జాబితాలో ఈ స్త్రీ పేరు ఉంటుంది. ఎందుకా పొరబాటు చేశావు అని నిలదీస్తే "మర్చిపోయా"ననో, లేక "పరధ్యానంగా" ఉన్నాననో చెప్తుంది. ఇక్కడ ఆమె అబద్ధం చెప్తోందని కాదు. నిజం ఏంటో ఆమెలో కూడా ఆమె ఒప్పుకోదు.

ఎంతో మంది తమ సంకల్ప బలం గురించి అతిగా ఊహించుకుంటారు. వాళ్లు నిర్ణయించింది, ఉద్దేశించింది తప్ప వారి మనసుల్లో మరింకేమీ జరగదని, జరగలేదని నమ్ముతారు. కాని మన మనసులో సంకల్పపూర్వకమైన అంశాలు ఉన్నట్లే అసంకల్పిత అంశాలు కూడా ఉంటాయని గుర్తుంచుకోవాలి. మొదటి రకం అంశాలు వ్యక్తి యొక్క అహంకారం నుండి జనిస్తాయి. రెండవ రకం అంశాలు అహంకారం నుండి కాక "అవతలి వైపు" నుండీ జనిస్తాయి. ఆ "అవతలి వైపే" ఇందాక మనం చెప్పుకున్న కథలో సెక్రటరీ తన ఆహ్వానాలు మర్చిపోయేలా చేస్తుంది.

మనం ఒకప్పుడు గుర్తించినవి, అనుభూతి చెందినవి తదనంతరం మర్చిపోవడానికి ఎన్నో కారణాలు వున్నాయి. అలాగే వాటిని తిరిగి జ్ఞాపకం తెచ్చుకోడానికి కూడా పలు మార్గాలు వున్నాయి. అలాంటి వాటిలో ఓ ఆసక్తికరమైన పద్ధతిని "concealed recollection" (ప్రచ్ఛన్న పునఃస్మరణ). అంటే మన సంకల్పం లేకుండా, మన ఎరుక లేకుండా ఏదో "గుర్తుకు" రావడం అన్నమాట. ఉదాహరణకి ఓ రచయిత ఓ ఆలోచనా స్రవంతిని వ్యక్తం చేస్తూ రాసుకొస్తున్నాడు, లేదా ఏదో వ్యూహం ప్రకారం ఓ కథ రాస్తున్నాడు అనుకుందాం. కాని ఉన్నట్లుండి ముందు నిర్ణయించిన మార్గానికి భిన్నంగా ఎటో వెళ్లిపోతాడు. బహుశ ఏదో కొత్త ఆలోచన వచ్చి వుంటుంది. లేదో మరేదో చిత్రం మనసులో మెదిలి వుంటుంది. కథకి మరో కొత్త వ్యూహం స్ఫురించి వుంటుంది. ఎలా కొత్త పంథా తొక్కడానికి కారణం ఏంటని అడిగితే చెప్పలేకపోతాడు. ఆ మార్పుని అతడు గుర్తించలేకపోవచ్చు. తనకి తెలియకుండా, అప్రయత్నంగా తన చిత్తం లోంచి ఈ కొత్త విషయాలన్నీ పుట్టుకు వచ్చి ఉండొచ్చు. కాని కొన్ని సందర్భాల్లో ఇలా కొత్త తరహాలో రాసిన విషయం అంతా మరెవరో రచయిత

రాసిన దానికి బాగా సన్నిహితంగా ఉందని నిరూపించడానికి వీలు కావచ్చు. కాని ఆ రచయిత రచనలు ఇతగాడు ఎన్నడూ చదవలేదని అనవచ్చు.

ఇలాంటి పరిణామానికి ఉదాహరణ నాకు నీషే రాసిన Thus spake Zarathustra అన్న పుస్తకంలో కనిపించింది. 1686 నాటి ఓ ఓడకి చెందిన యాత్రా పత్రికలో వర్ణించబడ్డ ఓ వృత్తాంతం ఆ పుస్తకంలో మక్కీకి మక్కీగా రాయబడింది. 1835 లో (అంటే నీషే రాసిన దానికి అర్థ శతాబ్దం ముందు) ప్రచురించబడ్డ ఓ పుస్తకంలో నేను అనుకోకుండా ఈ నౌకా వృత్తాంతం గురించి చదివాను. అదే వృత్తాంతం Thus spake Zarathustra లో కనిపించినప్పుడు దాని ప్రత్యేకమైన శైలి చూసి నాకు చాలా ఆశ్చర్యం వేసింది. నీషే మామూలుగా రాసే శైలికి దీనికి చాలా తేడా వుంది. ఆ పాత పుస్తకాన్ని నీషే తప్పకుండా చూసే వుంటాడని నా నమ్మకం. కాని ఆ పుస్తకం గురించి ఎక్కడా ప్రత్యేకించి ప్రస్తావించలేదు. ఈ విషయం గురించి వాకబు చేస్తూ నీషే చెల్లెలికి ఉత్తరం రాశాను. అప్పటికి ఆమె ఇంకా బతికే వుంది. వాళ్ల అన్నయ్యకి ఆ పుస్తకం గురించి తెలుసని, అన్నయ్యకి 11 ఏళ్ల వయసులో అన్నా చెల్లెళ్లు ఇద్దరూ కలిసి ఆ పుస్తకం చదవడం గుర్తని రాసింది. సందర్భం బట్టి చూస్తే ఇక్కడ నీషే గ్రంథచౌర్యానికి పాల్పడ్డాడని అనుకోడానికి లేదు. అది చదివిన యాభై ఏళ్ల తరువాత ఆ విషయం తన సచేతన స్మృతి నుండి జారిపోయి వుంటుందని అనిపిస్తోంది.

ఈ రకమైన స్మరణంలో తెలీకుండానే మునుపు విన్న, లేక చదివిన విషయాన్ని మళ్లీ గుర్తుకు తెచ్చుకోవడం జరుగుతుంది. ఉదాహరణకి ఓ వాగ్గేయకారుడు తన చిన్నతనంలో ఓ జానపద గీతమో, పల్లెపదమే విని వుంటాడు. పెద్దయ్యాక ఓ కఠినమైన బృంద వాద్యానికి సంగీతం కూర్చుతున్న సమయంలో ఆ పాత బాణీ

పదే పదే తన చిత్తంలో పైకి తేలుతున్న అనుభూతి కలుగవచ్చు. ఈ సందర్భంలో అచేతనకి చెందిన ఓ ఆలోచన, లేక చిత్రం తిరిగి సచేతన లోకి ప్రవేశించింది.

ఇంతవరకు నేను వర్ణించింది మానవ చిత్తానికి చెందిన ఈ అత్యంత సంక్లిష్టమైన విభాగం గురించిన కొన్ని ప్రాథమిక విషయాలు మాత్రమే. ఈ వర్ణన బట్టి కలలలో మనకి కనిపించే ప్రతీకలు ఎక్కణ్ణుంచి పుట్టుకొస్తాయో కొంత అవగాహన కలిగి వుంటుంది. ఈ అచేతన పదార్థంలో నానా రకాల తపనలు, ఆరాటాలు, ఉద్దేశాలు ఉండి వుండొచ్చు. ఎన్నో రకాల అహైతుకమైనవి, సహైతుకమైనవి అయిన ఆలోచనలు, నిర్ణయాలు, నమ్మకాలు ఉండి వుండొచ్చు. ఈ ఆవేశాలు, ఆలోచనలు అన్నీ విశాలమైన అచేతనా సముద్రం యొక్క పాక్షిక, తాత్కాలిక ప్రతినిధులు కావచ్చు.

ఒక రకంగా చెప్పాలంటే అలాంటి సమాచారం అంతా అధికభాగం అచేతనం కావడానికి కారణం మన సచేతన చిత్తంలో వాటికి స్థలం లేకపోవడమే. కొన్ని ఆలోచనల విషయంలో వాటి లోని భావావేశపు శక్తి అణగారిపోవడం వల్ల ఆ ఆలోచనలు అచేతనమై పోయి వుండొచ్చు. ఆ ఆలోచనల మీద మనకి ఆసక్తి సన్నగిల్లడం వల్ల, అవి అముఖ్యం అనిపించడం వల్ల, వాటి మీద ధ్యాస సన్నగిల్లడం వల్ల వాటిని మన కంటికి కనిపించకుండా అచేతనలోకి తోసేయడం జరుగుతుంది.


ఈ విధంగా మర్చిపోవడం ఎంతో అవసరం. అదే జరగకపోతే మనం అనుభూతి చెందిన ప్రతీ విషయం మన సచేతన మానసంలో అనుక్షణం మెదులుతూ వుంటుంది. ఇక అటువంటప్పుడు అనవసర విషయాలతో మన

చిత్తాలు కిక్కిరిసిపోతాయి, ఉక్కిరిబిక్కిరి అవుతాయి. ఈ విషయం పట్ల ఈ రోజుల్లో ఎంత అవగాహన వుందంటే మనస్తత్వ శాస్త్రం ఏ మాత్రం తెలిసిన వారికైనా ఇది నిజమని తెలుస్తుంది.

సచేతన విషయాలు అచేతనలోకి ప్రవేశించి మాయమైపోయినట్లే, అచేతన లోనుండి మునుపు ఎన్నడూ సచేతనం కాని కొత్త విషయాలు పైకొచ్చి సచేతన లోకి ప్రవేశించవచ్చు. కొన్ని సార్లు చిత్తం అంచున ఏదో సంగతి తారాడుతున్నట్టు అనిపిస్తుంది. మరి కాస్తలో ఏదో విషయం స్ఫురిస్తుంది అన్న అనుభూతి కలుగుతుంది. ఇలాంటి అనుభవాల బట్టి మనకి అర్థమయ్యేది ఏంటంటే అచేతన కేవలం గత స్మృతుల భాండాగారం మాత్రమే కాదు. నూతన ఆత్మగత పరిస్థితుల, భావనల బీజాలు అందులో సంపూర్ణంగా ఉంటాయి. ఈ సత్యాన్ని అర్థం చేసుకున్న నాడు నేను నా సొంత పంథాలో మనస్తత్వ శాస్త్రాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాను. నిజంగానే ఎప్పుడో మర్చిపోయిన పాత జ్ఞాపకాలే కాక, పూర్తిగా కొత్తవి, సృజనాత్మకమైనవి అయిన భావాలు కూడా అచేతన లోంచి పెల్లుబుకగలవు. పంకిలంలో పుట్టి పైకి తేలిన పంకజంలా అవి ఆ చీకటి లోతుల్లో నుండి ఆవిర్భవిస్తాయి.

నిత్య జీవితంలో ఈ సత్యాన్ని ఎన్నో సార్లు గుర్తిస్తాము. ఏదో సంకటం ఎదురవుతుంది, ఏదో నిర్ణయం తీసుకోవలసి వస్తుంది. అనుకోని రీతిలో వాటికి పరిష్కారాలు ఉత్పన్నమవుతాయి. ఎంతో మంది కళాకారులు, తత్వవేత్తలు, శాస్త్రవేత్తల జీవితాలలో ఎన్నో గొప్ప ఆలోచనలు, ప్రేరణలు అచేతన లోంచి పుట్టుకు రావడం మనం చూస్తాము. అచేతనలో దాగి వున్న భావబీజాలని, జ్ఞాన గనులని ఆవిష్కరించి తత్వశాస్త్రంలో, సాహిత్యంలో, కళలో, సంగీతంలో, విజ్ఞాన శాస్త్రంలో వాటిని అభివ్యక్తం చెయ్యగలిగే సామర్థ్యాన్నే మేధస్సు అంటాము.

ఇలాంటీ పరిణామానికి ఓ చక్కని నిదర్శనం మనకి విజ్ఞాన శాస్త్ర చరిత్రలో కనిపిస్తుంది. ఉదాహరణకి ఫ్రెంచ్ గణితవేత్త ప్వాంకరే (Poincare) మరియు రసాయనవేత్త కేకులే (Kekule) ల విషయంలో  ఎన్నో వైజ్ఞానిక ఆవిష్కరణలు హఠాత్తుగా “అంతఃప్రకాశనాల” రూపంలో వారి చిత్తంలో మెరిశాయని ఆ శాస్త్రవేత్తలే చెప్పుకున్నారు. ఫ్రెంచ్ తాత్వికుడు దే కార్త్ కి (des Cartes) కూడా ఒక విధమైన “అధ్యాత్మిక” అనుభూతి కలిగిందని అంటారు. “సకల శాస్త్రాలని కలిపే క్రమం” మెరుపులా తన చిత్తంలో మెరిసిందట. బ్రిటిష్ రచయిత రాబర్ట్ లూయీ స్టీవెన్ సన్ (Robert Louis Stevenson) ఎన్నో ఏళ్ళ పాటు మనిషిలోని ఈ “ద్వంద్వాత్మ యొక్క తత్వాన్ని ఎత్తి చూపే”  కథ కోసం గాలించగా, ఒక రాత్రి హఠాత్తుగా  కలలో డాక్టర్ జెకిల్ అండ్ మిస్టర్ హైడ్ (Dr Jekyll and Mr Hyde) కథ చిత్తంలో సాక్షాత్కరించిందట.



రసాయన శాస్త్రవేత్త కేకులేకి కలలో తన తోకను తాను కొరుకుక్కుంటున్న పాము రూపం కనిపించిందట. అది చూడగానే బింజీన్ అణువు యొక్క విన్యాసం ఎలా ఉండాలో అతడికి స్ఫురించింది.

అలాంటి సమాచారం అచేతన లోంచి ఎలా ఆవిర్భవిస్తుందో, అది ఎలాంటి రూపాన్ని తీసుకుంటుందో అంతా తరువాత విపులంగా చర్చిస్తాను. అంతర్యం లోంచి కొత్త సమాచారం పుట్టగలదన్న విషయం మనకి కలలలో కనిపించే ప్రతీకలని పరిశీలిస్తున్నప్పుడు స్పష్టంగా కనిపిస్తుంది. కలలలో పైకి తేలే చిత్రాలు, భావాలు కేవలం జ్ఞాపకాలు కాలేవని నా వృత్తి అనుభవంలో నాకు ఎన్నో సార్లు అవగతమయ్యింది. మన చేతన యొక్క ప్రాకారాలు ఎన్నడూ దాటని నిత్యనూతన భావాలెన్నో కలలలో తేటతెల్లమవుతాయి.

కలల యొక్క ప్రయోజనం

మన స్వప్న జీవనం గురించి ఇంతవరకు అంతో ఇంతో లోతుగా శోధించాం. స్వప్నాలు ఎందుకు ముఖ్యం అంటే స్వప్నాలనే మట్టి లోంచి పుట్టే మొలకలే మానవ ప్రతీకలు. కాని దురదృష్టవశాత్తు కలలని అర్థం చేసుకోవడం కష్టం. సచేతన మానసం చెప్పే కథలకి కలలకి మధ్య ఎంతో తేడా వుంటుందని అంతకు ముందే చెప్పాను. నిజజీవితంలో మనం ఏదైనా అనాలనుకున్నప్పుడు ఆచితూచి మాట్లాడతాం. వాక్యంలో పదాలు పొందిగ్గా వున్నాయో లేదో చూసుకుంటాం. భావాలు సహేతుకంగా అతుకుతున్నాయోలేదో చూసుకుంటాం. ఉదాహరణకి ఓ చదువుకున్న వ్యక్తి మాట్లాడుతున్నప్పుడు వాడే ఉపమానాలు కలగాపులగంగా ఉండడానికి

ఇష్టపడడు. అలా మాట్లాడితే భావం అవిస్పష్టం అవుతుందని అనుకుంటాడు. కాని కలల నైజం వేరుగా ఉంటుంది. అర్థం పర్థం లేని, పరస్పర విరుద్ధమైన చిత్రాలు స్వాప్నికుడి మానసాన్ని క్రమ్ముకుంటాయి. మామూలుగా ఉండే కాలభావాన సమసిపోతుంది. సర్వసామాన్య విషయాలు కూడా ఏవో విపరీతమైన, విపత్కరమైన అంతరార్థాన్ని సంతరించుకుంటాయి.



మార్క్ చాగల్ వేసిన “కాలం ఒక దరిలేని నది” అనే వర్ణ చిత్రం. కలలలో ఒక దాంతో ఒకటి సంబంధం లేని వస్తువులన్నీ ఒకే దృశ్యంలో కలగాపులగంగా ఎలా చేరుతాయో పై చిత్రం వ్యక్తం చేస్తుంది.

జాగృత జీవనంలో మనం మన ఆలోచనల మీద ఎంతో క్రమాన్ని, క్రమశిక్షణని ఆపాదించడానికి ప్రయత్నిస్తాం గాని, అచేతనలోని అంశాలు గందరగోళంగా, కకావికలంగా ఉండడం చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ఒక్క క్షణం ఏదైనా కలని జ్ఞాపకం తెచ్చుకుని జాగ్రత్తగా గమనిస్తే ఈ తేడా స్పష్టంగా కనిపిస్తుంది. అందుకే మామూలుగా మనుషులకి తమ కలలు అర్థం చేసుకోవడం అంత కష్టం అవుతుంది. మన జాగృత జీవనం పరంగా చూస్తే అవసలు అర్థం లేనట్టు కనిపిస్తాయి. అందుకే అవి అర్థం కావడం లేదని తలబద్దలు కొట్టుకుంటూ వుంటారు, లేదా అసలు అర్థం కావని వాపోతూ వుంటారు.

ఇక్కడ మనం గమనించాల్సిన విషయం ఒకటుంది. మన జాగృత జీవనంలో మనకి ఎదురయ్యే భావనలలో ఎంతో క్రమం వుందని అనుకుంటాం గాని వాటిలో నిజంగా మన అనుకున్నంతగా క్రమం గాని, క్రమశిక్షణ గాని లేవని మనం గుర్తించాలి. మన జాగృదావస్థకి చెందిన భావలలో మనం అనుకున్నంత స్థాయిలో నిర్దిష్టత, స్పష్టత ఉండదు.  నిజం చెప్పాలంటే ఆ భావాలని మనం ఎంత నిశితంగా పరిశీలిస్తే వాటిలోని అంతరార్థం (ముఖ్యంగా హార్దికమైన సారం) అంతగా అవిస్పష్టంగా కనిపిస్తుంది. దానికి కారణం ఏంటంటే మనం విన్నది, అనుభూతి చెందినది అంతా మన అచేతనలోకి ప్రవేశిస్తుంది. అంతేకాక మనం మన సచేతన మనస్సులో నిలుపుకున్నది, సంకల్పమాత్రం చేత వ్యక్తం చెయ్యగలిగేది కూడా  ఓ కొత్త అచేతనమైన అంతరార్థాన్ని సంతరించుకుంటుంది. మన జ్ఞాపకాన్ని తిరిగి గుర్తుతెచ్చుకున్న ప్రతీ సారి దానికి ఏదో అచేతనమైన వన్నె అలముకుంటుంది. మన సచేతన జ్ఞాపకాలు  వేగంగా ఓ అచేతన అంతరార్థాన్ని సంతరించుకుంటాయి. ఆ గూఢార్థానికి ఏదో ఆత్మగతమైన విలువ ఉండి వుండొచ్చు. కాని ఆ అర్థమేమిటో, ఆ విలువ ఏమిటో మనకి సచేతనంగా తెలియకపోవచ్చు. అదే ఆ భావన యొక్క బాహ్యార్థాన్ని ఎలా మరుగుపరుస్తుందో మనకి అర్థం కాకపోవచ్చు.

మన సచేతనమైన అనుభూతులకి ఏ రకమైన అచేతనమైన వన్నెలని ఆపాదిస్తాం అనేది వ్యక్తి నుండి వ్యక్తికి మారుతూ వుంటుంది. ఒక సామాన్య, అమూర్త భావన మనకి తారసపడినప్పుడు దానికి మన వ్యక్తిగత మనస్సు ఒక నేపథ్యాన్ని, సందర్భాన్ని అందిస్తుంది. కనుక మన ప్రత్యేక, వ్యకిగత ధోరణిలో దాన్ని మనం అర్థం చేసుకుంటాం, వినియోగించుకుంటాం. “దేశం”, “డబ్బు,” “సమాజం”, “ఆరోగ్యం” మొదలైన సామాన్య పదాలని విన్నప్పుడు ఆ పదాలు నాకెలా అర్థం అవుతాయో, అవతలి వారికి కూడా ఇంచుమించు అలాగే అర్థం అవుతాయని నేను అనుకుంటాను. ఇక్కడ “ఇంచుమించు” అన్న పదానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ఒకే సాంస్కృతిక నేపథ్యం గల వారిని ఇద్దరిని తీసుకుంటే వారికి కూడా ఒకే పదం రెండు రకాలుగా అర్థం కావచ్చు. ఇక బాగా వైవిధ్యంతో కూడా సామాజిక, రాజకీయ, మత, మానసిక అనుభవరాశి గల వ్యక్తుల విషయంలో అయితే ఆ రకమైన అర్థభేదం చాలా తీవ్రంగా ఉంటుంది.

భావనకి, పదానికి మధ్య పెద్దగా వ్యత్యాసం లేకపోతే ఇలా వ్యక్తికి వ్యక్తికి మధ్య అవగాహనలో పెద్దగా తేడా వుండదు. కాని భావనని బోధపరచడానికి కచ్చితమైన నిర్వచనం, విపులమైన వివరణ అవసరమైన పక్షంలో అవగాహన భేదం విపరీతంగా ఉంటుంది. ఆ భేదం మానసికమైన, బుద్ధిగతమైన అవగాహనలోనే కాదు, అంతకన్నా ముఖ్యంగా పదానికి సంబంధించిన హార్దిక అనుభూతిలో తేడా వుంటుంది. ఆ తేడాలు ఎక్కువగా అచేతనంగా, ఉపచేతనంగా వుంటాయి కనుక బయటికి వ్యక్తం కావు.

అవగాహనలో అలాంటి భేదాలకి పెద్దగా ప్రాముఖ్యత లేదని, దైనిక అవసరాలకి వాటికి సంబంధం లేదని కొందరు అనుకోవచ్చు. కాని వాస్తవంలో ఎంత కచ్చితమైన సచేతన అంశాల విషయంలో అయినా, వాటి చుట్టూ అనిశ్చితమైన అచేతన ఛాయ అలముకుని వుంటుంది.  ఒక విషయాన్ని మనం అర్థం

చేసుకుంటున్నప్పుడు, దానికి మనం స్పందిస్తున్నప్పుడు మనలో ఓ ఆంతరిక, ఆత్మగత సంఘటన జరుగుతోంది. కనుక ఆ సంఘటనలో నిగూఢంగా, మర్మంగా ఉండే అంశం తప్పకుండా వుంటుంది. అంకెల లాంటి సర్వసామాన్యమైన భావనని తీసుకున్నా కూడా అవి కేవలం లెక్కించడానికి పనికొచ్చే సాధనలే అనుకుంటే పొరబాటు. అంకెలలో అధ్యాత్మికమైన అంతరార్థం వుంటుంది. పైథాగరస్ (Pythagoras) వంటి వారి ప్రకారం అంకెలు దివ్యమైనవి కూడా! కాని మనం దైనందిన జీవితంలో అంకెలని వాడేటప్పుడు ఇవన్నీ మన అనుభవంలోకి రావు.

కనుక మన సచేతన మానసంలో ఉండే ప్రతీ భావనకి, అచేతనమైన, ఆత్మగతమైన అనుబంధిత అంశాలేవో వుంటాయి. తీవ్రతలోను, ప్రగాఢతలోను ఆ అనుబంధిత అంశాల్లో ఎంతో వైవిధ్యం వుంటుంది. ఆ భావన మన పూర్ణ వ్యక్తికి, జీవితానికి ఎంతో ముఖ్యం అయినట్లయితే, మన అచేతనలో ఆ భావన యొక్క అనుబంధిత అంశం మరింత బలవత్తరంగా వుంటుంది. ఆ భావానికి సంబంధించిన ఇతర భావాలు, భావజాలాలు మన అచేతనలో ముందే వున్న పక్షంలో కూడా ఆ భావనకి సంబంధించిన అచేతన అంశం బలవత్తరం అవుతుంది. ఆ కారణం చేత ఆ భావన యొక్క “సామాన్య” అంశం పలచన అవుతుంది. ఆ భావన మన అచేతన లోకి ఇంకా ఇంకా లోతుగా చొచ్చుకు పోతున్న కొద్దీ దాని లక్షణం గణనీయంగా మారిపోతుంది.



పశ్చిమ ఆఫ్రికాకి చెందిన ఆటవికులు ఈ చెట్టుని “జు-జు” అని పిలుస్తారు. దీనికి గొప్ప మహిమలు ఉన్నాయని వారి నమ్మకం.

మనకి రోజూ సంభవించే సంఘటనలకి సంబంధించిన అచేతన అంశాలకి మన దైనిక జీవితం మీద పెద్దగా ప్రభావం వున్నట్టు కనిపించదు. కాని స్వప్న విశ్లేషణ ద్వార అచేతనాంశాలని అర్థం చేసుకోడానికి ప్రయత్నించే మనస్తత్వ శాస్త్రవేత్తకి అవి చాలా ముఖ్యం అవుతాయి. ఎందుకంటే మన సచేతన ఆలోచనల యొక్క వేళ్లు అక్కడే వున్నాయి. అందుకే సర్వసామాన్యమైన వస్తువులు, భావాలు కూడా కలలో కనిపించినప్పుడు ఒక్కొక్కసారి అత్యంత శక్తివంతమైన అంతరార్థాన్ని తెలియజేస్తాయి. అది మూసిన గది కావచ్చు, అందుకోలేని రైలుబండి కావచ్చు. గొప్ప ఉద్విగ్న భరిత స్థితిలో అలాంటి కల నుండి మనం మేలుకోవడం జరుగుతుంది.

కలలలో కనిపించే చిత్రాలు ఎన్నో సార్లు మెలకువలో ఆ చిత్రాలకి, భావనలకి సంబంధించిన బాహ్య ప్రపంచపు దృశ్యాల కన్నా మరింత సజీవంగా ఉంటాయి. దానికి కారణం స్వప్న చిత్రాలు బాహ్య ప్రపంచ వస్తువుల యొక్క అచేతన అంతరార్థాన్ని సూచిస్తున్నాయి. మన సచేతన చింతన లన్నీ వివేచన, హేతువు అనే నిర్బంధాల మధ్య రూపుదేలుతాయి. అలాంటి నిర్బధం వల్ల అవి జీవరహిత మవుతాయి. వాటిలోని ఆత్మగతమైన అంశం తొలగిపోవడం వల్ల వాటిలో వుండే కళ కాంతి తొలగిపోతుంది.

ఈ సందర్భంలో నాకు వచ్చిన ఓ కల గుర్తొస్తోంది. ఆ కలలో ఎవరో నా వెనకగా వచ్చి నా వీపు మీద ఎక్కడానికి ప్రయత్నిస్తున్నాడు. ఆ మనిషి గురించి నాకు ఏమీ తెలీదు. ఒక్కటి తప్ప. నేను ఎప్పుడో అలవోకగా అన్న ఓ మాటని తీసుకుని దాన్ని వక్రపరిచాడు. ఎవరో అజ్ఞాత వ్యక్తి నా వీపు మీద ఎక్కడానికి ప్రయత్నించడంలో అంతరార్థం ఏంటో మొదట అర్థం కాలేదు. నా వృత్తి జీవనంలో నేను అన్నదాన్ని ఎవరో తీసుకుని దాన్ని వక్రపరచడం ఎన్ని సార్లు చూశానంటే ఇక దాన్ని గురించి పట్టించుకోవడం మానేశాను.

ఆ తరువాత ఒక సందర్భంలో ఆ కలకి అర్థం ఏంటో ఉన్నట్లుండి మనసులో స్ఫురించింది. ఆస్ట్రియాకి చెందిన ఓ నానుడి వుంది. "వచ్చి కావాలంటే నా వీపు మీద ఎక్కు." దానికి అర్థం "నువ్వు నా గురించి ఏం అన్నా నేను పట్టించుకోను సుమా!" ఇలాంటి నానుడే ఒకటి అమెరికాలో కూడా వాడుతారు – "పోయి ఏట్లో దూకు."

పైన చెప్పుకున్న కల ప్రతీకాత్మకమైనది. ఎందుకంటే అది విషయాన్ని పరోక్షంగా ఒక ఉపమానం సహాయంతో వ్యక్తం చేస్తోంది. కల మనకి చెప్పదలచుకున్న విషయానికి కావాలని "ముసుగు" వేసి  మనకి వ్యక్తం చెయ్యడం లేదు. కల యొక్క పైఖరే అంత, దాని తత్వమే అంత. దాని పరిభాషని అర్థం చేసుకోవడం మనకే

చాతకావడం లేదు. మన ఆధునిక జీవనంలో, నాగరిక సంస్కృతి ప్రభావం వల్ల మనం వ్యక్తం చెయ్యగోరే విషయాన్ని  ఎప్పుడూ వీలైనంత సహేతుకంగా, తార్కికంగా వ్యక్తం చెయ్యడానికి ప్రయత్నిస్తాము. తద్వార అందులోంచి అచేతనపు  పైపూతని తొలగిస్తాము. అలాంటి పైపూత వేయడం ఆదిమానవుడి స్వభావం. ప్రతీ బాహ్య ప్రపంచ వస్తువు వెనుక వుండే అద్భుత, ఆత్మగత సారాన్ని మనం మన అచేతన లోకి అణగదొక్కేశాం. కాని కిరాతుల మనస్తత్వంలో ఈ లక్షణాలు, ఈ సారం ఇంకా సజీవంగా ఉన్నాయి. అందుకే వాళ్లు మొక్కలకి, జంతువులకి, రాళ్లకి కూడా ఏవో అద్భుత, విచిత్ర శక్తులని ఆపాదిస్తారు.

ఆఫ్రికా అడువుల్లో జీవించే ఓ అటవికుణ్ణే ఉదాహరణగా తీసుకుందాం. ఇతగాడు ఓ నిశాచర ప్రాణిని పగటి పూట తిరగడం చూస్తాడు. ఆ సందర్భంలో తను చూస్తున్నది ఓ జంతువు అనుకోడు. ఓ ఆటవిక వైద్యుడే ఆ రూపంలో వచ్చాడని తలపోస్తాడు. లేదా అదొక వృక్షాత్మ అనుకుంటాడు. లేదా తమ జాతికి చెందిన ఎవడో పూర్వీకుడు ఆ రూపంలో వచ్చాడని అనుకుంటాడు. ఆటవికుడి జీవితంలో చెట్టుకి ఎంతో ముఖ్యమైన పాత్ర వుంటుంది. దానినే తన ఆత్మగా భావిస్తాడు. దాని ద్వార తన వాక్కు వ్యక్తం అవుతుందని అనుకుంటాడు. ఆ చెట్టుతో తన జీవితం ముడిపడి వుందని నమ్ముతాడు. దక్షిణ అమెరికాకి చెందిన కొందరు ఇండియన్లు తాము ఎర్ర అరారా (Red Arara) చిలుకలమని నమ్ముతారు. అయితే వాళ్లకి రెక్కలు, ఈకలు, కూసు ముక్కులు లేవని వాళ్లకి తెలియకపోలేదు. బుద్ధి జన్యమైన ఆధునిక ప్రపంచంలో లాగా ఆ ఆటవికుల ప్రపంచంలో ఇది “నేను” అది “నేను కానిది” అనే కచ్చితమైన సరిహద్దులు ఉండవు మరి.



ఆఫ్రికాలో కమెరూన్ దేశానికి చెందిన ఒక భూత వైద్యుడు (witch doctor). సింహపు ముసుగు వేసుకున్న ఈ వ్యక్తి ఆ స్థితిలో నిజంగానే తాను సింహంగా మారిపోయానన్న తాదాత్మ్యంలో ఉంటాడు.

మనస్తత్వ శాస్త్రవేత్తలు చెప్పే ఆత్మగతమైన తాదాత్మ్యం లేదా, చైత్యపరమైన భాగస్వామ్యం అనే మాటలకి మన ఆధునిక జీవితంలో అర్థం లేకుండా పోయింది. కాని ఈ రకమైన అచేతన అనుబంధాల సందోహమే ఆటవికుడి ప్రపంచానికి ఓ కొత్త వన్నె తెస్తుంది. ఆ లక్షణాన్ని మనం ఎంతగా కోల్పోయామంటే అది మనకి ఎక్కడైనా తారసపడ్డా దానిని గుర్తుపట్టలేము. మనలో ఎప్పుడూ అవి ఉపరితలానికి అడుగునే మసలుతూ వుంటాయి. ఎప్పుడైనా అవి ఆ సరిహద్దు దాటుకుని పైకి తేలితే ఏదో పొరపాటు జరిగిందని అనుకుంటాం, అవీ నిజమేనని, వాటికీ ఓ అర్థం, అస్తిత్వం ఉందని ఒప్పుకోం.

బాగా చదువుకున్న వాళ్లు, తెలివైన వాళ్లు ఎంతో మంది నన్ను సంప్రదిస్తూ వుంటారు. వారికి కలిగే ఏవో విచిత్రమైన కలలు, ఊహలు, ఆంతరిక దర్శనాలు వాళ్లని కలవరపెడుతున్నాయని చెప్తుంటారు. మతిస్థిమితం గల వారికి అలాంటి కలలు, ఆలోచనలు రావని, అలాంటి దృశ్యాలు చూసే వారికి తప్పకుండా మతి తప్పి ఉండాలని వాళ్లు బెంబేలు పడుతూ వుంటారు. ఇజికీల్ (Ezekiel) కి కనిపించిన దృశ్యాలు కేవలం ఏదో మానసిక రుగ్మతకి ఫలితాలని అన్నాడు అలాగే ఓ సారి నన్ను సందర్శించిన ఓ మతపండితుడు. అలాగే మోసెస్ (Moses) మొదలైన ప్రవక్తలకి వినిపించిన "వాణి" కేవలం ఓ విభ్రాంతి అంటాడు. అలాంటప్పుడు అలాంటి అనుభూతి తనకి "అప్రయత్నం"గా కలిగితే అదిరిపోడూ మరి! మనం నిర్మించుకున్న ఈ తార్కిక, సహేతుక ప్రపంచానికి మనం ఎంతగా అలవాటు పడిపోయామంటే మన సామాన్య లౌకిక అవగాహనకి అందని దంతా అసంభవం అని కొట్టిపారేస్తాం. ఇలాంటి విపరీతమైన, విచిత్రమైన అనుభూతి కలిగిన ఆటవికుడు తన మనస్థిమితాన్ని సందేహించడు. ఆత్మలు, దేవతలు మొదలైన అంశాలతో ఆ వైపరీత్యాన్ని వివరించుకోడానికి ప్రయత్నిస్తాడు.



16  వ శతాబ్దానికి చెందిన ఇటాలియన్ చిత్రకారుడు కరవాజియో వేసిన “The Conversion of St Paul” చిత్రం. డమాస్కస్ కి వెళుతున్న పాల్ మనసులో ఓ అంతర్వాణి వినిపిస్తుంది. ఆ అనుభవం ధాటికి గుర్రం మీది నుండి పడిపోయినట్టుగా పై చిత్రం ప్రదర్శిస్తుంది.

మన భావావేశాలు కూడా ఈ కోవకి చెందినవే. మన సువిస్తారమైన ఆధునిక నాగరికతలో వేళ్లూని వున్న విపత్తుల ముందు ఆటవికులు భయపడే 'దెయ్యాలు,' 'భూతాలు' మొదలైనవి ఏ మూలకీ రావు. ఆధునిక నాగరికుడి మనోభావాన్ని తలచుకుంటే ఓ సారి నన్ను సంప్రదించడానికి వచ్చిన ఓ psychotic రోగి జ్ఞాపకం వస్తాడు. ఆ రోగి స్వయంగా ఓ డాక్టరు కూడా. ఓ సారి ఉదాయానే నన్ను చూడడానికి వచ్చిన అతగాణ్ణి 'ఎలా వున్నారు?' అని పలకరించాను. అతగాడు తన కొచ్చిన ఓ చిత్రమైన కల గురించి ఏకరువు పెట్టుకొచ్చాడు. ఆ కలలో అతడు మెర్క్యూరిక్ క్లోరైడ్ అనే క్రిమి నాశనిని స్వర్గం అంతా చల్లి దాంతో స్వర్గాన్ని క్రిమిరహితంగా మార్చేస్తున్నాడట! అలా ఎంతో సేపు స్వర్గాన్ని పరిశుద్ధం చేశాక చూసుకుంటే స్వర్గంలో దేవుడు కనిపించకుండా పోయాడట! ఇది న్యూరోసిస్ యొక్క లక్షణం లాగా కనిపిస్తోంది. ఈ సందర్భంలో "దైవభీతి" కి బదులుగా ఏదో anxiety neurosis కనిపిస్తోంది. భావావేశం ఒకటే. దాని లక్ష్యం మారిందంతే.



బ్రిటన్ కి చెందిన శిల్పి జేకబ్ ఎప్స్టయిన్ రూపొందించిన ఓ శిల్పం. ఆటవికుడు దెయ్యాలని, భూతాలని ఊహించుకుంటే ఆధునికుడు ఈ మరభూతాలని ఊహించుకుంటున్నాడు.

అలాగే మరో సందర్భంలో ఓ ఫిలాసఫీ ప్రొఫెసరు నాతో కాన్సర్ పట్ల తనకి వుండే భయం (phobia) గురించి చెప్పుకొచ్చాడు. అప్పటికే అతడు ఎన్నో ఎక్స్-రే లు తీయించుకున్నాడు. కాని ఎందులోను కాన్సర్ ఆనవాళ్లు కనిపించలేదు. అయినా కూడా తనకి ఏదో హానికరమైన ట్యూమర్ వుందని అతడు భయపడుతుంటాడు. “ఏమీ లేదని తెలుసు. కానీ ఏవైనా వుంటే?” అని అడుగుతాడు. ఈ ఆలోచన ఎక్కణ్ణుంచి వచ్చింది? ఇది సచేతనమైన యోచన లోనుండి పుట్టుకొచ్చిన భయం కాదు. ఆ సంశయం అతడి మానసాన్ని ఒక్కసారిగా క్రమ్ముకుంటుంది. దాని సమ్మోహక శక్తి మీద అతడికి బొత్తిగా నిగ్రహం లేకుండా పోతోంది.

ఈ విధంగా తన సమస్యని ఒక నాగరికుడు అంత సులభంగా వెలిబుచ్చడు. ఓ అనాగరికుడు అయితే తన సమస్యలకి కారణం ఏదో దయ్యం తనని పేధించడమే నని మరింత సులభంగా ఒప్పుకుంటాడు. దెయ్యాలు అనేవి ఉంటాయని, వాటికి ఏదో దుష్టప్రభావం వుంటుందనే భావన ఓ అనాగరిక సంస్కృతిలో సమ్మతమే కావచ్చు. కాని ఒక ఆధునికుడికి తన సమస్యలు కేవలం మనోజన్యాలు అని ఒప్పుకోవడం మరింత కష్టం అవుతుంది. ఈ విధంగా చిత్తంలో లోతుగా నాటుకుపోయి, సులభంగా మార్చరాని, వొదిలించుకోలేని భావననే obsession అంటారు. ఇది చాలా ప్రాచీనమైన మానసిక పరిణామం. ఆనాడు, ఈనాడు అది ఒక్క రీతిలోనే వుంది. దానికి కారణం ఏమిటి అని అన్వయించే ప్రయత్నంలోనే అప్పటికి ఇప్పటికి తేడా వుంది.

ఆధునికులకి, అనాగరికులకి మధ్య ఈ రకంగా ఎన్నో పోలికలు గుర్తించవచ్చు. మానవ చిత్తంలో ప్రతీకలని పుట్టించే ప్రవృత్తిని అర్థం చేసుకోడానికి ఈ రకమైన తులనాత్మక పరిశీలన అవసరం. ఎందుకంటే ఎన్నో కలలలో మనకి ఎదురయ్యే ప్రతీకలకి ప్రాచీన భావనలతోను, గాధలతోను, ఆచారాలతోను సంబంధం వుంటుంది. ఈ స్వప్న చిత్రాలనే మన చిత్తంలో మిగిలిన “ప్రాచీన అవశేషాలు” అంటాడు ఫ్రాయిడ్. అతి

సుదూరమైన గతానికి చెందినవై మనలో మిగిలిన చైతన్యాంశాలు అన్న మాట. అచేతనని కేవలం చేతన యొక్క పొడిగింపు గానో, లేక కాస్త దృశ్యాత్మకంగా చెప్పాలంటే సచేతన మానసంలో పుట్టే చెత్త అంతా తనలో పోగు చేసుకునే ఓ చెత్తడబ్బా లాగానో (ఫ్రాయిడ్ లాంటి) కొంతమంది నిపుణులు పరిగణిస్తూ వుంటారు.

అచేతన పట్ల ఈ రకమైన దృక్పథ సమంజసం కాదని, దాన్ని వీలైనంత త్వరగా వదిలేయడం మంచిదని నా పరిశోధన తెలుపుతోంది. ఇలాంటి చిత్రాలు, అనుసంధానాలు అచేతనలో  సమగ్ర భాగాలని నేను తెలుసుకున్నాను. కల కన్నవాడు చదువుకున్న వాడైనా, చదువురాని వాడైనా, తెలివైన వాడైనా, మందమతి అయినా అచేతనలో ఇలాంటి చిత్రాలు మాత్రం అన్ని సందర్భాలలోను కనిపిస్తాయి. అవి జీవంలేని పనికిమాలిన చిత్రాలు కావు. అర్థం లేని “అవశేషాలు” కావు. వాటికి గల “చారిత్రక” లక్షణం దృష్ట్యా అవొక ముఖ్యమైన క్రియని నిర్వర్తిస్తాయి అని డా. హెండెర్సన్ మనకి తెలియజేస్తున్నారు. మనం సచేతనంగా, భాషాసహితంగా ఆలోచనలని వ్యక్తం చేసే విధానాలకి, అచేతనంగా, దృశ్యాత్మకంగా, వ్యక్తం చేసే మరింత ఆదిమమైన విధానాలకి మధ్య అది వంతెనలా పని చేస్తుంది. భావావేశానికి, హార్దిక అనుభూతికి ఈ రెండవ విధానం మరింత సన్నిహితమైన అనుబంధం కలిగి వుంటుంది. సచేతనమైన, సహేతుకమైన ప్రపంచానికి, భాషారహితమైన చిత్తప్రపంచానికి మధ్య ఈ “చారిత్రక” అనుసంధానాలు లంకెలుగా పనిచేస్తాయి.

జాగృత జీవనంలో మనం అనుభవించే “సునియంత్రితమైన” ఆలోచనలకి, కలలలో అచేతన లో నుండీ తన్నుకొచ్చే అద్భుత చిత్ర సంపదకి మధ్య ఎంత గాఢమైన వ్యత్యాసం వుందో అంతకు ముందే చర్చించాను. ఆ తేడాకి ఇప్పుడు మరో కారణం కూడా వుందని చెప్తాను. మన నాగరిక జీవనంలో ఎన్నో భావనల విషయంలో వాటిలో దాగి వున్న భావావేశ రసాన్ని పిండి, వెలికి తీసి అవతల పారేస్తాం. కాబట్టి ఆ భావనలు మనలో ఇక ఏ రకమైన హార్దిక స్పందనని కలుగజేయవు. ఆ భావనలని మన భాషలో, మాటల్లో అప్పుడప్పుడు వ్యక్తం చేస్తాం. ఇతరుల నోటివెంట ఆ మాటలు విన్నప్పుడు ఏదో లాంఛనంగా స్పందిస్తాం. కాని అవి మన చిత్తం మీద గాఢమైన ముద్ర వేయవు. మన చింతనలో, దృక్పథంలో, ప్రవర్తనలో మార్పు రావాలంటే మరింకేదో కావాలి.

“స్వప్నిక భాష” లో సరిగ్గా అదే జరుగుతుంది. దాని ప్రతీకలలో ఎంత చైత్య శక్తి దట్టించి వుంటుందంటే అది మన మనసుని ఆకట్టుకోక మానదు.

ఉదాహరణగా మరో స్త్రీ విషయాన్నే తీసుకుందాం. ఈమె కొన్ని అర్థం లేని మూఢనమ్మకాలని పట్టుకుని వేలాడుతుంది. సహేతుకంగా ఎంత వివరించినా మొండిగా మొరాయిస్తుంది. రాత్రంతా కూర్చుని ఆమెతో వాదించినా ఆమె మనోభావంలో కించిత్తు కూడా తేడా వుండదు. కాని ఆమె కలల ప్రభావం మాత్రం వేరే రకంగా పని చేసింది. ఒక రోజు ఆమెకి ఓ కల వచ్చింది. ఆ కలలో ఆమె ఎవరో ఇంట్లో విందు జరిగితే హాజరు అయ్యింది. విందు ఇస్తున్న మహిళ ఈమెని పలకరించి, “రండి! రండి! మీరు రావడం మాకెంతో సంతోషం. మన స్నేహితులంతా వచ్చారు. అంతా మీకోసం ఎదురుచూస్తున్నారు,” అంది. అలా అంటూ ఆ మహిళ ఈమెని ఇంట్లోకి తీసుకెళ్లి ఓ తలుపు తెరిచింది. కల కంటున్న స్త్రీ ఆ తలుపు లోకి అడుగుపెట్టింది. అవతల ఆమెకి కనిపించినది ఒక ఆవులశాల!

ఎంతటి మందమతికైనా ఈ కలలోని ప్రతీకాత్మక భాష సులభంగా అర్థమవుతుంది. తన అహం మీద దెబ్బ కొట్టేలా వున్న ఆ స్వప్న సారాంశాన్ని ముందు ఆ స్త్రీ వెంటనే ఒప్పుకోలేదు. కాని ఆమెకి అందవలసిన సందేశం ఆ కల ద్వార అందిపోయింది. తన ఉపచేతన తన మీద ఆడిన ఆ ఎత్తుగడని, చేసిన ఆ పరిహాసాన్ని నెమ్మది మీద ఆ స్త్రీకి ఒప్పుకోక తప్పలేదు.



16  వ శతాబ్దపు జర్మన్ చిత్రకారుడు గ్రూన్ వల్డ్ వేసిన వర్ణచిత్రం. ఇందులో సెయింట్ ఆంథొనీని నరకపు దెయ్యాలు అటకాయిస్తున్నాయి.

అచేతన లోంచి వచ్చే ఆ సందేశాలు ఎంత ముఖ్యమైనవో చాలా మంది గుర్తించరు. సచేతన జీవనంలో మన మీద నానా రకాల ప్రభావాలు పని చేస్తుంటాయి. కొంత మంది మనని ప్రోత్సహిస్తుంటే, మరి కొందరు నిరుత్సాహ పరుస్తుంటారు. ఆఫీసులోను, ఇంట్లోను జరిగే సంఘటనలు మనని ఎన్నో రకాలుగా కలవరపెడుతుంటాయి. అలాంటి ప్రభావాలు మన వ్యక్తిత్వానికి తగని రీతుల్లో మనని ముందుకు తోస్తుంటాయి, మనను తప్పుదారి పట్టిస్తుంటాయి. మన సచేతన మీద వాటి ప్రభావాన్ని మనం గుర్తించకపోవచ్చు, దాని గురించి అవగాహనే అసలు మనకి ఉండకపోవచ్చు. కాని ఏ విధమైన ఆత్మరక్షణ లేకుండా ఆ ప్రభావాలకి మన సచేతన గురి అవుతూ ఉంటుంది. ఈ విషయం బహిర్ముఖులకి మరింతగా వర్తిస్తుంది. వీళ్లు ఎప్పుడూ బాహ్య వస్తువుల మీదే  మనసు లగ్నం చేస్తూ తమ అంతర్యాన్ని నిర్లక్ష్యం చేస్తారు. తమ అంతర్యంలో దాగి వున్న అసలు వ్యక్తి పట్ల ఆత్మన్యూనతా భావాన్ని కలిగి వుంటారు. దాని శక్తిసామర్థ్యాలని సందేహిస్తుంటారు.

ఆ విధంగా చైతన్యం మూఢనమ్మకాల, తప్పుడు ఆలోచనల, పొరబాట్ల, అర్థం లేని ఊహాగానాల, హాస్యాస్పదమైన కోర్కెల ప్రభావానికి ఎంతగా గురై వుంటే, అంతగా ముందే ఉన్న తేడా మరింతగా విస్తరించబడి మనోవైకల్యానికి, మానసిక విచ్ఛేదానికి (neurotic dissociation) దారి తీస్తుంది. జీవితం క్రమంగా మరింత అసహజంగా, అర్థరహితంగా మారిపోతుంది. ఆరోగ్యవంతమైన చిత్తవృత్తికి, స్వభావానికి, సత్యానికి మరింతగా దూరమవుతుంది.

కాబట్టి కలల యొక్క ముఖ్య ప్రయోజనం మనలో ఆంతరిక సమతౌల్యాన్ని సాధించడమే. స్వప్న సందేశాల ద్వార సున్నితంగా మనలో సంపూర్ణ చైతన్య సమతాస్థితిని సాధించడమే. మన చైత్య వ్యవస్థలో కలలు

ధరించే పాత్రని నేను పరిపూరక (ప్రతిఫలదాయక) పాత్రగా వర్ణిస్తాను. అందుకేనేమో తమ సామర్థ్యాల పరిమితులని గుర్తించుకోకుండా పెద్ద పెద్ద పథకాలు వేసే వారికి, తమ గురించి తాము మరీ ఎక్కువగా ఊహించుకునే వారికి గాల్లో ఎగురుతున్నట్టు, ఆకాశం నుండి పడిపోతున్నట్టు కలలు వస్తుంటాయి. వారి వ్యక్తిత్వంలోని బలహీనతలని కలలు పరిపూరిస్తాయి. తమ ప్రస్తుత జీవన మార్గంలో పొంచి వున్న ప్రమాదాల గురించి హెచ్చరిస్తాయి. కలల హెచ్చరికలని నిర్లక్ష్యం చేస్తే వాస్తవంలో ప్రమాదాలు సంభవించవచ్చు. క్షతగాత్రుడు మెట్ల మీద నుండి జారి పడడం గాని, రోడ్డు ప్రమాదానికి గురి కావడం గాని జరగొచ్చు.

నాకు తెలిసిన ఒక వ్యక్తి ఎన్నో నీతిమాలిన వ్యవహారాలలో కూరుకుపోయి వున్నాడు. ఆ ఒత్తిడికి తట్టుకోవడం కోసం కాబోలు ప్రమాదకరమైన పర్వతారోహణా కార్యక్రమాలలో కూడా తరచు పాల్గొనేవాడు. తనలో పేరుకుంటున్న పాపానికి “అందనంత ఎత్తుకు చేరుకోవాలని” అతడి తపన కాబోలు. ఒక రోజు రాత్రి అతడికి ఓ ఎత్తయిన పర్వత శిఖరం నుండి నిశీధిలోకి అడుగుపెడుతున్నట్టు ఒక కల వచ్చింది. అతడు ఆ కల గురించి నాకు చెప్పినప్పుడు అదొక హెచ్చరిక అని, తన వ్యవహారాలని కొంత అదుపు చేసుకోవాలని వారించాను. ఏదో పర్వత ప్రమాదంలో అతడు మృత్యువాత పడనున్నాడని ఆ కల సూచిస్తోందని చెప్పాను. ఎన్ని చెప్పినా లాభం లేకపోయింది. ఆరు నెలల తరువాత అతడు నిజంగానే “నిశీధిలోకి అడుగు పెట్టాడు.” ఒక పర్వతారోహణ శిక్షకుడు చూస్తుండగానే ఆ వ్యక్తి, తన మిత్రుడితో పాటు త్రాడు పట్టుకుని కిందికి జారుతూ ఒక కఠినమైన ప్రదేశంలోకి చేరుకున్నాడు. అతడి మిత్రుడికి మాత్రం పైకి పొడుచుకొస్తున్న ఒక రాతి మీద పట్టు దొరికింది. కల వచ్చిన మనిషి ఆ మిత్రుణ్ణి అనుసరిస్తూ ఇంకా ఇంకా కిందికి పోయాడు. అంతలో ఏమయ్యిందో ఏమో ఉన్నట్లుండి త్రాడు వదిలేశాడట. పర్వతారోహణ శిక్షకుడి మాటల్లో అతడు “గాల్లోకి దూకుతున్నట్టు కనిపించింది.” అంత ఎత్తు నుండి పడుతూ కింద నున్న మిత్రుడి మీద పడ్డాడు. ఇద్దరూ తక్షణమే ప్రాణాలు విడిచారు.


ఇలాంటిదే మరో ఉదాహరణగా ఒక స్త్రీ కథ చెప్పుకోవాలి. ఈవిడ మహా అహంభావి. తనని మించిన వాళ్లు లేరన్నుటుగా అందరినీ చులకనగా చూసేది. ఆవిడకి ఎన్నో భయంకరమైన కలలు వచ్చేవి. వాటిలో ఎన్నో అహితమైన సందేశాలు కనిపించేవి. ఆ విషయమే ఆమెకి వివరించాలని చూశాను. కాని నా హెచ్చరికలన్నీ మొండిగా పెడచెవిని పెట్టింది. ఆమె కలలు నానాటికి భీషణ రూపాలని దాల్చుతూ రాసాగాయి. అడవిలో ఒంటరిగా షికారుకి వెళ్లడం ఆమెకి ఒక అలవాటు. ఆ సంచారాల గురించి ఆమె ఏదేదో ఊహించుకునేది. ఆ షికార్ల గురించి కూడా ఆమె కలలలో ఎన్నో హెచ్చరికలు కనిపించాయి. ఇక్కడ కూడా ఆమెకి పొంచి వున్న ప్రమాదాన్ని పసిగట్టి ఆమెని వారించాలని చూశాను. కాని ఆమె నా మాటలు లక్ష్యపెట్టలేదు. ఒక రోజు ఆమె ఒంటరిగా సంచరిస్తున్న వేళలో ఒక దుష్టుడు ఆమెని దారుణంగా లైంగికంగా అటకాయించాడు. ఆమె కేకలు విని ఇరుగు పొరుగు వారు పరుగెత్తుకొచ్చి ఆమెని రక్షించారు. కొంచెం ఉంటే ఆమె ప్రాణాలే పోయేవి.

ఇందులో పెద్ద ఆశ్చర్యం ఏమీ లేదు. ఆమె కలలను బట్టి మనకి తెలిసేది ఏమంటే ఇలాంటి విపరీత పరిణామం గురించి, దుస్సాహసం గురించి ఆమెలో రహస్యంగా ఏనాటి నుంచో ఒక వాంఛ ఉండేది. ఇదే విధంగా అంతకు ముందు చెప్పుకున్న కథలో పర్వతారోహకుడు కూడా తన సమస్యల నుండి తప్పించుకునే నిశ్చయమైన తరుణోపాయం కోసం కోసం అచేతనంగా కాంక్షిస్తున్నాడు. అయితే ఆ కాంక్ష తీరడం కోసం ఎంత పెద్ద మూల్యం చెల్లించవలసి ఉంటుందో ఇద్దరికీ అవగాహన లేదు. ఆమెకి కేవలం కొన్ని ఎముకలు విరిగాయి; అతడి ప్రాణాలే పోయాయి.

ఆ విధంగా కొన్ని సార్లు కలలు జరగబోయే సంఘటనలని ఎంతో కాలం ముందే వెల్లడి చెయ్యగలవు. దీన్ని మహత్యం అనో, భవిష్యద్ దృష్టి అనో అననక్కర్లేదు. మన జీవితంలో ఎదురయ్యే సంకట పరిస్థితులకి ఎన్నో

సార్లు  సుదీర్ఘమైన అచేతన చరిత్ర ఉంటుంది. ఎలాంటి ప్రమాదం మన కోసం పొంచి ఉందో అర్థం చేసుకోకుండా ఆ దుష్పరిణామాణాన్ని నెమ్మది నెమ్మదిగా సమీపిస్తాము. అయితే ఏ వాస్తవాన్నయితే మనం సచేతనంగా చూడలేకపోతామో, ఆ వాస్తవాన్ని మన అచేతన గుర్తిస్తుంది. కలల ద్వారా ఆ గుర్తింపుని సందేశాల రూపంలో మనకి అందిస్తుంది.

ఆ విధంగా కలలు ఎన్నో సార్లు మనకి వారించవచ్చు; అలాగే ఎన్నో సార్లు వారించకపోవచ్చును కూడా. కాబట్టి ప్రతీ సందర్భంలోనూ ఏదో అభయహస్తం మనని ఆపదల నుండి కాపాడుతుందనే నమ్మకం కూడా అంత సరైనది కాదు. కాస్త నిర్మాణాత్మకంగా చెప్పాలంటే ఆ హితమైన శక్తి కొన్ని సార్లు మనని కాపాడుతుంది, కొన్ని సార్లు కాపాడదు. కొన్ని సార్లు ఓ విచిత్ర హస్తం మన చేయి పట్టుకుని మన వినాశనానికి గొనిపోవచ్చు కూడా. కొన్ని సార్లు కలలు ఉచ్చులుగా, ఎరలుగా కూడా పని చేయవచ్చు. కొన్ని సార్లు కలలు డెల్ఫిక్ మంత్రసాని  కి (Delphic Oracle) మల్లె పని చేయొచ్చు. ఆ జోస్యుడు క్రోసస్ అనే రాజుకి, ఆ రాజు హేలిస్ అనే నదిని గాని దాటితే ఓ విశాల సామ్రాజ్యం నాశనమవుతుందని చెప్పాడు. జోస్యుడి మాట పట్టుకుని ఆ రాజు నదిని దాటి, యుద్ధంలో పాల్గొని, చిత్తుగా ఓడిపోయాడు. అసలు రహస్యం అప్పుడు అర్థమయ్యింది అతడికి. జోస్యుడు చెప్పినట్టు నిజంగా ఒక సామ్రాజ్యం నాశనమయ్యింది. అయితే అది శత్రు రాజ్యం కాదు, తన రాజ్యమే నాశనమయ్యింది.



డెల్ఫిక్ మంత్రసాని చెప్పే భవిష్యవాణి – పై చిత్రంలో ఏథెన్స్ ని పాలించే ఏజియస్ రాజుకి డెల్ఫిక్ మంత్రసాని జోస్యం చెప్తోంది. అచేతన నుండి వచ్చే సందేశాలకి మల్లె ఆమె చెప్పే సందేశాలు గూఢంగా, ద్వంద్వార్థభరితమై శ్రోతలకి తికమక పెడతాయి.

కాబట్టి కలలతో వ్యవహరించేటప్పుడు అమాయకంగా ప్రవర్తిల్లితే లాభం లేదు. అవి ఏ చైతన్యంలో ఉత్పన్నమవుతాయో అది కేవలం మానవ చైతన్యం కాదు. అదొక ప్రకృతి సహజమైన శక్తి. కరుణ, క్రౌర్యం కలగలసిన ఒక దేవతా శక్తి. ఆధునిక మానవుడు చేతనలో కన్నా, ప్రాచీన పౌరాణిక గాధా వేదిక మీదను, ఆదిమ ఆరణ్యక అనుభవ ధారలలోను, ఆ శక్తి తత్వం మనకి అవగతం అవుతుంది. నాగరిక సమాజం సాధించిన పురోగతి అంతా వ్యర్ధమని నేను అనడం లేదు. కాని ఆ పురోగతిని సాధించడం కోసం ఎంతో నష్టపోయాం. ఆ నష్టం ఎంత ప్రగాఢమైనదో మనకి ఇప్పటికీ పూర్తిగా అర్థం కావడం లేదు. ఆది మానవుడి చేతనా స్థితికి, ఆధునికుడి చేతనా స్థితికి మధ్య తులనాత్మక పరిశీలన చెయ్యడంలో నా ఉద్దేశం ఈ లాభనష్టాల వివరాలన్నీ లోతుగా బేరీజు వెయ్యడమే.

"సహేతుకంగా" ఆలోచిస్తూ, తమని తాము "నియంత్రించుకోగలిగే" ఆధునిక మానవుల్లా కాక ఆదిమానవులు తమ సహజ స్వభావాన్ని (instinct) అనుసరించి బతికేవారు. నాగరీకరణ చెందే ప్రయత్నంలో మనం మన ప్రకృతి నిబద్ధ చేతన నుండి క్రమంగా వేరుపడిపోయాము. అంతేకాక చైత్య ప్రక్రియలకి కూడా శారీరకమైన, పార్థివమైన ఆధారం ఉంటుందనే ప్రాథమిక సత్యం నుండి కూడా దూరం అయ్యాము. అయితే మన చేతనలోని ఈ ప్రకృతి సహజ స్తరాల నుండి మనం పూర్తిగా సంబంధాన్ని కోల్పోలేదు. స్వప్న చిత్రాల రూపంలో ఆ స్తరాలు అప్పుడప్పుడు తమని వ్యక్తం చేసుకుంటూనే ఉన్నాయి. ఈ ప్రకృతి సహజ చేతనా ప్రక్రియలని అంత సులభంగా గుర్తించలేకపోవచ్చు. ఎందుకంటే అవి ప్రతీకాత్మకంగా వ్యక్తం అవుతాయి. కాని అవి కలలు నిర్వర్తించే పరిపూరక విధులలో ముఖ్యమైన పాత్ర ధరిస్తాయని గుర్తుంచుకోవాలి.

మానసిక స్థైర్యం కోసమే కాక, శారీరక ఆరోగ్యం కోసం కూడా అచేతనకి, సచేతనకి మధ్య గాఢమైన అనుసంధానం ఉండాలి. అవి రెండూ సమాంతర రేఖల మీద ముందుకు నడవాలి. వాటి మధ్య "విచ్ఛేదం" (dissociation) ఏర్పడితే మానసిక రుగ్మతలు తలెత్తుతాయి. దీని దృష్టితో చూసినప్పుడు మానవ మానసంలోని ప్రకృతి సహజ ప్రాంతాల నుండి సహేతుక ప్రాంతాలకి విషయాలని మోసుకుపోయే

వార్తాహరులు స్వప్నచిత్రాలు. వాటిని సరిగ్గా అన్వయించుకోగలిగితే, చైతన్యంలోని నల్లని నీడలు తొలగి కాంతులు చిందుతాయి. మరచిపోయిన సహజ చేతనపు పరిభాషని సచేతన మళ్లీ నేర్చుకుంటుంది.


అయితే నిజంగానే సహజ చేతనా స్తరాలు ఇలాంటి పాత్ర ధరిస్తాయా అని చాలా మంది సందేహిస్తారు. ఎందుకంటే అవి పంపే సందేశాలని మనం చాలా వరకు లక్ష్యపెట్టము, అర్థం చేసుకోము. సామాన్య జీవనంలో కలలని అర్థం చేసుకోవడం పూర్తిగా అనవసరం అని అనుకుంటారు.  ఈ సందర్భంలో తూర్పు ఆఫ్రికాలో ఒక ఆదిమ తెగతో నేను పొందిన ఒక అనుభవాన్ని పంచుకుంటాను. ఈ తెగ వారికి అసలు కలలే రావట! అది విని నేను ఆశ్చర్యపోయాను. కాని వారితో ఎంతో ఓపిగ్గా, ఒడుపుగా మాట్లాడి కూపీ లాగిన మీదట నాకు అర్థమయ్యింది ఏమిటంటే వారికి కూడా అందరి లాగానే నిజంగా కలలు వస్తాయి.  అయితే వాటికి ఎలాంటి ప్రాముఖ్యత లేదని వారు అనుకుంటారు. “మామూలు మనుషులకి వచ్చే కలలకి అసలు అర్థమే లేదు,” అన్నారు వాళ్లు నాతో. ఊరి పెద్దలు, వైద్యులు మొదలైన ప్రముఖులకి వచ్చిన కలలే ముఖ్యమైనవట. వారికి వచ్చిన కలలు మొత్తం తెగ యొక్క శ్రేయస్సుకి సంబంధించినవై ఉంటాయి. కాని ఇక్కడ సమస్య ఎక్కడ వచ్చిందంటే ఆ ఊరి పెద్ద, వైద్యుడు కూడా ఈ మధ్య కాలంలో వారికి అర్థవంతమైన కలలు రావడం లేదని వాపోతున్నారు. బ్రిటిష్ వారు తమ దేశానికి వచ్చిన నాటి నుండి ఈ మార్పు జరిగిందని వారి నమ్మకం. అంత వరకు ఏ కలలైతే ఆ తెగ యొక్క విధివిధానాలని నియంత్రిస్తూ వచ్చాయో, ఆ “మహత్తర స్వప్నాలని” కనే బాధ్యతని జిల్లా కమిషనర్ గా పని చేసే ఓ బ్రిటిష్ అధికారి చేపట్టాడు.

ఆ తెగ వారికి కలలు వస్తున్న మాట నిజమే అయినా, అవన్నీ అర్థంలేని కలలని వారి నమ్మకం. ఆధునిక మానవుడి లాగానే వాళ్లు కూడా తమ కలలు అర్థం కాలేదు కనుక వాటికసలు అర్థమే లేదనే నమ్మకంలో

పడిపోయారు. అయితే నాగరిక మానవుడు కూడా కొన్ని సార్లు (అయితే అతడికి ఆ ఎరుక లేకపోవచ్చు) తమ కలలకి తమ చిత్తవృత్తి (moods) మీద ప్రభావం ఉంటుందని ఒప్పుకుంటాడు. అది సత్ప్రభావం కావచ్చు, దుష్ప్రభావం కావచ్చు. అంటే కలలోని సారం "గ్రహించబడింది" కాని అది కేవలం ఉపచేతనంగా మాత్రమే జరిగింది. ఎన్నో సందర్భాలలో ఇదే జరుగుతుంది. ఎంతో అరుదైన సందర్భాలలో మాత్రమే కల మన చేతన మీద గాఢమైన ముద్ర వేస్తుంది. ఒకే కల మళ్లీ మళ్లీ వచ్చినప్పుడు, ఆ కల వచ్చిన వ్యక్తి దాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం తప్పనిసరిగా చేసేలా చేస్తుంది.

స్వప్న విశ్లేషణ తెలివి తక్కువగా, అసమర్థంగా చేస్తే ఇబ్బందులు ఎదురవుతాయని ఇక్కడ హెచ్చరించదలచుకున్నాను. కొంతమంది మానసిక స్థితి ఎంత అస్థిరంగా, చంచలంగా ఉంటుందంటే వాళ్లు తమ కలలని అన్వయించుసే తీరు కూడా చాలా ప్రమాదకరంగా ఉంటుంది. అలాంటి వారిలో ఒక పక్క ఏకపక్షమైన సచేతన మరో పక్క అహేతుకమైన "పిచ్చి" అచేతన నుండి పూర్తిగా విఛ్ఛోడవుతుంది. సరైన ముందు జాగ్రత్తలు తీసుకోకుండా రెండిటినీ తిరిగి కలిపే ప్రయత్నం చెయ్యకూడదు.

ఇక సార్వజనిక దృష్టితో చూసినప్పుడు, స్వప్న విశ్లేషణ గురించి సుసిద్ధంగా దొరికే "ప్రామాణిక" గ్రంథాలని నమ్మడం కన్నా వెర్రితనం లేదు. స్వప్న ప్రతీకలని అర్థం చెసుకోవడం అంటే ఒక ప్రామాణిక గ్రంథాన్ని తిరగేసి తెలుసుకోవడం అంత సులభం కాదు. స్వప్న ప్రతీక ని ఎప్పుడూ ఆ కల గన్న వ్యక్తి నుండి వేరుగా చూడడానికి వీలుపడదు. ఏ కలనైనా కచ్చితంగా, నిర్ద్వంద్వంగా అన్వయించడానికి సాధ్యం కాదు. వ్యక్తికి వ్యక్తికి మధ్య అపారమైన తేడా ఉంటుందని గుర్తుంచుకోవాలి. వ్యక్తి యొక్క సచేతన మానసాన్ని అచేతన పరిపూరించడానికి ప్రయత్నిస్తుంది. కాబట్టి ఆ వ్యక్తి యొక్క అచేతన నుండి వచ్చే కలలని, ఆ కలలు తెలిపే ప్రతీకలని సార్వజనికంగా వ్యక్తం చెయ్యడం ఎలా సాధ్యమో అర్థం కాదు.




20 వ శతాబ్దంలో బ్రిటన్ లో ప్రచురితమైన ఒక “కలల పుస్తకం.” వ్యక్తిగత పరిస్థితులని పరిగణించకుండా కలలని అన్వయించడానికి ప్రయత్నించే ఇలాంటి పుస్తకాల వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు.

అయితే సార్వజనీనమైన స్వప్నాలు, ప్రత్యేక ప్రతీకలు ఉంటాయన్నది మాత్రం నిజం. అలాంటి కలలు తరచు వస్తుంటాయి. వాటిని 'స్వప్నమాతృక' (motif) అని పిలుస్తాను. అలాంటి మూలస్వప్నాలకి కొన్ని ఉదాహరణలు – కింద పడుతున్నట్టు, గాల్లో ఎగురుతున్నట్టు, క్రూరమృగాలో ముష్కరులో వెంటాడుతున్నట్టు, చాలీచాలని బట్టలతో బహిరంగ ప్రదేశాలలో తిరుగుతున్నట్టు, నిష్ప్రయోజకమైన ఆయుధాలతో యుద్ధం చేస్తున్నట్టు, ఆత్మరక్షణ లేకుండా దొరికిపోయినట్టు, వేగంగా పరుగెడుతున్నా ఉన్న చోటనే ఉన్నట్టు, మొదలైనవి ఆ కలలు. చాలా చిన్న రూపాన్నో, చాలా పెద్ద రూపాన్నో దాల్చినట్టు, లేదా ఒక రూపం నుండి మరో రూపానికి మారినట్టు వచ్చే కల చిన్నతనం నుండి కూడా వస్తుంటుంది. అలాంటి పరిణామం ఒకటి లువిస్ కారొల్ (Lewis Carrol) రచించిన 'ఆలిస్ ఇన్ వండర్లాండ్' పుస్తకంలో మనకు ఎదురవుతుంది. అయితే ఈ మూలస్వప్నాలని ఆ కల వచ్చిన సందర్భం అనే నేపథ్యంలో మాత్రమే చూడాలని నొక్కి చెప్పదలచుకున్నాను. స్వయం విదితమైన, సార్వజనీనమైన ప్రతీకలుగా వాటిని పరిగణించరాదు.

ఇక మరలా మరలా వచ్చే కల ఒక ప్రత్యేక విశేషం అని చెప్పుకోవాలి. కొన్ని సందర్భాలలో ఒకే కల చిన్నతనం నుండి పెద్దయ్యాక కూడా వస్తుంది. స్వప్నకారుడికి జీవితం పట్ల దృక్పథంలో ఏదైనా దోషం ఉంటే దాన్ని పరిపూరించడానికి, సవరించడానికి ఈ కల వస్తూ ఉండొచ్చు. లేదా ఏదో బాధాకరమైన అనుభూతి వల్ల ఏర్పడ్డ ఒక కఠోరభావాన్ని సవరించడం దాని ప్రయోజనం కావచ్చు. కొన్ని సార్లు అది ఏదో ముఖ్యమైన భావి సంఘటనను తెలిపే అవకాశం కూడా వుంది.



బ్రిటిష్ రచయిత లువిస్ కారొల్ రాసిన 'ఆలిస్ ఇన్ వండర్లాండ్'  పుస్తకం నుండి ఒక చిత్రం. ఇందులో ఆలిస్ అనే పాప శరీరం విపరీతంగా పెరిగి మొత్తం గదిని నింపేస్తుంది. శరీరం విపరీతంగా పెరిగినట్టు వచ్చే కలలకి ఈ సన్నివేశం అద్దం పడుతుంది.

కొన్నేళ్ల క్రితం నాకు కూడా ఒక స్వప్న మాతృక కలిగింది. అందులో నా ఇంట్లో నాకు అంతవరకు తెలీని ఒక విభాగాన్ని "కనుగొన్నాను." కొన్ని సందర్భాల్లో ఆ విభాగంలో ఎప్పుడో చనిపోయిన నా తల్లిదండ్రులు జీవించేవారు. అక్కడ మా తండ్రి ఒక ప్రయోగశాల నడిపించేవారు. చేపల దేహాల తులనాత్మక పరిశీలనలు చేసేవారు. మా తల్లి దయ్యపుటతిథుల కోసం ఒక హోటల్ నడిపించేది. మరి కొన్ని కలలలో ఈ అపరిచిత అతిథిమందిరం వేరే రూపం దాల్చుతుంది. అప్పుడది ఎప్పుడో మరచిపోబడ్డ ఒక ప్రాచీన చారిత్రక మందిరం.

అయితే నాకు వారసత్వంగా సంక్రమించిందది. అందులో ఎంతో ఆసక్తికరమైన పాతకాలపు బల్లలు, కుర్చీలు ఉన్నాయి. అదే కలల పరంపరలో చివర్లో ఆ విభాగంలో ఒక పాతకాలపు గ్రంథాలయం కనిపించింది. అందులో పుస్తకాలన్నీ నాకు పరిచయం లేనివి. ఇక చివరిగా వచ్చిన కలలో ఒక పుస్తకం  తెరిచి చూశాను. దాని నిండా అద్భుత ప్రతీకాత్మక చిత్రాలు కిక్కిరిసి వున్నాయి. ఆ కల నుండి ఉలిక్కి పడి మేలుకున్నప్పుడు ఏదో చెప్పలేని ఆవేశంతో నా గుండె దడదడ కొట్టుకోసాగింది.



ప్రతీకలు అప్రయత్నంగా అచేతన లోంచి ఉద్భవిస్తాయి. ప్రాచీన ఈజిప్ట్ కి చెందిన “అంఖ్” అనబడే ఈ ప్రతీక జీవితానికి, వ్యక్తికి, విశ్వానికి ప్రతీక. (“ఆంఖ్” అనే హిందీ పదానికి అర్థం ‘కన్ను.’ సంస్కృత పదం ‘ఆలోక’

అంటే చూడడం అని అర్థం. ఇందులో 'లోక' (ప్రపంచం) అనే మూలశబ్దం వస్తోంది. చూడడం అనే ప్రక్రియ వల్ల లోకం లేదా విశ్వం ఏర్పడుతోంది అనే భావన ఈ పదజాలం సూచిస్తోంది.  ఈజిప్షియన్ పదం "అంఖ్" కి అర్థాల్లో ఒకటి 'విశ్వం' కావడం విశేషం. – అనువాదకుడు.)

కంపెనీల 'లోగో'లు స్వప్న ప్రతీకలు కావు. ఉదాహరణకి, ఇది జర్మన్ వైమానిక దళం లుఫ్ట్ హాంసా కి (Lufthansa) చిహ్నం. ఇది స్వప్న ప్రతీక కాదు. ఎందుకంటే ఎవరో సచేతనంగా సృష్టించగా పుట్టిన చిహ్నమిది.

నాకా ఆఖరు కల రావడానికి కొంచెం ముందు ఒక పురాతన పుస్తకాల షాపు వ్యక్తి వద్ద ఒక పాతకాలపు పుస్తకం ఆర్డర్ ఇచ్చాను. అది మధ్యయుగపు పరుసవేదుల రచనల సంకలనానికి సంబంధించిన పుస్తకం.  ఆ మధ్యన సాహిత్యంలో ఒక వాక్యం కనిపించింది. అది తొలి బైజాంటైన్ పరుసవేదానికి చెందిన రచనల నుండి వచ్చి వుంటుందని అనిపించింది. అదేంటో తెల్సుకోవాలని అనుకున్నాను. కలలో పాతకాలపు పుస్తకం కనిపించిన కొన్ని వారాల తరువాత పోస్టులో పుస్తకపు పార్సెల్ వచ్చింది. అందులో 16 వ శతాబ్దానికి చెందిన ఒక ప్రాచీన గ్రంథం కనిపించింది. విస్మయం గొలిపే ప్రతీకాత్మక చిత్రాలతో కన్నులపండువుగా ఉందా పుస్తకం. ఆ చిత్రాలు చూడగానే కలలో నేను చూసిన పుస్తకం, అందులోని చిత్రాలు గుర్తొచ్చాయి. మనస్తత్వ శాస్త్రంలో

పురోగామిగా నేను చేస్తున్న  కృషిలో, పరుసవేదపు మూల సూత్రాల పునరావిష్కరణ ప్రభావం  ఎంతో ఉందన్న విషయం కాలాంతరంలో తెలిసింది. దాని దృష్ట్యా కలలలో పదే పదే నేను చూసిన మాతృక యొక్క అంతరార్థం సులభంగా అర్థం కాసాగింది. ఆ ఇల్లు నా వ్యక్తిత్వానికి, నా ప్రత్యేక క్రియారంగానికి ప్రతీక అని వేరే చెప్పనక్కర్లేదు. అందులో అంతవరకు తెలియని విభాగం అప్పుడప్పుడే పెరుగుతున్న నా ఆసక్తికి, నా సచేతన మానసానికి ఇంకా తెలియని ఓ కొత్త పరిశోధనా రంగానికి అది ప్రతీక. ఆ క్షణం నుండి గత 30 ఏళ్లుగా మళ్లీ ఆ కల ఎప్పుడూ రాలేదు.

## కలల విశ్లేషణ

ప్రతీకకి, చిహ్నానికి మధ్య తేడాని వివరిస్తూ ఈ వ్యాసాన్ని ఆరంభిసున్నాను. చిహ్నం అనేది ఏ భావనకైతే అది ప్రతీకగా నిలుస్తుందో అంతకన్నా చిన్నది. ప్రతీక అనేది ఎప్పుడూ దాని బాహ్యామైన, స్వయంవిదితమైన అర్థం కన్నా మరింత ప్రగాఢమైన యదార్థాన్ని సూచిస్తుంది. అంతేకాక ప్రతీకలు సహజంగా, స్వయంజాతంగా పుట్టుకొచ్చేవి.  ఏ మేధావి కూడా ఒక రోజు కలాన్ని, కుంచెని చేపట్టి “ఈ రోజు నేనొక ప్రతీకని తయారుచెయ్యబోతున్నాను,” అని బయల్దేరడు. ఎవరూ కూడా ఒక సహేతుకైన ఆలోచనా ధారని అనుసరిస్తూ, దాని అంతాన్ని చేరుకున్నాక, ఉద్దేశపూర్వకంగా దానికొక “ప్రతీకాత్మక” రూపాన్ని ఇవ్వరు. ఆ విధంగా పుట్టిన భావానికి ఎన్ని విడ్డూరమైన, ఊహకందని తోకలు తగిలించినా, దానితో  సచేతన చింతన అనుసంధానమై ఉంటుంది కనుక, అది చిహ్నం మాత్రమే అవుతుంది గాని, అది దాని వెనుక నేపథ్యంలో ఉండే ఏదో తెలీని తత్వాన్ని సూచించే ప్రతీక కాలేదు. కలలలో ప్రతీకలు అప్రయత్నంగా పుట్టుకొస్తాయి. కలలు

వాటికవే సంభవిస్తాయి. అవి మనసు చేత కూర్చబడేవి కావు. కాబట్టి కలలే ప్రతీకల పట్ల మన జ్ఞానానికి ముఖ్యమైన మూలాలు.

కాని ప్రతీకలు కేవలం  కలలలో మాత్రమే జనించవు. ఎన్నో రకాల చైత్య అభివ్యక్తీకరణలలో (psychic manifestations) కూడా అవి కనిపిస్తాయి. ప్రతీకాత్మకమైన ఆలోచనలు, తలంపులు ఉంటాయి. ప్రతీకాత్మకమైన చేష్టలు, సన్నివేశాలు ఉంటాయి. కొన్ని సార్లు ప్రాణం లేని వస్తువులు కూడా అచేతనతో పాటు కలిసి పని చేస్తూ ప్రతీకాత్మక విన్యాసాలని ఏర్పాటు చేస్తాయి. యజమాని మరణ సమయంలో ఆగిపోయిన గడియారాల గురించి విశ్వసనీయమైన కథలెన్నో ఉన్నాయి. ఫ్రెడెరిక్ ద గ్రేట్ కి (Frederic the Great) చెందిన సాన్ సూసీ రాజమందిరంలోని గోడగడియారం రాజు మరణించిన సమయంలో ఆగిపోయిందట. అదే విధంగా మరణం సంభవించినప్పుడు అద్దం పగలడం, గోడ మీద పటం పడిపోవడం మొదలైనవి మరి కొన్ని ఉదాహరణలు. అదే విధంగా ఇంట్లో ఎవరైనా హార్దికమైన సమస్యలని, ఆవేదనలని ఎదుర్కొంటున్నప్పుడు ఇంట్లో ఏదైనా యంత్రాంగం దెబ్బతినడం కూడా అలాంటిదే మరొక ఉదాహరణ. ఇలాంటి ఉదంతాలని సంశయాత్ములు ఒప్పుకోకపోవచ్చునేమో. కాని ఇలాంటి సన్నివేశాలు పదే పదే తలెత్తుతుంటాయి. కాబట్టి వాటి మానసిక ప్రాముఖ్యతకి ఇలాంటి సంఘటనలు సాక్ష్యాలుగా తీసుకోవాలి.

అయితే వేరే రకం ప్రతీకలు కూడా ఉన్నాయి. వీటిలో ముఖ్యమైనవి వాటి మూలం, తత్వం వ్యక్తికి సంబంధించినవి కావు, అవి సమిష్టికి సంబంధించినవి. అవి చాలా వరకు మత, అధ్యాత్మిక సారాంశం గల చిత్రాలు. వాటిని నమ్మే భక్తులు అవి ఏవో దివ్య మూలం నుండి వచ్చాయని అనుకుంటారు. అవి మనిషికి దైవం వెల్లడి చేసిన రహస్యాలు అనుకుంటారు. అవన్నీ వట్టి కల్పితాలని సంశయాత్ములు కొట్టిపారేస్తారు. అయితే ఇరు పక్షాలదీ తప్పే. అధ్యాత్మిక ప్రతీకలు, భావజాలం కొన్ని శతాబ్దాలుగా క్షుణ్ణంగా, సవివరంగా విశదీకరించబడ్డాయి కదా అని సంశయాత్ములు అన్నప్పుడు అందులో నిజం లేకపోలేదు. ఆ ప్రతీకల వేళ్లు

గతపు పొరలలో ఎంత లోతుగా పాతుకుపోయి ఉన్నాయంటే వాటికసలు మానవ మూలాలే లేవని భక్తులు భావించడంలో కూడా తప్పులేదని అనిపిస్తుంది. కాని నిజానికవి "సమిష్టికి చెందిన ప్రతీకలు." అవి ఆదిమ స్వప్నాల నుండి, సృజనాత్మకమైన ఊహాగానాలలో నుండి జనిస్తాయి. ఆ చిత్రాలు ఉద్దేశపూర్వకమైన కల్పనలు కావు. అప్రయత్నమైన, అసంకల్పితమైన అభివ్యక్తులు.

కలలని అన్వయించే ప్రయత్నం చేస్తున్నప్పుడు ఈ వాస్తవాన్ని ముఖ్యంగా మనసులో పెట్టుకోవాలి. ఈ విధంగా అర్థం చేసుకున్నప్పుడు, కలలు ప్రతీకాత్మకం అని నమ్మితే వాటిని ఒక విధంగా అన్వయిస్తాము. అలా కాకుండా ముందే ఉన్న ఏదో ఆలోచనో, భావావేశమో కల రూపంలో "ముసుగు వేసుకుని" వచ్చిందని అనుకునే వ్యక్తికి కల వేరే విధంగా అర్థమవుతుంది. ఈ రకమైన వ్యక్తుల విషయంలో స్వప్న అన్వయం అనే ప్రయత్నానికి అర్థం ఉండదు. ఎందుకంటే ముందే ఉన్నదాన్నే వాళ్లు కలల ద్వారా తెలుసుకుంటారు.

అందుకే మా శిష్యులతో ఎప్పుడూ అంటుంటాను: "ప్రతీకాత్మకత గురించి మీరు తెలుసుకోగలిగింది అంతా తెలుసుకోండి; కాని ఒక కలని విశ్లేషించేటప్పుడు మాత్రం అదంతా మర్చిపోండి." ఈ సలహా ఆచరణలో ఎంతో పనికొస్తుంది. ఒక సత్యాన్ని మాత్రం నేను ఎప్పుడు జ్ఞాపకం పెట్టుకుంటాను. మరొకరి కలని పూర్తిగా అర్థం చేసుకోవడం గాని, దోషం లేకుండా అన్వయించడం గాని సాధ్యం కాదు. నా మనసులో రేగే ఆలోచనల, ప్రతిస్పందనల ప్రవాహాన్ని అదుపు చేసుకోడానికి నాలో నేను అలా అనుకుంటాను. లేకపోతే నేను నా ఆలోచనలని, అభిప్రాయాలని రోగి మనసులో చెలరేగే సంధిగ్ధాల మీద, అనిశ్చితుల మీద ఆపాదించే పొరబాటు చేయొచ్చు. కలలోని కీలక సందేశాన్ని (అదే సచేతన మనస్సుకి అచేతన తెలియజేయగోరే సందేశం) వీలైనంత నిర్దోషంగా రోగికి తెలియజేయడం విశ్లేషకుడికి చాలా ముఖ్యం. కాబట్టి కలలోని అంశాలని విశ్లేషకుడు వీలైనంత క్షుణ్ణంగా అర్థం చేసుకోవడం ఎంతో అవసరం.

నేను ఫ్రాయిడ్ తో పని చేస్తున్న కాలంలో పై సత్యాన్ని విశదం చేస్తూ ఒక కల వచ్చింది. ఆ కలలో నేను "నా ఇంట్లో" ఉన్నానట. అది మొదటి అంతస్థు. అందులోని ముందు గది 18 వ శతాబ్దపు హంగులతో చాలా హాయిగా ఉంది. ఆ గదిని మునుపెన్నడూ చూడక పోవడం ఏంటని నేనే ఆశ్చర్యపోయాను. మరి నేల అంతస్థు ఎలా ఉంటుందో నన్న ఆలోచన వచ్చింది. కిందికి వెళ్లి చూస్తే నేల అంతస్థు అంతా చాలా చీకటిగా వుంది. గోడకి చిక్కని రంగులు పులిమి వున్నాయి. గదిలోని బల్లలు, కుర్చీలు భారీగా ఉన్నాయి. అవి 16 వ శతాబ్దానికో, ఇంకా పాతవో అయ్యుంటాయి అనిపించింది. ఆ దృశ్యాన్ని చుస్తున్న కొద్ది నాలోని ఆశ్చర్యాన్ని, ఉత్సుకతని మరింత ఇనుమడింపజేసింది. ఇల్లంతా పూర్తిగా తరచి తరచి చూడాలని అనిపించింది. అప్పుడు నేల మాళిగలోకి వెళ్లాను. ఒక తలుపు తెరిచి చూస్తే రాతి మెట్లు ఒక విశాలమైన గది వరకు తీసుకుపోతున్నాయి. ఆ గది నేల అంతా పెద్ద పెద్ద రాతి పలకలు పేర్చి వున్నాయి. గోడలు చాలా పురాతనమైనవి అనిపించింది. గోడల్లోని సున్నాన్ని పరిశీలించగా అందులో ఇటుక ముక్కల్ని కలిపినట్టు తెలుస్తోంది. గోడలు రోమన్ ల  కాలం నాటివని తెలుస్తోంది. నాలో చెప్పలేని ఉత్సాహం కలిగింది. ఒక మూల నేలలో ఉన్న ఒక రాతి తలుపు మీద ఒక ఇనుప చట్రం కనిపించింది.   ఆ తలుపుని పైకెత్తి చుస్తే మరో ఇరుకైన మెట్ల దారి కనిపించింది. అది ఒక విధమైన గుహ వద్దకు తీసుకుపోతోంది. అదే పూర్వచారిత్రక సమాధిమందిరంలా వుంది. అక్కడ రెండు పుర్రెలు, పట్టెడు ఎముకలు, కొన్ని పగిలిన కుండలు కనిపించాయి. అంతలో ఠక్కున మేలుకున్నాను.

ఫ్రాయిడ్ గాని ఈ కలని విశ్లేషించే ప్రయత్నం చేసినప్పుడు, నేను సూచించిన పద్ధతిలో కల యొక్క సందర్భాన్ని, సంబంధాలని పరిగణనన లోకి తీసుకుంటూ చేసినట్లయితే, అతడు ఓ చక్కని కథనాన్ని ఆవిష్కరించి ఉండేవాడు.  ఏదో సొంత సమస్య నుండి తప్పించుకోడానికి ఇదంతా ఒక ఎత్తు అని ఇలాంటి విశ్లేషణని కొట్టిపారేసేవాడు. నిజానికి ఈ కల నా జీవితం యొక్క సంక్షిప్త సారాంశం. ఇంకా కచ్చితంగా

చెప్పాలంటే నా మానసిక వికాస క్రమం యొక్క వర్ణన. నేను చిన్నప్పుడు పెరిగిన ఇల్లు 200 ఏళ్ల నాటిది. మా ఇంట్లో బల్లలు, కుర్చీలు చాలా వరకు 300 ఏళ్ల నాటివి. ఇంతవరకు నేను తలపెట్టిన అతి ముఖ్యమైన సాహస యాత్ర కాంట్ (Kant), షొపెన్ హోవర్ (Schopenhauer) ల తత్వబోధలని అధ్యయనం చెయ్యడం. ఆ రోజుల్లో అతి ముఖ్యమైన సంచలన వార్త చార్లెస్ డార్విన్ సిద్ధాంతం. అంతవరకు నేను నా తల్లిదండ్రుల నీడలో మధ్యయుగపు భావజాలాన్ని అనుసరిస్తూ జీవించాను. వారి దృష్టిలో ఈ మానవ జీవనాన్ని సర్వశక్తుడైన దైవం, ఎదురులేని విధిరాత శాసిస్తుంటాయి. అలాంటి ప్రపంచం ఇప్పుడు పాతబడిపోయింది, దానికిక కాలం చెల్లిపోయింది. తూర్పు లోకపు మతాల తోను, గ్రీకు తత్వంతోను పరిచయం పెరిగాక క్రైస్తవ మతంపై నా విశ్వాసం కాస్త సన్నగిల్లింది. ఆ కారణం చేతనే [కలలో] నేలమాళిగ నిశ్చలంగా, చీకటిగా, నిర్మానుష్యంగా ఉంది.

ఆ రోజుల్లో చరిత్ర మీద నా ఆసక్తికి కారణానికి వేళ్లు జీవశాస్త్రంలో నేను చేసిన కృషిలో వున్నాయి. దేహనిర్మాణ సంస్థలో (Anatomical Institute) సహచరుడిగా పని చేస్తున్న రోజుల్లో తులనాత్మక దేహనిర్మాణ శాస్త్రం మీద, పురాజీవ శాస్త్రం మీద నా దృష్టి మళ్లింది. శిలాజాలలో దొరికిన మానవ ఎముకల పట్ల నాకెంతో విస్మయం కలిగింది. ఇంకా ప్రత్యేకించి నియాండెర్తలెంసిస్ (Neanderthelensis) మానవుడి ఎముకలు, అలాగే దుబ్వా (Dubois) కనుక్కున్న పితికాంత్రొపస్ (Pithecanthropus) మానవుడి కపాలం నాలో గొప్ప కుతూహలాన్ని చిగురింపజేశాయి. నిజానికి నా కలతో అనుసంధానమైన అంశాలు ఇవే. కాని కపాలాల గురించి, అస్థిపంజరాల గురించి శవాల గురించి ఫ్రాయిడ్ తో ప్రస్తావించదలచుకోలేదు. ఎందుకంటే ఇలాంటి అన్వయాలు అతడికి రుచించవని నాకు తెలుసు. అతడి అకాల మరణాన్ని నేను ముందే ఊహిస్తున్నానని మరి ఎందుచేతనో తన మనసులో ఒక విడ్డూరమైన భావన ఉండేది. అతడు అలాంటి నిర్ణయానికి ఎలా వచ్చాడు అన్న దానికి కూడా ఒక విచిత్రమైన నేపథ్యం వుంది. 1909 లో ఇద్దరం అమెరికాకి పడవ ప్రయాణం

చేసే ముందు బ్రెమెన్ లో బ్లయికెల్లర్ అనే చోటికి వెళ్లాం. అక్కడ మేం చూసిన మమ్మీకృతమైన శవాలు నాకెంతో విస్మయం కలిగించాయి. దాన్ని బట్టి ఫ్రాయిడ్ మరి ఎందుచేతనో అలాంటి నిర్ణయానికి వచ్చాడు.



ఫ్రాయిడ్ మరియు యుంగ్ – ముందు వరుసలో ఎడమ కొసన ఉన్నది ఫ్రాయిడ్, కుడి కొసన యుంగ్.

ఆ కారణం చేత నా సొంత భావాలని వెలిబుచ్చడానికి కొంచెం సంకోచించాను. ఆలోచనా సరళిలో, దృక్పథంలో నాకు, ఫ్రాయిడ్ కి మధ్య పూడ్చరాని అగాధం ఉందని నాకు బాగా అర్థమయ్యింది. నా అంతరంగ ప్రపంచం గురించి అతడికి మనసు విప్పి చెబితే అతడికి అదంతా విడ్డూరంగా తోచవచ్చని, ఆ కారణం చేత మా మధ్య స్నేహం చెడిపోవచ్చని కూడా అనిపించింది. పైగా మనస్తత్వ రంగంలో నా భావాలలోనే కొంత సంకోచం ఉండడం చేత, నా "స్వేచ్ఛానుసంధానాల" (free associations) గురించి అతడితో ఒక అబద్ధం ఆడాను.

అతడి నా వ్యక్తిగత స్వభావం గురించి, పూర్తిగా భిన్నమైన ఆలోచనా సరళి గురించి వివరించి ఒప్పించడం అసాధ్యం అనిపించడం వల్ల ఆ పని చేశాను.

ఫ్రాయిడ్ తో నా కల గురించి చెప్పడం వల్ల ఎలాంటి ఇబ్బందికరమైన పరిస్థితి ఏర్పడిందో వివరించడానికి ఇంత భాగోతం చెప్పాల్సివచ్చినందుకు క్షమించమని అడుగుతున్నాను. కాని వాస్తవంలో స్వప్న విశ్లేషణా ప్రయత్నాలలో ఎదురయ్యే ఇక్కట్లకి ఇది చక్కని ఉదాహరణ. విశ్లేషకుడికి, విశ్లేషితుడికి మధ్య వ్యక్తిగత విభేదాల మీద అంతా ఆధారపడుతుంది.

నాలో ఏదో తీరని ఆశ కోసం ఫ్రాయిడ్ వెతుకుతున్నాడని నాకు ఒక దశలో అర్థమయ్యింది. నా కలలో కనిపించిన కపాలాలు, మా కుటుంబీకుల్లో కొందరి మరణం పట్ల నా కాంక్షకి సంకేతం కావచ్చునని ఒక సారి అతడికి సూచించాను. నా సూచనని అతడు  ఆమోదించాడు. అయితే ఇలాంటి “బూటకపు”  వివరణ అసలు నాకే అంతగా రుచించలేదు.

ఫ్రాయిడ్ వేసిన ప్రశ్నలకి ఆ విధంగా సమాధానాలు వెతుకున్నప్పుడు ఒక సారి ఒక విషయం నన్ను కలవరపెట్టింది. సచేతనమైన అవగాహనలో ఆత్మాశ్రయమైన అంశం (subjective factor) ఎంతవరకు ఉంటుంది అన్న విషయం మీద ఒక రోజు నా మనసులో ఒక ఆలొచన తళుక్కుమంది. ఆ ఆలోచన నన్ను ఎంతగా ఉక్కిరిబిక్కిరి చేసిందంటే, ఒప్పుకోమని ఎంతగా ఒత్తిడి చేసిందంటే, దాన్నుండి తప్పించుకోడానికి, పైన చెప్పినట్టు అబద్ధం ఆడక తప్పలేదు. అది సముచితం కాదు, నైతికం కూడా కాదు. కాని అలా చెయ్యకపోతే ఫ్రాయిడ్ తో పెద్ద గొడవ అయ్యుండేది. కొన్ని కారణాల వల్ల ఆ దశలో అతడితో గొడవ పడడానికి నాకు మనస్కరించలేదు.

నా మనసులో అప్పుడు తళుక్కు మన్న ఆలోచన సారాంశం ఇది – నా కల అంటే అది నేనే, నా జీవితం, నా ప్రపంచం, నా అనుభవైక చరిత్ర. నా అనుభవైక ప్రపంచాన్ని, యదార్థాన్ని మరొకరు, నా మనసుతో పరిచయం లేని మరొక మనస్సు, ఆ మనస్సులో ఏర్పడ్డ ఒక ప్రత్యేక సైద్ధాంతిక నిర్మాణం సహాయంతో, దాని సొంత ప్రయోజనాల కోసం బేరీజు వెయ్యాలని చూస్తుంది. అది ఫ్రాయిడ్ కి వచ్చిన కల కాదు. అది నాకొచ్చిన కల. అలా ఆలోచిస్తుంటే నా కల యొక్క అంతరార్థం ఒక్కసరిగా నా మదిలో మెరిసింది.

ఈ సంఘర్షణ వల్ల స్వప్నవిశ్లేషణకి సంబంధించిన ఒక కీలక సత్యం మనకు తెలుస్తుంది. నియమబద్ధంగా నేర్చుకుని ప్రయోగించడానికి ఇదొక శాస్త్రీయ విధానం కాదు. ఇది రెండు వ్యక్తిత్వాల మధ్య జరిగే ఒక ద్వంద్వ తాత్కాలిక భావ వినియమం (dialectical exchange). ఆ వినియమాన్ని, ఆ సంభాషణని యాంత్రికంగా అమలుజరిపితే, స్వప్నకారుడి అంతర్వ్యక్తి అందులో కనుమరుగైపోతాడు. వచ్చే ఫలితం ఈ ఒక్క ప్రశ్నకి సమాధానం మీద ఆధారపడుతుంది – స్వప్నకారుడు, విశ్లేషకుడు వీరిద్దరిలో ఎవరు ఎవర్ని అధిగమిస్తారు? ఈ కారణం చేతనే హిప్నాసిస్ చికిత్సలు చెయ్యడం ఆపేశాను. ఎందుకంటే మరొకరి మీద నా సంకల్పాన్ని రుద్దడం నాకు ఇష్టం లేదు. నా సూచనల వల్ల కాక, రోగి వ్యక్తిత్వం లోనుండే సహజంగా స్వస్థత కలిగించే ప్రక్రియలు అంకురించాలి. నేను చేసే సూచనలకి తాత్కాలిక ప్రయోజనమే ఉంటుంది. నా లక్ష్యం కేవలం రోగి యొక్క ఆత్మగౌరవాన్ని, స్వేచ్ఛని సంరక్షించడం, కాపాడటం. అప్పుడే అతడు తన జీవితాన్ని తను కోరిన రీతిలో జీవించగలుగుతాడు. ఫ్రాయిడ్ తో జరిపిన సంవాదాల వల్ల నాకు అర్థమయ్యింది ఏమిటంటే, మనిషి గురించి, మానవ చేతన గురించి సార్వజనీన సిద్ధాంతాలని రూపొందించే ముందు, మానవుడి అంతరంగ ప్రపంచం గురించి ఇంకా లోతుగా విపులంగా అర్థం చేసుకోవాల్సి వుంది.

వ్యక్తి మాత్రమే ఇక్కడ అసలు యదార్థం అని గుర్తుంచుకోవాలి. వ్యక్తికి దూరం అవుతూ, హోమో సేపియన్ల గురించి ఏవేవో పెద్ద పెద్ద మాటలు మాట్లాడడం మొదలెట్టామంటే, పప్పులో కాలేస్తున్నాం అన్న మాటే.

సంచలనాత్మక సాంఘిక పరిణామాలు, విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్న ఈ రోజుల్లో, మానవ వ్యక్తిత్వం గురించి ఇంకా లోతుగా అర్థం చేసుకోవలసిన అవసరం ఎంతైనా వుంది. అంతా అతడి మానసిక, నైతిక లక్షణాల మీద ఆధారపడుతుంది. సత్యాన్ని సంపూర్ణంగా పొడచూడగలగాలంటే, మానవుడి వర్తమానాన్నే కాక మనిషి గతాన్ని కూడా లోతుగా అర్థం చేసుకోవాలి. అందుకే పురాణాలని, ప్రతీకలని అర్థం చేసుకోవడం ఎంతో ముఖ్యం అవుతుంది.

వ్యక్తిత్వ వర్గ విభజన

వ్యక్తిరహితమైన ఒక అంశం మీద ఒక పూర్వభావనని (hypothesis) ఆపాదించి అధయనం చేసే పద్ధతి ఇతర శాస్త్ర రంగాలలో చెల్లుతుందేమో. కాని మనస్తత్వ శాస్త్రంలో  ఇద్దరు వ్యక్తుల మధ్య సజీవ సంబంధాలని అర్థం చేసుకోవాల్సిన అవసరం అనివార్యం అవుతుంది. అలాంటి వ్యక్తులలోని అంతర్వ్యక్తిని తొలగించి వస్తుగత విషయాలలా చర్చించలేము. వాళ్లని నిర్వ్యక్తీకరించలేము. విశ్లేషకుడు, రోగి కలుసుకున్నప్పుడు ఒక అంశాన్ని తీసుకుని దాన్ని వ్యక్తిరహితంగా, వస్తుగత దృష్టితో చూస్తూ చర్చించాలనే ఒప్పందంతోనే బయల్దేరవచ్చు. కాని తీరా సంభాషణ మొదలయ్యాక ఆ వినియమంలో ఇద్దరి వ్యక్తిత్వాలు పూర్తిగా విలీనం అయిపోతాయి. అలాంటి దశలో ఇంకా పురోగమించాలంటే, ఇద్దరి మధ్య పరస్పరం ఒక ఒప్పందం ఏర్పడాలి.

అలాంటి పరిస్థితుల్లో చరమ ఫలితాన్ని గురించి ఒక వస్తుగత నిర్ణయాన్ని తీసుకోవడానికి వీలవుతుందా? అలాంటి నిర్ణయానికి, ఏ సామాజిక నేపథ్యానికి అయితే ఆ వ్యక్తులు ఇద్దరూ చెందుతారో, ఆ సమాజంలో చలామణిలో ఉండే సాంఘిక ప్రమాణాలకి మధ్య పోలిక ఉంటుందా? ఉన్నా కూడా ఇక్కడ రోగి యొక్క మానసిక స్థితిని ("మతి స్థిమితం") పరిగణన లోకి తీసుకోవాలి. ఇలాంటి సంవాదానికి ఫలితంగా వ్యక్తిని పూర్తిగా సాంఘిక ప్రమాణాల, కట్టుబాట్ల పంజరంలో కుదించలేము. అలా చేశామంటే పూర్తిగా అసహజమైన,

ప్రకృతి విరుద్ధమైన పరిణామాన్ని కొని తెచ్చుకున్నట్టు అవుతుంది. మానసికంగా ఆరోగ్యవంతమైన, సామాన్య సమాజంలో వ్యక్తుల మధ్య పరిపాటిగా భిన్నాభిప్రాయాలు ఉంటాయి. ప్రకృతినిబద్ధమైన మానవ తాపత్రయాల రంగానికి బయట చూస్తే, మనుషుల మధ్య ఏకాభిప్రాయం చాలా అరుదుగా మాత్రమే ఏర్పడుతుంది.

అయితే అభిప్రాయభేదాలు సమాజంలో మానసిక జీవనాన్ని ముందుకు తోసే వాహనాలు కావాలే గాని దాని లక్ష్యం కాకూడదు. ఎందుకంటే మానసిక స్వభావం విరుద్ధాల మధ్య సమతూనిక మీద ఆధారపడుతుంది కనుక ఏ నిర్ణయాన్ని అయినా దాని వ్యతిరేక నిర్ణయంతో సహా పరిగణన లోకి తీసుకోవాలి గాని, అనితరంగా స్వీకరించకూడదు. ఈ సమస్యకి మూలాలు ఇక్కడ వున్నాయి. మానవ చిత్తం యొక్క స్వభావాన్ని అర్థం చేసుకోవాలంటే, అందుకు మనసు యొక్క దృక్పథం నుండే చూడాలి గాని, మనసుకి బయట మరే ఇతర దృక్పథం నుండి చూసినా అది సాధ్యం కాదు.

కలలని వ్యక్తిగతంగా పరిగణించాలన్న వాస్తవం నిజమే అయినా, ఎంతో మంది కన్న కలలని సేకరించి వాటిని అధ్యయనం చేసే మనస్తత్వ శాస్త్రవేత్త, వాటి నుండి కొన్ని సార్వజనీన సూత్రాలని వెలికితీస్తాడు. ఒక మనస్తత్వ సిద్ధాంతాన్ని సూత్రీకరించాలంటే, దాన్ని మరొకరికి బోధపరచాలంటే, కేవలం అనేకానేక ఉదాహరణలని తీసుకుని వాటిని విపులంగా వివరిస్తే సరిపోదు. ఆ అనేకానేక సందర్భాలలో దాగి వున్న కొన్ని సామాన్య లక్షణాలని, లేదా భేదాలని గుర్తించినప్పుడే అది సాధ్యమవుతుంది. అలాంటి సిద్ధాంతానికి ఆధారంగా ఏదైనా సామాన్య లక్షణాన్ని తీసుకోవచ్చు. కావాలంటే ఉదాహరణకి మనుషులని “అంతర్ముఖులు,” “బహిర్ముఖులు” గా విభజించే పద్ధతినే తీసుకోవచ్చు. ఈ విధంగా ఎన్నో రకాల సార్వత్రీకరణ సాధ్యం అవుతుంది. ఇలాంటి విభజన వల్ల ఎలాంటి సమస్యలు ఎదురవుతాయో తెలుసుకోవాలంటే, విశ్లేషకుడు ఒక వర్గం వాడై, విశ్లేషితుడు మరొక వర్గం వాడైతే ఎలా ఉంటుందో ఒకసారి ఆలోచించాలి.

స్వప్న విశ్లేషణ బాగా లోతుగా జరుగుతున్నప్పుడు ఇద్దరు వ్యక్తుల మధ్య ఘర్షణ ఏర్పడక తప్పదు. కాబట్టి వారి మనస్తత్వాలు ఒకే విధంగా ఉన్నాయా లేదా అన్నది చాలా ముఖ్యమవుతుంది. ఇద్దరూ ఒకే వర్గానికి చెందిన వారైతే ఇద్దరూ కలిసి హాయిగా చాలా కాలం ప్రయాణం చెయ్యగలరు. కాని ఒకరు అంతర్ముఖులై, మరొకరు బహిర్ముఖులైతే, ఇద్దరి భిన్న దృక్పథాల మధ్య మొదటి నుండి స్పర్థ ఏర్పడక తప్పదు. ముఖ్యంగా వారి సొంత వ్యక్తిత్వ వర్గం ఏమిటో వారికి తెలియనప్పుడు, లేదా వారి వర్గమే అసలైన వర్గం అని వారికి గాఢమైన నమ్మకం ఉన్నప్పుడు స్పర్థ మరీ ఎక్కువవుతుంది. ఉదాహరణకి బహిర్ముఖుడు ఎప్పుడూ జన సామాన్యం యొక్క అభిప్రాయం వైపే మొగ్గు చూపుతాడు. అది కేవలం రివాజు కనుక అంతర్ముఖుడు దాన్ని తప్పకుండా త్రోసిపుచ్చుతాడు. అలాంటి పరిస్థితుల్లో మనస్పర్థలు సులభంగా తలెత్తుతాయి. ఎందుకంటే ఒకరికి విలువైనదిగా అనిపించేది మరొకరికి వెలలేనిదిగా అనిపిస్తుంది. ఉదాహరణకి ఫ్రాయిడ్ విషయాన్నే తీసుకుంటే, అతడి దృష్టిలో అంతర్ముఖుడు కేవలం తన పట్ల తాను అతిశయమైన, అహితమైన శ్రద్ధ చూపించుకునేవాడు. కాని ఆత్మపరిశీలన, ఆత్మజ్ఞానం ఎంత అమూల్యమైనవో వేరే చెప్పనక్కర్లేదు.

కాబట్టి కలలని అన్వయించేటప్పుడు వ్యక్తిభేదాలని దృష్టిలో పెట్టుకుని చెయ్యడం ముఖ్యం. విశ్లేషకుడు కేవలం మనస్తత్వ శాస్త్రంలోను, తత్సంబంధిత విధానాలలోను కొంత శిక్షణ పొందిన వైద్యుడు అన్నది నిజమే. అలాగని అతడు వ్యక్తిత్వ భేదాలకి అతీతంగా ఉండే మహానుభావుడు అనుకుంటే పొరబాటే. తను నేర్చుకున్న విద్య, శిక్షణ పొందిన విధానాలు అన్నీ మానవాత్మని సమగ్రంగా విశదపరచగల పరమ సత్యాలు అని నమ్మినప్పుడే తాను రోగి కన్నా చాలా ఉన్నతమైన స్థితిలో ఉన్నానన్న భ్రమలో ఉంటాడు. కాని అలాంటి నమ్మకం ఎంతవరకు నిజమో సందేహమే. ఆ కారణం చేత, తన సమగ్రమైన వ్యక్తిత్వంతో కాకుండా, కేవలం శాస్త్రపరిజ్ఞానంతోను, శాస్త్రీయ విధానంతోను రోగి యొక్క సమగ్ర వ్యక్తిత్వాన్ని విశ్లేషించాలని బయల్దేరినప్పుడు లెక్కలేనన్ని సందేహాలు అతణ్ణి చుట్టుముడతాయి.

రోగి వ్యక్తిత్వంతో సరిగ్గా తులతూగగలిగేది కేవలం విశ్లేషకుడి సమగ్ర వ్యక్తిత్వం మాత్రమే. మనస్తత్వశాస్త్ర అనుభవం, పరిజ్ఞానం – ఇవి విశ్లేషకుడికి ఉపకరించవని అనడం లేదు. మనస్తత్వ విశ్లేషణ అంటూ ఒకసారి మొదలైతే, ఆ ప్రయత్నంలో రోగి ఎంత మేరకు పరీక్షింపబడతాడో, విశ్లేషకుడు కూడా అంతే మేరకు పరీక్షింపబడతాడు. రోగితో పాటు, విశ్లేషకుడికి కూడా బరిలోకి దిగక తప్పదు. కాబట్టి వారి ఇరువురి వ్యక్తిత్వాలు పరస్పరం సామరస్యంగా ఉన్నాయా, ఘర్షణ పడుతున్నాయా, పరిపూరకంగా ఉన్నాయా అన్నది చాలా ముఖ్యం.

మానవ ప్రవర్తన యొక్క అనేక ముఖాలలో అంతర్ముఖత, బహిర్ముఖత అనేవి రెండు ముఖాలు మాత్రమే. అయితే అవి బయటికి సులభంగా కనిపిస్తాయి, బట్టబయలు అవుతాయి. కాని బహిర్ముఖులని అధ్యయనం చేస్తే, వాళ్లలో మళ్లీ ఎంతో వైవిధ్యం ఉంటుందని త్వరలోనే కనుక్కోగలము. అది ఎంత సార్వత్రికమైన లక్షణం అంటే దాన్నొక ప్రత్యేక లక్షణం అనుకోవడం కష్టం అని అర్థమవుతుంది. అందుకే కొంత కాలం క్రితం మరింత ప్రాథమిక లక్షణాల కోసం గాలించాను. మానవ వ్యక్తిత్వం యొక్క అనంతకోటి ముఖాలని క్రమబద్ధంగా వ్యక్తం చెయ్యగల లక్షణాల కోసం అన్వేషించాను.

ఎంతో మంది మనుషులు వాళ్ల బుద్ధిని ఎంత తక్కువగా వాడుతారో చూసి చాలా ఆశ్చర్యం కలుగుతుంది. అలాగే ఇంకెంతో మంది మనుషులు వాళ్ల బుద్ధిని ఎంత తెలివితక్కువగా వాడుతారో చూసి ఇంకా ఆశ్చర్యం కలుగుతుంది. అదే విధంగా ఎంతో మంది మనుషులు, అంతో ఇంతో తెలివితేటలు గల వారు కూడా, పూర్తి స్పృహ గల వారు కూడా, వారి ఇంద్రియాలని సరిగ్గా ఎలా వాడాలో కూడా తెలియకుండా ఉండిపోతారని


గమనించి ఆశ్చర్యపోయాను. వాళ్ల కళ్ల ముందు  ఉన్నది కనిపించదు. చెవుల్లో గింగురు మనే పదాలు కూడా వినిపించవు. తాకి చూసినవి, చవి చూసినవి వారి స్పృహకి అందవు. కొంతమంది ఇక వారి శరీరాల గురించిన ఎరుక కూడా లేకుండా జీవిస్తూ ఉంటారు.

మరి కొంత మంది చాలా చిత్రమైన చైతన్య స్థితిలో జీవిస్తున్నట్టు ఉంటారు. వారు ప్రస్తుతం ఉన్న చేతనా స్థితి శాశ్వతం అనుకుంటారు. అది ఎన్నటికీ మారదని నమ్ముతారు. చైతన్య లోకం జడంగా, ఎప్పటికీ తటస్థంగా ఉంటుందని అనుకుంటారు. వారిలో ఊహాశక్తి పూర్తిగా కొరవడినట్టు కనిపిస్తుంది. పూర్తిగా ఐంద్రియసంవేదనల మీదనే ఆధారపడి బతుకుతుంటారు. వారి ప్రపంచంలో నూతన అవకాశాలు, యాదృచ్ఛిక పరిణామాలు ఉండవు. "నేటి"లో "రేపటి" బీజాలు ఉండవు. మారని ఆవృత్తితో గతమే భవితగా పరిణమిస్తుంది.

నాకు తారసపడ్డ వ్యక్తుల స్వభావాన్ని పరిశీలించినప్పుడు వాళ్లలో కొన్ని లోతైన భేదాలు ఉన్నట్టు కనిపిస్తుంది. కొంతమందిలో మానసిక ప్రవృత్తి బలంగా ఉంటుంది. వారిలో ఆలోచనా శక్తి (thought) ప్రధానంగా పని చేస్తున్నట్టు కనిపిస్తుంది. ఇక కొంతమంది వారి తలంపును (feeling) బట్టి, వారికి తోచిన దాని బట్టి నడచుకుంటారు.

తలంపు లేదా "తోచడం" (feeling) అన్న పదానికి కాస్తంత వివరణ అవసరం. కొన్ని సార్లు "సెంటిమెంట్" అన్న అర్థంలో ఈ పదాన్ని వాడడం జరుగుతుంది. (ఫ్రెంచ్ లో sentiment అనే పదానికి కూడా ఇంచుమించు అలాంటి అర్థమే వుంది.) అయితే కొన్ని సార్లు అభిప్రాయాన్ని వ్యక్తం చెయ్యడానికి కూడా ఈ పదాన్ని వాడుతుంటారు.  ఉదాహరణకి శ్వేతగృహం (White House) నుండి వచ్చిన సందేశం ఇలా ఉండొచ్చు - "రాష్ట్రపతికి ... [ఫలానా విధంగా] తోచింది." అలాగే మనలో కలిగిన స్ఫురణను సూచించడం కోసం కూడా ఆ పదాన్ని వాడవచ్చు. "నాకు [ఫలానా విధంగా]... తోస్తోంది."

"ఆలోచించడం" అనే పదానికి బదులు "తోచడం" అనే పదాన్ని వాడుతున్నప్పుడు ఒక దాన్ని మూల్యాంకనం చేస్తున్నాను అన్నమాట. ఉదాహరణకి ఫలానా విషయం హితమైనదా కాదా, మంచిదా కాదా అని నిర్ణయించడం వంటిది. ఈ నిర్వచనాన్ని బట్టి చూస్తే తోచడం అనేది భావావేశం (emotion) కాదు. ఎందుకంటే భావావేశం అన్నప్పుడు అది అసంకల్పితం అన్న అర్థం వస్తుంది. తోచడం అనేది సహేతుకమైన క్రియ అన్న అర్థంలో నేనిక్కడ వాడుతున్నాను. అందుకు భిన్నంగా లోజ్ఞానం (intuition) అనే క్రియని అహైతుకం అన్నట్టుగా వాడుతున్నాను. లోజ్ఞానం అదేది సంకల్పిత క్రియకి ఫలితంగా వచ్చేది కాదు. అది అసంకల్పిత చర్యే. అది సహేతుకమైన, సాలోచనమైన మూల్యాంకనం మీద ఆధారపడదు. కొన్ని బాహ్య, ఆంతరిక పరిస్థితుల్లో అది జనిస్తుంది. లోజ్ఞానాన్ని ఐంద్రియ సంవేదన (sensory perception) తో పోల్చుకోవచ్చు. అది కూడా ఒక విధంగా అహైతుక చర్యే. ఎందుకంటే అది భౌతిక కారణాల మీద కాక మానసిక కారణాల మీద ఆధరపడుతుంది.




చైతన్యం యొక్క నాలుగు క్రియలు – సంవేదన, ఆలోచన, లోజ్ఞానం, తలంపు.

అనుభవం పట్ల చైతన్యం ఏ విధంగా ఉన్ముఖమై వుంటుందో తెలపడానికి పైన చెప్పుకున్న నాలుగు క్రియాత్మక జాతులు నిర్వచనాలు అవుతాయి. 1) ఇంద్రియ సంవేదన బయట ఏదో వుందని చెప్తుంది. 2) ఆలోచన అదేమిటో చెప్తుంది. 3) తోచడం అనేది అది హితమైనదో కాదో చెప్తుంది. 4) లోజ్ఞానం అనేది అది ఎక్కడి నుండి వచ్చిందో, ఎక్కడికి పోతుందో చెప్తుంది.

పైన చెప్పుకున్న నాలుగు లక్షణాలు నాలుగు వేరు వేరు మానవ ప్రవర్తనా రీతులు అన్నట్టుగా పాఠకులు అర్థం చేసుకోవాలి. అయితే మానవ ప్రవర్తనలోని రీతులు ఇవి మాత్రమే అని కాదు. ఇచ్ఛాశక్తి, ఊహాశక్తి, జ్ఞాపక శక్తి ఇలా మరెన్నో ఉన్నాయి. ఇవే ఉన్నాయని, ఇవి తప్ప మరి లేవని పిడివాదం చెయ్యడం నా ఉద్దేశం కాదు. కాని మానవ స్వభావాన్ని వర్గీకరించడానికి ఇవి చాలా అనువుగా అనిపిస్తాయి. ముఖ్యంగా తల్లిదండ్రుల స్వభావం గురించి పిల్లలకి వివరించాలన్నా, భర్తల స్వభావం గురించి భార్యలకి వివరించాలన్నా ఇలాంటి వర్గీకరణ చాలా ఉపయోగపడుతుంది. అలాగే ఇలాంటి వర్గీకరణ సహాయంతో మన సొంత పూర్వనమ్మకాల (prejudices) గురించి కూడా కొంత అవగాహన కలుగుతుంది.

ఎందుకంటే మరొకరి కలని అర్థం చేసుకోవాలంటే ముందు మీ పూర్వనమ్మకాలని, అభిప్రాయాలని కొంత విడనాడాలి. అయితే అలా చెయ్యడం సులభం కాదు, ఇష్టంగా కూడా అనిపించదు. తమ సొంత పూర్వభావాలని వొదిలించుకోవడం కోసం చేసే మానసిక కృషి చాలా మందికి రుచించదు. కాని విశ్లేషకుడు తన సొంత దృక్పథాన్ని విమర్శించుకోలేకపోతే, అందులోని సాపేక్షతని గుర్తించుకోలేకపోతే, రోగి మనోస్థితి గురించి సరైన సమాచారాన్ని రాబట్టలేడు సరికదా రోగి మానసం గురించి తగినంత లోదృష్టిని కూడా సాధించలేడు. విశ్లేషకుడు తాను వెలిబుచ్చిన అభిప్రాయాన్ని రోగి వినిపించుకుని దానికి తగ్గ విలువని ఇవ్వాలని ఆశిస్తాడో, రోగికి కూడా విశ్లేషకుడు అదే హక్కుని, అవకాశాన్ని ఇవ్వాలి. రోగికి, విశ్లేషకుడికి మధ్య అలాంటి సంబంధం కుదురుకోవడం చాలా ముఖ్యం అని ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. అలాగే విశ్లేషకుడికి సిద్ధాంతాలు నిజమని నిరూపించుకోవడం కన్నా, రోగికి తన కలలు అర్థం కావడం ముఖ్యం అని మరి మరీ

చెప్పాల్సి ఉంటుంది. విశ్లేషకుడి అన్వయాలకి రోగి అభ్యంతరం చెప్పడంలో తప్పులేదు. రోగి అలా అభ్యంతరం తెలుపుతున్నాడు అంటే ఎక్కడో ఏదో “అతకడం” లేదని అర్థం చేసుకోవాలి. దానికి కారణం అర్థం చేసుకునే స్థాయికి రోగి ఇంకా రాకపోవడం కావచ్చు, లేదా విశ్లేషకుడి అన్వయం పొసగకపోవచ్చు.

మరొకరి కలలకి చెందిన ప్రతీకలని అన్వయించే ప్రయత్నం చేస్తున్నప్పుడు అందులోని ఖాళీలలని మన అవగాహన ప్రకారం పూరించే ప్రయత్నం చేస్తుంటాము. మన అనుభవాన్ని, అందులో నుండి పుట్టిన దృక్పథాన్ని ఆ కలల మీదకి ఆపాదించాలని చూస్తుంటాము. స్వప్నకారుడికి, విశ్లేషకుడుకి ఆ కలల లోని అంతరార్థం ఒకే విధంగా కనిపిస్తుందని నమ్ముతాము. ఈ దోషాన్ని నివారించుకోవడం కోసం కల వచ్చిన సందర్భాన్ని అనితరంగా అంటిపెట్టుకుని ఉండాలని ఎప్పుడూ అంటుంటాను. ఇక కలల గురించి మన సామాన్య నమ్మకాలు అన్నిటిని పక్కన పెట్టాలని అంటాను. కలలకి ఒక అంతరార్థం అంటూ ఉంటుందని నమ్మితే చాలు.

ఇంతవరకు నేను చెప్పినదాని బట్టి చూస్తే కలల అన్వయంలో కొన్ని సార్వత్రికమైన నియమాలు ఉండవని స్పష్టంగా తెలుస్తుంది. సచేతన మనస్సుకి చెందిన వెలితిని, వికారాలని పూరించడమే కలల ప్రయోజనం అని అంతకు ముందు అన్నాను. ఈ రకమైన నమ్మకంతో ముందుకు పోతే ప్రత్యేకమైన కలల అన్వయంలో మరింత ప్రగతి సాధించవచ్చు. కొన్ని సందర్భాలలో కలల యొక్క ఈ ప్రయోజనం ఎలా నెరవేరుతుందో సులభంగా చూడగలము.

నా వద్దకి వచ్చే రోగులలో ఒకతను తన గురించి తాను చాలా గొప్పగా ఊహించుకుంటాడు. తనలోని ఈ అధిక్యతాభావం చూసి తనని ఎరిగిన వారు చాలా చిరాకుపడుతూ ఉంటారు. ఒక రోజు నాతో తనకి వచ్చిన ఒక కల గురించి చెప్పాడు. ఆ కలలో అతడు తప్పతాగి మురుగ్గుంటలో పొర్లుతున్న ఒక మనిషిని చూశాడు. ఆ దృశ్యాన్ని చూసి అతడు తన కలలో కూడా పరిపాటిగా తన అధిక్యతాభావాన్ని ప్రదర్శించుకుంటూ “మనుషులు ఎంత దిగజారగలరో కదా!” అనుకున్నాడు. తన సుగుణాల పట్ల తనలో ఉండే

అహంభావాన్ని జుగుప్సాకరమైన ఆ కల కొంతవరకు  చెల్లుబడి చేస్తోంది. ఈ కలలో మరో విషయం కూడా వుంది. ఇతగాడికి తాగుబోతు సోదరుడు ఒకడు ఉన్నాడు. ఈ కలని బట్టి మనకి అర్థం అవుతున్నది ఏమిటంటే  తన సోదరుడి తాగుబోతుతనానికి  అతడి అహంభావం పరిహారంగా, సమతూకంగా పని చేస్తోంది. బాహ్య ప్రపంచంలోనే కాక ఆంతరిక ప్రపంచంలో కూడా తన అహంభావం, గుప్తమైన పాతిత్యానికి సమతూకంగా పని చేస్తోంది.

ఇలాంటిదే మరో రోగి వృత్తాంతం కూడా చెప్తాను. ఈమె మనస్తత్వ శాస్త్రం మీద తనకి గొప్ప పట్టు ఉందని అనుకుంటూ ఉంటుంది. ఈమెకి తరచు మరొక స్త్రీ కలలో కనిపించేది. వాస్తవ జీవితంలో ఈమెకి తన కలలో కనిపించే స్త్రీ ఎదుటపడితే చులకనగా చూసేది. ఆమె వట్టి బడాయి మనిషి అని, మోసగత్తె అని భావించేది. కాని కలలో మాత్రం ఆ స్త్రీ కనిపించినప్పుడు ఈమెకి ఎంతో నచ్చింది. సొంత చెల్లెలిలా అభిమానంగా కనిపించింది. వాస్తవంలో ససేమిరా నచ్చని మనిషి కలలో అంత సన్నిహితంగా ఎందుకు కనిపించిందో ఆమెకి అర్థం కాలేదు. ఆ కలలు ఆమెకి ఒక లోతైన సత్యాన్ని తెలుపుతున్నాయి. ఆమె అచేతనలో తనకి “నీడ”లా దాగిన ఒక వ్యక్తి, వాస్తవ ప్రపంచంలో తనకి తెలిసిన, తనకి నచ్చని స్త్రీ రూపంలో తనని తాను వ్యక్తం చేసుకుంది. తన వ్యక్తిత్వం పట్ల చాలా కచ్చితమైన భావాలు ఉన్న ఆ స్త్రీకి తన కలలు చెప్తున్న పాఠాలు అంతగా రుచించలేదు. తనలో ప్రచ్ఛన్నంగా ఉన్న అధిక్యతా భావం గురించి, ఆధిపత్య భావం గురించి ఆ కలలు తెలుపుతున్నాయి. ఈ అచేతన ఆంతరిక ప్రభావాల వల్ల తనకి తన స్నేహితులతో ఎన్నో సార్లు ఘర్షణ ఏర్పడింది. కాని ప్రతీ సారి తప్పంతా అవతలివారిదే నని, తనది కాదని కొట్టిపారేసేది.

మనం నిర్లక్ష్యం చేసేవి, లోలోపల అణగదొక్కుకునేవి కేవలం మన వ్యక్తిత్వం యొక్క ఛాయాత్మక అంశాలు మాత్రమే కావు. మనలోని హితపైన అంశాలని కూడా కొన్ని సార్లు అలాగే చేస్తాము. అందుకు మరో ఉదాహరణ చెప్తాను. ఆ వ్యక్తి చాలా మర్యాదగా, వినమ్రంగా ఉంటాడు. చక్కని నడవడిక కలవాడు. ఎప్పుడూ

వెనక బెంచిలో కూర్చోడానికి ఇష్టపడతాడు. అయితే హాజరు కావడం మాత్రం మానడు. తనని మాట్లాడమన్నప్పుడు మాత్రం నిండైన అవగాహనతో, ప్రతిభ ఉట్టిపడేలా తన అభిప్రాయం చెప్తాడు. అడక్కుండా మాత్రం ఉచిత సలహా ఇవ్వడు. కొన్ని సార్లు మాత్రం ఎదుటనున్న సమస్యని మరింత ఉన్నతమైన పద్ధతిలో ఎలా పరిష్కరించాలో సున్నితంగా సూచిస్తాడంతే (అయితే అది ఎందుకు నిజమో మాత్రం వివరించడు).

అయితే అతడికి కలలో మాత్రం నెపోలియన్, అలెగ్జాండర్ వంటి గొప్ప గొప్ప చారిత్రక వ్యక్తులు తారసపడేవారు. తనలో గుప్తంగా ఉన్న ఆత్మన్యూనతా భావాన్ని ఈ కలలు పరిపూరిస్తున్నాయి. అయితే ఆ కలలలో మరొక అంతరార్థం కూడా వుంది. "అంతటి మహానుభావులు నన్ను సందర్శించడానికి వస్తున్నారంటే, నేను ఎలాంటి వాణ్ణి అయ్యుండాలి?" అని తన కలలు తనని ప్రశ్నిస్తున్నట్టు అనిపిస్తుంది. ఆ స్వప్నకారుడిలో రహస్యంగా దాగి వున్న పరమాధిక్యతాభావం (megalomania) తన ఆత్మన్యూనతాభావాన్ని పరిపూరిస్తోంది. తన అచేతనలో నాటుకుని వున్న అలవిగాని అధిక్యతా భావం ఇతరుల పట్ల తన బాధ్యతలని విస్మరించేలా చేస్తోంది. అందుకే తన సలహాలు నిజంగా ఉన్నతమైనవని, సలక్షణమైనవని నిరూపించుకోవాలన్న అవసరం అతడికి కనిపించదు. అలాంటి గుప్తమైన అధిక్యతా భావం లేని మామూలు మనుషుల్లో అలాంటి ప్రవర్తన కనిపించదు.

ఆ మనిషి అచేతనంగా ఒక అర్థంలేని నాటకం ఆడుతున్నాడు.  ఆ నాటకాన్ని తన కలలు ఒక చిత్రమైన రీతిలో, ద్వంద్వార్థం ధ్వనించేలా సచేతనం గావిస్తున్నాయి. నెపోలియన్ వంటి వాడితో రాసుకు పూసుకు తిరగడం, అలెగ్జాండర్ ద గ్రేట్ వంటి వారితో పిచ్చాపాటి మాట్లాడడం వంటి ఊహలు సరిగ్గా ఆత్మన్యూతనా భావం లోనుండే జనిస్తాయి. అయితే ఈ సత్యాన్ని ఆ కల సూటిగా, బాహాటంగా వెలిబుచ్చవచ్చు కదా, ద్వంద్వార్థం ధ్వనించేలా వ్యక్తం చెయ్యడం దేనికి అని ప్రశ్నించవచ్చు.

ఈ విషయం మీద నాక్కూడా మనసులో ఎన్నో ప్రశ్నలు ఉన్నాయి. సూటిగా విషయం చెప్పకుండా, ముఖ్యమైన అంశాలని వదిలిపెడుతూ కలలు ఎందుకు మనుషులని కలవరపెడతాయో నాకు ఎప్పుడూ అర్థం కాదు. ఆత్మ యొక్క క్రియలలో ఒక ప్రత్యేకమైన క్రియని  ఫ్రాయిడ్ గుర్తిస్తూ దానికి censor (విమర్శకుడు) అని పేరు పెట్టాడు. దాని ప్రభావం వల్లనే కలల చిత్రాలు వికారం అవుతాయని అతడు భావించాడు. కలల రూపురేఖలు పూర్తిగా మారిపోయి, గుర్తుపెట్టరానంతగా మారిపోతాయి. అలాంటి చిత్రాలు కలను కంటున్న చేతనను తప్పుదోవ పట్టిస్తాయని అనిపిస్తుంది. స్వప్నకారుడి అంతర్యంలోని ముఖ్యాంశాన్ని దాచేస్తూ ఆ “విమర్శకుడు” అప్రియమైన జ్ఞాపకాల నుండి నిద్రను సంరక్షిస్తాడు అని ఫ్రాయిడ్ అభిప్రాయం. కల అనేది నిద్రావస్థకి కాపలాదారు వంటిది అనే సిద్ధాంతాన్ని నేను అంతగా నమ్మను. ఎందుకంటే కొన్ని సార్లు కలలు నిద్రకి భంగం కలిగిస్తాయి కూడా.

చేతనలో పని చేసే ఈ “విమర్శకుడు” ఉపచేతనకి చెందిన అంశాలని తుడిచిపెట్టేస్తున్నట్టుగా కనిపిస్తుంది. చేతనతో పోల్చితే ఉపచేతనలో ఉండే భావాలకి, చిత్రాలకి కాస్త పదును తక్కువగా ఉన్నట్టు కనిపిస్తుంది. ఉపచేతనావస్థలో వాటి రూపురేఖలలో అంత స్పష్టత ఉండదు. వాటి మధ్య సంబంధాలు కూడా అవిస్పష్టంగా ఉంటాయి. అహైతుకంగా ఉన్నట్టు కనిపిస్తాయి. తార్కికత కొరవడుతుంది. అందుకే వాటిని “అర్థం చేసుకోవడం” కష్టం అవుతుంది. ఇంచుమించు అన్ని రకాల స్వప్నావస్థల లోను ఈ తీరు కనిపిస్తుంది. బడలిక, జ్వరం, విషపదార్థాలు ఇలా స్వప్నావస్థ ఎలాంటి కారణాల వల్ల కలిగినా కూడా ఈ తీరే కనిపిస్తుంది. కాని ఏదైనా కారణం వల్ల ఆ చిత్రాల పదును, తీవ్రత పెరిగినప్పుడు వాటి అచేతనత్వపు పాలు తగ్గి, మరింత సచేతనం అవుతాయి. చేతన యొక్క సరిహద్దును సమీపిస్తున్న కొలది అవి మరింత ప్రస్ఫుటం అవుతాయి, స్పష్టం అవుతాయి.

(End of Pg 63 in the book)

ఈ ఒక్క వాస్తవాన్ని బట్టి కలలు ఎందుకు తరచు ఉపమానాల రూపంలో వ్యక్తమౌతాయో అర్థమవుతుంది. ఎందుకు ఒక కల మరో కలలోకి సున్నితంగా జారుకుంటుందో, జాగృత జీవనానికి సంబంధించిన తర్కం గాని, కాలమానం గాని ఎందుకు కలలలో వర్తించవో అర్థమవుతుంది. కలలు తీసుకునే రూపాలు అచేతనకి చాలా సహజమైన రూపాలు. ఎందుకంటే ఏ అచేతనాంశం లోనుండి అయితే ఆ రూపాలు ఆవిర్భవించాయో, ఆ సమాచారం అంతా ఉపచేతనలో సరిగ్గా ఆ రూపాలలోనే భద్రపరచబడి ఉంటుంది. ఫ్రాయిడ్ అన్నట్టు, కలలు నిద్రని "అసంగతమైన కోర్కెల" నుండ్ రక్షించవు. అతడు "మారువేషం" అని వర్ణించేవి కేవలం అచేతన లోనుండి పుట్టే ప్రేరణలన్నీ తీసుకునే సహజ రూపాలే. కాబట్టి కల అనేది ఒక కచ్చితమైన ఆలోచనని పుట్టించలేదు. అలా చేసినట్టయితే అది కలేకాకుండా పోతుంది, అది అచేతన సరిహద్దు దాటి సచేతనలోకి ప్రవేశించినట్టు అవుతుంది. అందుకే ఏ అంశాలైతే సచేతన మనస్సుకి ఎంతో ముఖ్యంగా తోచుతాయో, సరిగ్గా ఆ అంశాలనే కలలు వదిలిపెడుతున్నాయని అనిపిస్తుంది. అవి సచేతన యొక్క "చేలాంచలాలని" మాత్రమే వ్యక్తం చేస్తున్నట్టు అనిపిస్తుంది. సంపూర్ణ సూర్యగ్రహణం సమయంలో ఆకాశంలో మినుకు మినుకు మనే తారల  కాంతిహేలలా.

మన సచేతన మనస్సు యొక్క ప్రభావానికి ఆవల ఉండే అంతరాత్మ యొక్క పాక్షిక అభివ్యక్తులే కలల ప్రతీకలు అని అర్థం చేసుకోవాలి. అర్థం, ప్రయోజనం అనేవి కేవలం మనస్సుకి మాత్రమే ప్రత్యేకమైన లక్షణాలు కావు. జీవ ప్రకృతి అంతటా అవి సాక్షాత్కరిస్తాయి. జైవిక వృద్ధికి, ఆత్మవృద్ధికి మధ్య అసలు మూలంలో తేడా లేదు. మొక్క పూవుని పుట్టించినట్టు, ఆత్మ ప్రతీకలని ఉత్పన్నం చేస్తుంది. ప్రతీ స్వప్నం ఆ ప్రక్రియకి ప్రత్యక్ష సాక్ష్యం.

కాబట్టి కల ద్వార, (అదే విధంగా లోజ్ఞానాలు, సహజ ప్రేరణలు, ఇంకా ఎన్నో రకాల  అప్రయత్న సంఘటనల ద్వార) ఆంతరిక శక్తులు సచేతన ప్రవృత్తి మీద ప్రభావం చూపిస్తాయి. ఆ ప్రభావం వల్ల మేలు జరుగుతుందా,

కీడు జరుగుతుందా అనేది ఆ అచేతనలో ఉండే అంశాల మీద ఆధారపడుతుంది. సామాన్యంగా సచేతనలో ఉండాల్సిన అంశాలతో అచేతన కిక్కిరిసి ఉంటే, దాని పని తీరు కలుషితమవుతుంది, వక్రమవుతుంది. నిజప్రవృత్తితో సంబంధంలేని సంకల్పాలు బహిర్గతమవుతాయి. అణచివేత వల్ల, అలక్ష్యం వల్ల అచేతనలో బంధించబడ్డ తపనలవి. అచేతనలో గుప్తంగా దాగి వున్నాయి కనుకనే వాటికి ఆంతరికమైన ప్రాముఖ్యత వస్తుంది. సామాన్యమైన అచేతన ఆత్మని అవి ఆవరిస్తాయి. ప్రతీకల ద్వార, ప్రేరణల ద్వార దానినది వ్యక్తం చేసుకునే సహజ ప్రవృత్తికి ఇవి అడ్డుపడతాయి. అందుకనే మానసిక ఉగ్మతల కారణాలని శోధించే మనోవిశ్లేషకుడు ముందుగా తన పేషంటుని తన ఇష్టాఇష్టాలని, భయాలని వివరంగా వెల్లడి చెయ్యమని ప్రోత్సహించాలి.

వెనకటి రోజుల్లో చర్చిలలో పశ్చాత్తాప ప్రకటన (confession) అనే సాంప్రదాయం ఉండేది. మనోవిశ్లేషణ (psychoanalysis) ఒక విధంగా ఆ పాత పద్ధతికి ఆధునిక రూపాంతరం అనుకోవచ్చు. ఈ విధానంలోని ఉద్దేశం బాగానే ఉన్నా ఆచరణలో ఎన్నో సమస్యలు తలెత్తవచ్చు. చెప్పరాని ఆత్మన్యూనతా భావం, మానసిక బలహీనత మొదలైన సమస్యల వల్ల రోగికి తనలోని అసమర్థతని, అసంపూర్తిని తెలిపే సాక్ష్యాధారాలని ఒప్పుకోవడానికి కష్టం కావచ్చు. ఇంచుమించు అసంభవం కావచ్చు. కాబట్టి ముందుగా రోగి మనసులో తన పట్ల, తన జీవితం పట్ల ఒక హితవైన, శ్రేయస్కరమైన, సంతోషకరమైన దృక్పథాన్ని కలుగజేయాలి. అలా చేస్తే తనలో భద్రతాభావం పెరుగుతుంది. తనలోనే దాగి వున్న మరింత బాధాకరమైన అంశాలని ధైర్యంగా ఎదుర్కోవడంలో అది సహాయపడుతుంది.

"వ్యక్తిగత పదోన్నతి"కి చెందిన కలలనే ఉదాహరణగా తీసుకుందాం. ఇంగ్లండ్ రాణితో కలిసి టీ తాగుతున్నట్టో, పోప్ తో కూర్చుని పిచ్చాపాటి మాట్లాడుతున్నట్టో కల వచ్చిందని అనుకుందాం. కల గన్నవాడు స్కిజోఫ్రినిక్ కాకపోతే, వాస్తవ పరిస్థితుల పరంగా ఆ కల యొక్క అన్వయం ఆ వ్యక్తి యొక్క ప్రస్తుత మానసిక స్థితి మీద,

అతడి అహంకారం యొక్క స్థితి మీద  ఆధారపడుతుంది. స్వప్నకారుడికి తన పట్ల, తన తాహతు పట్ల అతిశయమైన అభిప్రాయం ఉంటే, (అతడి భావాల "స్వేచ్ఛానుసంధానం" లోంచి పుట్టిన సమాచారాన్ని బట్టి) అతడి భావాలు, ఉద్దేశాలు ఎంత హాస్యాస్పదమైనవో సులభంగా తెలుసుకోవచ్చు. తన తల్లిదండ్రుల కన్నా మిన్నగా ఉండాలనే కుర్రతనపు కోర్కె నుండి  అలాంటి కలలు జనిస్తాయని అర్థం చేసుకోవచ్చు. అంతరంగం అంతా వ్యాపించిన ఆత్మన్యూనతా భావం స్వప్నకారుడి వ్యక్తిత్వంలోని మంచి సంస్కారాలు అన్నిటినీ క్రమ్ముకున్నట్లయితే, అలాంటి పరిస్థితిలో అతడి చింతనలో దోషం వుందని, అతడి ఆలోచనలు హాస్యాస్పదమైనవని, అతడి ఉద్దేశాలు శైశవమైనవని అతణ్ణి ఒప్పించడానికి ప్రయత్నించడం మంచిది కాదు. అలాంటి ప్రయత్నం వల్ల అతణ్ణి మరింత క్రుంగదీయడమే అవుతుంది. దాని వల్ల అతడి ఆత్మన్యూనతా భావం మరింత బలపడుతుంది. అతడి మీద మానసిక చికిత్స చెయ్యడం మరింత కఠినం అవుతుంది.

(pg 64 in the book)

అందరికీ వర్తించే చికిత్సా విధానం, లేదా సిద్ధాంతం అనేది ఏమీ ఉండదు. చికిత్స కోసం వచ్చే ప్రతీ వ్యక్తి పరిస్థితి, ప్రత్యేకంగా, అనన్యంగా ఉంటుంది. నాకు తెలిసిన ఒక రోగికి తొమ్మిది ఏళ్ల పాటు చికిత్స చేశాను. విదేశాల్లో ఉండేవాడు కనుక ఏడాదిలో నాలుగు సార్లు మాత్రమే కలవడానికి వీలయ్యేది. అతడితో వచ్చిన చిక్కేంటో నాకు మొదట్లోనే అర్థమయ్యింది. కాని ఆ సత్యానికి నేను ఎప్పుడు దగ్గర కావడానికి ప్రయత్నించినా అతడు వెంటనే తనను తాను సమర్థించుకుంటూ తీవ్రంగా ప్రతిఘటించేవాడు (self-defensive reaction). దాంతో మా ఇద్దరి మధ్య అప్పుడప్పుడే కుదురుకుంటున్న అనుబంధం తెగపోయే ప్రమాదం ఏర్పడేది. నాకు నచ్చినా నచ్చకపోయినా మా అనుబంధాన్ని నిలుపుకునే విధంగా, తమ స్వభావాన్ని సమర్థిస్తూ నేను నడచుకునేవాణ్ణి. అతడి కలలు కూడా అందుకు అనుగుణంగానే ఉండేవి. కాని మా చర్చలు మాత్రం అతడి న్యూరోసిస్ కి మూలకారణం నుండి దూరంగా తొలగిపోయాయి. అర్థం పర్థం లేని నానా విషయాలని చర్చిస్తూ అసలు సమస్య నుండి దూరంగా వెళిపోయాం. నా పేషెంట్ ని తప్పు దోవ పట్టిస్తున్నానేమో నని నన్ను నేనే

ఎన్నో సార్లు విమర్శించుకున్నాను. అలా నెమ్మదిగానైనా అతడు కోలుకోవడం గుర్తించాక, దుడుకుగా తన రోగం వెనుక ఉన్న మూలకారణాన్ని అతడి ముందుంచే ప్రయత్నం మానుకున్నాను.

కాని 10 వ ఏట ఆ రోగి తానిప్పుడు పూర్తిగా నయం అయిపోయాడని, ఇక రోగలక్షణాలేవీ లేవని స్వయంగా ప్రకటించుకున్నాడు. అది విని నేను ఆశ్చర్యపోయాను. ఎందుకంటే శాస్త్రం ప్రకారం అతడు నయం కాకూడదు. నా ముఖంలోని ఆశ్చర్యం చూసి అతడు చిరునవ్వుతో ఇలా అన్నాడు – "ఇంతకాలం మీరు ఎంతో ఓర్పు సహనంతో నాతో వ్యవహరించిన తీరుకి మనఃపూర్వక ధన్యవాదాలు. దాని వల్లనే నా న్యూరోసిస్ వెనుక ఉన్న బాధాకర కారణం నుండి విముక్తుణ్ణి కావడానికి వీలయ్యింది. అయితే ఇప్పుడు దాని గురించి మీతో మొత్తం పంచుకోడానికి సిద్ధంగా ఉన్నాను. దాని గురించి మీతో మనసు విప్పి మాట్లాడుకునే పరిస్థితిలో ఉంటే, మన మొదటి కలయికలోనే అలా చేసేవాణ్ణి. కాని దాని వల్ల మన మధ్య అనుబంధం తెగిపోయేది. అప్పుడు నా గతి ఏమై ఉండేదో ఆలోచించండి. ఈ పదేళ్ల పరిచయంలో మీ మీద నా విశ్వాసం పెరిగింది. మీ మీద నా నమ్మకం పెరుగుతున్న కొద్ది నా పరిస్థితి మెరుగుపడింది. ఇలా నెమ్మదిగా సాగిన చికిత్స వల్ల నా మీద నాకు నమ్మకం పెరిగింది. ఇంతకాలం నా మనసుని కలచివేస్తున్న సమస్య గురించి మాట్లాడడానికి ఇప్పుడు నేను సిద్ధంగా ఉన్నాను."

అప్పుడు అతడు తన పరిస్థితి గురించి ఒక దారుణమైన నిజాన్ని వెల్లడి చేశాడు.  మా చికిత్సా మార్గం అలాంటి బాటను ఎందుకు అనుసరించిందో అప్పుడే నాకు అర్థమయ్యింది.  మొదటి సారి ఆ అనుభవం కొట్టిన దెబ్బ ఎంత తీవ్రంగా ఉందంటే దాన్ని అతడు ఒంటరిగా ఎదుర్కోలేకపోయాడు. అలా ఎదుర్కోవడానికి మరొక వ్యక్తి సహాయం అవసరమయ్యింది.  ఇక్కడ చికిత్స వల్ల జరగవలసినది రోగికి తెరపిస్టు మీద నమ్మకం కలిగేలా చెయ్యడం. అంతేగాని మానసిక సిద్ధాంతాలకి సంబంధించిన పాండిత్య ప్రదర్శన కాదు.

ఈ కేసుల నుండి నేను వ్యక్తిగత రోగుల అవసరాలని బట్టి నా పద్ధతులు మార్చుకోవాలని అర్థం చేసుకున్నాను. ఒకే సిద్ధాంతం అందరికీ సార్వత్రికంగా వర్తిస్తుందని నమ్ముతూ గుడ్డిగా ఆ సిద్ధాంతాన్ని అందరి మీద ప్రయోగించకూడదని తెలుసుకున్నాను. మానవ నైజం గురించి నా గత 60 ఏళ్ల అనుభవం ప్రతీ రోగిని ప్రత్యేకంగా పరిగణించాలని, అందరికీ ఒకే చికిత్స పని చెయ్యదని నేర్పింది. కొందరి విషయంలో వారి శైశవ దశలో జరిగిన సంఘటనలని, మొలకెత్తిన ఊహాగానాలని క్షుణ్ణంగా పరిశోధిస్తూ పోయాను. మరి కొన్ని సందర్భాల్లో తాత్విక విషయాలతో ప్రారంభించాను, సుదూరమైన, ప్రగాఢమైన తాత్విక చింతనా సీమల్లో విహరిస్తూ, నానా విధాల తాత్విక విశ్లేషణలు చేశాను. వ్యక్తిగత రోగి యొక్క మానసిక పరిభాషని నేర్చుకుని, తొట్రువడుతూ ముందుకు సాగే అతడి అచేతనని తేజం దిశగా ప్రోత్సహించాలి. ఒకరి విషయంలో పని చేసే పద్ధతికి మరొకరికి పని చెయ్యకపోవచ్చు.

ఆంతరిక ప్రతీకలని అన్వయించే ప్రయత్నంలో ఇలాంటి అవగాహన మరీ అవసరం అవుతుంది. ఇద్దరు వ్యక్తులకి ఇంచుమించు ఒకేలాంటి కల రావచ్చు. (వైద్య అనుభవంలో ఇలాంటిది మామూలుగా జనం అనుకునే దాని కన్నా తరచుగా జరుగుతుంది.) కాని ఉదాహరణకి వారిలో ఒకడు యువకుడై, రెండవ వ్యక్తి వయసు గలవాడైతే, ఇద్దరినీ ఇబ్బంది పెట్టే సమస్యల తీరు వేరైతే, అప్పుడు ఆ రెండు కలలని ఒకే విధంగా అన్వయించడం పొరబాటే అవుతుంది.

అందుకు ఉదాహరణగా నాకో కల గుర్తొస్తోంది. ఆ కలలో కొంత మంది యువకులు ఒక విశాలమైన మైదానంలో గుర్రాల మీద సవారీ చేస్తుంటారు. కల గన్న వ్యక్తి గుంపులో అందరికన్నా ముందుటాడు. అంతలో అతడికి ఒక పెద్ద నీరు నిండిన గొయ్యి ఎదురవుతుంది. అతడు తన గుర్రాన్ని ఆ గోతి మీద నుండి

ఒడుపుగా గెంతించి ప్రమాదం నుండి తప్పించుకుంటాడు.  కాని తన వెనుక వస్తున్న వాళ్లు మాత్రం గోతిలో పడిపోతారు. నాకీ కల గురించి చెప్పిన యువకుడికి కాస్త బెదురు ఎక్కువ. స్వతహాగా అంతర్ముఖుడు. ఇలాంటి కలనే నేనొక వృద్ధుడి నుండి కూడా విన్నాను. కాని ఇతడు గొప్ప ధైర్యవంతుడు. ఇతడు మంచి హుషారైన, సాహసోపేతమైన జీవితం జీవించాడు. కాని ఈ కల గన్నప్పుడు అతడు మంచం పట్టి వున్నాడు. తనకి చికిత్స చేసే డాక్టర్ని, నర్స్ ని చాలా ఇబ్బంది పెట్టేవాడు. వైద్యుడు ఇచ్చే సూచనలు సక్రమంగా పాటించక కోరి కష్టాలు తెచ్చుకున్నాడు.

యువకుడి విషయంలో ఈ కల అతడు ఏం చెయ్యాలో చెప్తోంది. కాని వృద్ధుడి విషయంలో అతడు వాస్తవంలో ఏం చేస్తున్నాడో చెప్తోంది. యువకుడికి ఆ కల తగిన ప్రోత్సాహాన్నిచ్చి ధైర్యం చెప్తోంది. వృద్ధుడికి అలాంటి ప్రోత్సాహంతో పని లేదు. అతడిలో ఇంకా ఆరని ధైర్యం, దుడుకుతనం అతడి పాలిట శాపంగా మారాయి. దీన్నిబట్టి స్వప్నాల యొక్క, స్వప్న ప్రతీకల యొక్క అన్వయం స్వప్నకారుడి జీవన పరిస్థితుల మీద, మానసిక స్థితి మీద ఆధారపడి ఉంటాయని అర్థమవుతోంది.

## స్వప్న ప్రతీకలలో మూలాకృతులు (Archetypes)

కలలు ఒక విధంగా నష్టపరిహారంగా పని చేస్తాయని అంతకు ముందే సూచించాను. కలలు ఒక సహజ మానసిక పరిణామానికి చిహ్నం. అచేతన ప్రతిక్రియలని, సహజ ప్రేరణలని కల సచేతన భూమిక లోకి ప్రవేశపెడుతుంది. స్వప్నకారుడి సహకారంతో ఎన్నో కలలని అన్వయించడానికి వీలవుతుంది. స్వప్న చిత్రాల నేపథ్యాన్ని, వాటి మధ్య అనుసంధానాలని స్వప్నకారుడు వెల్లడి చేస్తాడు. వీటి సహాయంతో కలని అన్ని కోణాల నుండి చూడడానికి వీలవుతుంది.


ఈ పద్ధతి సాధారణ పరిస్థితుల్లో చాలా వరకు పని చేస్తుంది. ఉదాహరణకి మాటల్లోమాటగా ఒక బంధువో, స్నేహితుడో, పేషెంటో ఒక కల గురించి చెప్తాడు. తీవ్రమైన భావావేశంతో, పదే పదే వచ్చే కలల విషయంలో స్వప్నకారుడు సూచించే వ్యక్తిగత అనుసంధానాల సహాయంతో సరిగ్గా అన్వయించడం సాధ్యం కాదు. అలాంటి పరిస్థితుల్లో కలల్లో మళ్లీ మళ్లీ వచ్చే అంశాలు వ్యక్తిగతం కావని, స్వప్నకారుడి యొక్క వ్యక్తిగత అనుభవం నుండి వాటిని తవ్వి తీయడం సాధ్యం కాదని అర్థం చేసుకోవాలి. (ఈ విషయాన్ని మొట్టమొదట గుర్తించి దాని మీద వ్యాఖ్యానించిన వాడు ఫ్రాయిడ్). వీటికి ఫ్రాయిడ్ "పురాతన అవశేషాలు" (archaic remnats) అని పేరు పెట్టాడు. వ్యక్తి యొక్క నిజజీవితంలో జరిగిన సంఘటనల పరంగా వాటి ఉనికిని అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. అవి ఆదిమమై, ఆంతరికమై, అనువంశికంగా మానవ మానసంలోకి ప్రవేశించిన అంశాలు.

మనిషి శరీరాన్ని వివిధ అంగాలతో కూడుకున్న పురావస్తు ప్రదర్శన శాలగా ఊహించుకోవచ్చు. ఎందుకంటే మన దేహంలో ప్రతీ అంగానికి ఒక సుదీర్ఘమైన పరిణామ చరిత్ర వుంది. అదే విధంగా మనిషి మనసులో కూడా అలాంటి పలు విభాగాల నిర్మాణం ఉందని ఊహించుకోవచ్చు. దేహాంగాలకి సుదీర్ఘ చరిత్ర ఉన్నట్టే మనోవిభాగాలకి కూడా సుదీర్ఘ చరిత్ర ఉంటుందని నమ్మాలి. ఇక్కడ నేను "చరిత్ర" అన్నప్పుడు భాష, తదితర సాంస్కృతిక పరిణామం ద్వార మనిషి మనసు వికాసం చెందిన క్రమం గురించి ప్రస్తావించడం లేదు. నేను చెప్తున్నది జంతుమానసానికి సన్నిహితమైన మనస్సు గల ఆదిమానవుడిలో, జైవికమైన, పూర్వచారిత్రకమైన, అచేతనమైన మానసిక అభివృద్ధి గురించి ఇక్కడ నేను ప్రస్తావిస్తున్నాను.

ఎలాగైతే మన దేహం స్తన్యజీవుల శరీర నిర్మాణానికి సన్నిహితంగా ఉందో, అదే విధంగా మన అంతర్యంలోని అత్యంత ప్రాచీన విభాగమే మన మనసుకు పునాది అవుతోంది. వెనకటి జీవజాతుల శరీర నిర్మాణంలోని ఎన్నో అంశాలని సుశిక్షితుడైన ఆధునిక జీవశాస్త్రవేత్త మన శరీరంలో గుర్తుపట్టగలడు. అదే విధంగా సుశిక్షితుడైన మనస్తత్వ శాస్త్రవేత్త ఆధునిక మానవుడి స్వప్న చిత్రాలకి, ప్రాచీన మానవ మానసం లోనుండి

జనించిన “సమిష్టి చిత్రాల”కి, వాటి వెనుక దాగివున్న పౌరాణిక సందేశాలకి మధ్య సంబంధాన్ని పొడచూడగలడు.

ఇలాంటి పరిస్థితుల్లో ఎలాగైతే జీవశాస్త్రవేత్తకి తులనాత్మక శరీరనిర్మాణ శాస్త్రం పనికొస్తుందో, అదే విధంగా మనస్తత్వ శాస్త్రవేత్తకి కూడా “తులనాత్మక మనోనిర్మాణ శాస్త్రం” కూడా ఎంతో ఉపయోగపడుతుంది. దీన్నే మరోలా చెప్పాలంటే, మనస్తత్వశాస్త్రవేత్తకి కలల గురించి, అచేతన ప్రవృత్తి లోనుండి జనించిన ఇతర అంశాల గురించి తగినంత జ్ఞానం ఉండడమే కాక, పురాణాల పట్ల కూడా, దాని సువిస్తారమైన అర్థంలో, లోతైన అవగాహన ఉండాలి. అలాంటి అవగాహన లేకపోతే ప్రధానమైన సారూప్యాలని గుర్తించడం ఎవరి తరమూ కాదు. ఉదాహరణకి అలాంటి అవగాహన లేకపోతే ఒక పక్క compulsion neurosis కి, మరో పక్క పూనకానికి మధ్య పోలికని గుర్తింఛడం కష్టం.




మానవ పిండం తొలి దశలలో నిమ్నస్థాయి జంతువుల పిండాల వికాస క్రమాన్ని పోలి ఉంటుంది. ఈ భావనని recapitulation అంటారు. అదే విధంగా ఆధునిక మానవుడి చేతనకి చెందిన లోపలి పొరలలో, ఆదిమానవుడికి చెందిన చైతన్యపు అవశేషాలు ఉంటాయి.

ఇందాక నేను ప్రస్తావించిన “పురాతన అవశేషాల”నే నేను “మూలాకృతులు” (archetypes) అని, లేదా “ఆదిమ చిత్రాలు” అని కూడా పిలుస్తాను.  కల గురించి, పురాణాల గురించి తగినంత జ్ఞానం లేని వాళ్లు ఈ

భావాలని తరచు విమర్శిస్తూ ఉంటారు. “మూలాకృతి” అన్న పదాన్ని ఒక కచ్చితమైన పౌరాణిక చిత్రాన్ని సూచిస్తున్నట్టుగా తరచు అపార్థం చేసుకుంటారు. అయితే ఇవి కేవలం సచేతమైన ప్రాతినిధ్యాలు అని అర్థం చేసుకోవాలి; అంత వైవిధ్యం గల ప్రాతినిధ్యాలు అనువంశికంగా సంక్రమిస్తాయని ఊహించడం పొరబాటే అవుతుంది.

మూలాకృతి అంటే ఒక మూల భావన యొక్క ప్రాతినిధ్యాలని రూపొందించే తత్వం అని గుర్తించాలి – ఆ ప్రాతినిధ్యాల పైపై వివరాలలో ఎంతో వైవిధ్యం, మార్పు ఉన్నా, మూల విన్యాసం మాత్రం మారకుండా ఉంటుంది. ‘పరస్పర విరోధులైన సోదరులు’ అనే మూలభావనకి ఎన్నో ప్రాతినిధ్యాలు ఉంటాయి. కాని ఆ మూలభావన మాత్రం అలాగే ఉంటుంది. నన్ను విమర్శించేవారు నేను “అనువంశిక ప్రాతినిధ్యాల” గురించి మాట్లాడుతున్నాను అనుకుని పొరబడ్డారు. అలాంటి తప్పుడు అవగాహనతో బయల్దేరి నేను చెప్పే మూలాకృతి అన్నది వట్టి మూఢనమ్మకం అని కొట్టిపారేశారు. కాని వాళ్లు ఒక విషయం అర్థం చేసుకోవడం లేదు. మూలాకృతులు మన చేతన లోంచి ఉద్భవించినట్టయితే, వాటిని తప్పనిసరిగా అర్థం చేసుకోవాలి. అంతేగాని అవి మన చేతన ముంగిట్లో వాలినప్పుడు సంభ్రమం చెంది, బిత్తర పోకూడదు. అవి ఒక విధమైన ప్రకృతి నిబద్ధ (instinctive) ధోరణికి చిహ్నాలు. పక్షులకి గూళ్లు కట్టడం ఎంత సహజమో, చీమలకి పుట్టలు కట్టడం ఎంత సహజమో, ఇది కూడా అంతే సహజం.

ప్రవృత్తికి (instinct) మూలాకృతికి మధ్య తేడాని ఇక్కడ స్పష్టీకరించడం అవసరం. మనం ప్రవృత్తి అనేది కొన్ని జీవభౌతిక తపనల (physiological urges) సమాహారం. ఇంద్రియాల ద్వార ఆ తపనల ఉనికిని తెలుసుకోగల్గుతాం. అభూత మనోకల్పనలలో (fantasies) కూడా కొన్ని సార్లు అవి అభివ్యక్తం అవుతాయి. ప్రతీకాత్మక చిత్రాల ద్వార మాత్రమే అవి తరచు తమ ఉనికిని వెల్లడి చేసుకుంటాయి. ఈ అభివ్యక్తీకరణలనే (manifestations) నేను మూలాకృతులు అంటాను. వాటి మూలాలు ఏమిటో మనకి తెలియదు. అవి ప్రపంచంలో ఎక్కడైనా, ఎప్పుడైనా అభివ్యక్తం కావచ్చు. పై తరం నుండి కింది తరానికి సంక్రమించే అవకాశం

లేకపోయినా, వలస ప్రక్రియ వల్ల ఒక చోటి నుండి ఇంకో చోటికి వ్యాపించే అవకాశం లేకపోయినా ఈ అభివ్యక్తీకరణలు జరగొచ్చు.

నా వద్దకి కొంత మంది వస్తుంటారు. వాళ్లకి వచ్చే కలలు, వాళ్ల పిల్లలకి వచ్చే కలలు వారిలో దిగ్భ్రాంతి కలిగిస్తాయి. ఆ కలల అంతరార్థం ఏమిటో వాళ్లకి సుతరామూ అర్థం కాదు. వాళ్లకి తమ కలలలో కనిపించే దృశ్యాలకి, తమ నిజ జీవన అనుభవాలకి, జ్ఞాపకాలకి, లేదా తమ పిల్లలకి తమ నుండి సంక్రమించిన జ్ఞాపకాలకి, మధ్య సంబంధమే కనిపించదు. మరి ఆ రోగుల్లో కొంత మంది చాలా విద్యావంతులు. అంతేకాక కొందరు తామే వృత్తిరీత్యా మనస్తత్వ శాస్త్రవేత్తలు!

వారిలో ఒక ప్రొఫెసర్ విషయం ఇప్పటికీ నాకు బాగా గుర్తు. అతడికి కలలో కనిపించిన ఒక దృశ్యం తనని పూర్తిగా కలవర పెట్టింది. తనకి పిచ్చెక్కింది అనుకున్నాడు. అలాంటి భయంతో నా వద్దకి వచ్చాడు. అతడికి నా పుస్తకాల అర లోంచి ఒక 400 ఏళ్ల నాటి పుస్తకాన్ని బయటికి తీసి, అందులో ఒక పేజీ తెరిచి చూపించాను. అతని కలలో కనిపించిన దృశ్యం లాంటి చిత్రమే ఆ పేజీ మీద కూడా ఉంది. "కాబట్టి మీకు పిచ్చి పట్టిందని అనుకోకండి," అంటూ అతడికి ధైర్యం చెప్పాను. "మీ స్వప్నదర్శనం గురించి 400 ఏళ్ల క్రితమే వాళ్లకి తెలుసు." అది విన్నాక కాస్త తెప్పరిల్లాడు. అతడి మనసు స్థిమిత పడింది.

అంతకన్నా ముఖ్యమైన మరో కేసు గురించి చెప్తాను. ఈ సారి నా వద్దకి వచ్చిన రోగి తానే ఒక మనస్తత్వ శాస్త్రవేత్త. తన పదేళ్ల కూతురు తనకి క్రిస్మస్ సందర్భంగా ఇచ్చిన ఓ బహుమతిని తెచ్చి చూపించాడు. అది చేత్తో రాయబడ్డ ఓ చిట్టి పుస్తకం. ఆ పాపకి పదేళ్ల వయసులో వచ్చిన కలల గురించి ఆ పుస్తకంలో రాసింది. చిత్రవిచిత్రమైన కలలెన్నో ఆ పుస్తకంలో వర్ణించింది. అలాంటి కలల గురించి నేను కనీవినీ ఎరుగను. ఆ కలల గురించి విన్న ఆమె తండ్రి ఎందకంత బెంబేలు పడుతున్నాడు నేను అర్థం చేసుకోగలను. చిన్న పిల్లల

బొమ్మల్లాగానే ఉన్నా, ఆ చిత్రాలు చాలా విడ్డూరంగా ఉన్నాయి. అలాంటి కలలు అసలు ఎలా వచ్చాయో ఆ తండ్రికి ఏమీ అర్థం కాలేదు. ఆ కలలలో ప్రకటితమైన కొన్ని అంశాలు –


1. "దుష్ట జంతువు" – పాము లాంటి రూపం కలిగి పెద్ద కొమ్ములున్న భీకర మృగం. తక్కిన జంతువులు అన్నిటినీ చంపేస్తుంది. అప్పుడు దేవుడు నలుమూలల నుండి వస్తాడు. నిజానికి నాలుగు వేరు వేరు దేవతలు నాలుగు పక్కల నుండి వచ్చి చచ్చిపోయిన జంతువులు అన్నిటినీ బతికిస్తారు.
2. చచ్చి స్వర్గానికి వెళితే అక్కడ pagan దేవతలు నాట్యాలు చేస్తుంటారు. అలాగే చచ్చి నరకానికి పోతే అక్కడ దేవతలు సత్కర్మలు చేస్తుంటారు.
3. చిన్న జంతువుల సమూహం ఒకటి కలలో ఆ పాపని భయపెడుతుంది. ఆ జంతువులు ఉన్నట్లుండి అమాంతంగా పెరిగిపోతాయి. వాటిలో ఒక జంతువు పాపని తినేస్తుంది.
4. నానా రకాల పురుగులు, పాములు, చేపలు, మనుషులు ఒక చిట్టెలుక లోపలికి ప్రవేశించి దాన్ని లోపలి నుండి దొలిచేస్తుంటారు. అప్పుడా ఎలుక మనిషిగా మారుతుంది. ఇది మానవ ఆవిర్భావంలోని నాలుగు దశలని సూచిస్తుంది.
5. మైక్రోస్కోప్ లోంచి చూస్తే కనిపిచ్చినట్టుగా ఓ నీటి బొట్టు కనిపిస్తుంది. ఆ బొట్టు నిండా ఆ పాపకి చెట్టుకొమ్మలు కనిపిస్తున్నాయి. ఇఫి ప్రకృతి యొక్క ఆవిర్భావాన్ని సూచిస్తుంది.
6. ఓ చెడ్డ పిల్లవాడు దారే పోయే వాళ్లందరి మీద మట్టి గడ్డలు విసురుతుంటాడు. అలా చెయ్యడం వల్ల ఆ దారే పోయే వాళ్లందరూ కూడా చెడ్డగా మారిపోతారు.
7. ఓ స్త్రీ తప్పతాగి నీట్లో మునిగిపోతుంది. మళ్లీ మైకం వదిలి, నూతనోత్సాహంతో నీట్లోంచి బయటికి వస్తుంది.

8. ఈ కలకి రంగస్థలం అమెరికా. ఓ పెద్ద చీమల గుట్ట మీద మనుషులు దొర్లుతూ కిందకి జారిపోతున్నారు. చీమలు వాళ్లని అటకాయిస్తున్నాయి. కల గంటున్న పాప భయంతో నదిలో పడిపోతుంది.
9. అది చందమామ మీద ఎడారి. అక్కడ మట్టిలో కల గంటున్న పాప ఎంత లోతుగా కూరుకుపోతుంది అంటే లోపల నరకాన్ని చేరుకుంటుంది.
10. ఈ కలలో పాపకి ఓ విరాజమాన గోళం కనిపిస్తుంది. పాప దాన్ని తాకుతుంది. దాంట్లోంచి ఆవిర్లు బయటికి వస్తాయి. అప్పుడొక పురుషుడు వచ్చి పాపని చంపేస్తాడు.
11. తనకి తీవ్రంగా జబ్బు చేసినట్టు పాపకి కల వస్తుంది. ఉన్నట్లుండి పాప చర్మం లోంచి బోలెడు పక్షులు బయటికొచ్చి ఆమెను పూర్తిగా కప్పేస్తాయి.
12. మిడుతల దండులు సూర్య, చంద్రులని క్రమ్మేస్తాయి. ఒక్క తారని తప్ప తక్కిన అన్ని తారలని కూడా క్రమ్మేస్తాయి. ఆ మిగిలిన ఒక్క తార కల గంటున్న పాప మీద పడుతుంది.

జర్మన్ లో వ్రాయబడ్డ అసలు పుస్తకంలో ప్రతీ కల సామాన్యంగా పిల్లల కలల ప్రాంరంభాన్ని అనుకరిస్తూ “అనగనగా ఒక రోజు…” అనే పదాలతో మొదలవుతుంది. ఆ పదాలతో ప్రతీ కలని ప్రారంభించిన ఆ పాప, ఆ కలలన్నీ చిన్న పిల్లల కథలుగా భావించింది. ఆ కథామాలికని తన తండ్రికి ఒక క్రిస్మస్ బహుమతిగా సమర్పించింది. ఆ కలల అంతరార్థాన్ని తండ్రికి వివరించడానికి ప్రయత్నించాడు. కాని ఆ ప్రయత్నంలో విఫలుడయ్యాడు. ఎందుకంటే ఆ పాప వ్యక్తిగత అనుభవాలకి, ఆ కలలలోని అంశాలకి ఎక్కడా పొంతన లేదు.

ఆ కలలు ఉద్దేశపూర్వకంగా అల్లిన కట్టుకథలు కావని నిర్ధారించాలంటే, అది ఆ పాప గురించి పూర్తిగా తెలిసిన వాళ్ల వల్లనే సాధ్యమవుతుంది. ఆ పాప చెప్పేది ముమ్మాటికీ నిజం అన్న సంగతి వాళ్లకే

తెలుస్తుంది. (అవన్నీ అభూతకల్పనలు అనుకున్నా కూడా వాటిని అర్థం చేసుకోవడం సామాన్యమైన విషయం కాదు.) ప్రస్తుత సందర్భాన్ని తీసుకుంటే ఈ కలలన్నీ నిజమైనవని, పాప నిజాయితీ మీద తనకి పూర్తి నమ్మకం వుందని తండ్రి నిర్ధారించాడు. నాకు కూడా ఆ పాపతో కొంచెం పరిచయం వుంది. అయితే అది ఆ పాప తన కలల గురించి తన తండ్రికి చెప్పక ముందరి మాట. వాటి గురించి ఆ పాపని సూటిగా నిలదీసే అవకాశం లేకపోయింది. ఆ పాప విదేశాల్లో ఉండేది. ఆ క్రిస్మస్ తరువాత ఏడాది తిరిగే లోపు ఏదో వ్యాధితో ప్రాణాలు వదిలింది.



పై నవాహో సైకత చిత్రంలో కనిపించే కొమ్ములున్న నాలుగు తలలు నాలుగు దిక్కులకి ప్రతీకలు.

ఆ పాప కలలు విడ్డూరంగా ఉన్నాయని స్పష్టంగా తెలుస్తోంది. వాటిలో వ్యక్తమయ్యే ప్రధాన భావాలు తాత్వికమైనవని స్పష్టంగా తెలుస్తోంది. ఉదాహరణకి మొదటి కలలో ఓ దుష్ట మృగం తక్కిన జంతువులు అన్నిటినీ తినేస్తే, దేవుడు వచ్చి చచ్చిపోయిన జంతువులు అన్నిటికీ తిరిగి ప్రాణం పోస్తాడు, అంటే పునర్జీవన ప్రదానం చేస్తాడు. దీన్నే గ్రీకు భాషలో అపోకటాస్టసిస్ (apokatastasis) అంటారు. అంటే తిరిగి ప్రాణప్రతిష్ట చెయ్యడం. క్రైస్తవ సాంప్రదాయం ద్వార పాశ్చాత్య ప్రపంచానికి ఈ భావన పరిచయం అయ్యింది. Acts of the Apostles III:21 లో ఇలా వుంది – “ప్రాణులు అన్నిటి పునర్జీవన ఘడియ సమీపించినంత వరకు తనని [క్రీస్తుని] స్వర్గం స్వీకరించాలి.” అదే విధంగా, ప్రాచీన గ్రీస్ కి చెందిన చర్చి పితరులు (Fathers of the Church), (ఉదారహణకి ఓరిజెన్ లు), ఇలాంటి భావనని గాఢంగా నమ్మేవారు. వారి ప్రకారం కాలాంతంలో చివరికి దేవుడు ప్రాణులు అన్నిటికీ ప్రాణం పోసి సృష్టిని తన సహజ, పరిపూర్ణ స్థితికి తీసుకువస్తాడు. అలాగే సెయింట్ మాథ్యూ (XVII:11) ప్రకారం ఓ ప్రాచీన యూదు సాంప్రదాయం ఇలా అంటుంది. ఎలియాస్ (Elias) “ముందు వస్తాడు, అన్నిటినీ పునరుజ్జీవింప జేస్తాడు.” ఇదే భావనని I Corinthians (XV:22) వేరే మాటల్లో ఇలా అంటుంది – “ఆడం లో అన్నీ సమసిపోయినా, క్రీస్తులో అన్నీ మళ్లీ జన్మెత్తుతాయి.”

అయితే ఆ పాపకి మతానికి సంబంధించిన విషయాల్లో అంతో ఇంతో ఉపదేశం జరిగి ఉండొచ్చు అని అనుకునే అవకాశం వుంది. కాని పాప విషయంలో అలాంటి బోధన వంటిది ఏదీ జరగలేదని తెలిసింది. ఆ పాప తల్లిదండ్రులు పేరుకి మాత్రం ప్రొటెస్టంట్ లు. వాళ్లకి బైబిల్ గురించి ఏదో పొడిపొడిగా తెలుసంతే. అలాంటి

నేపథ్యంలో ఆ పాపకి apokatastasis వంటి ప్రగాఢ భావనల గురించి వివరమైన బోధన కలిగే అవకాశం చాలా తక్కువ. ఆమె తండ్రి మాత్రం అలాంటి భావన గురించి ఎక్కడా వినలేదు.

ఆ పన్నెండు కలలలో తొమ్మిది కలలు సృష్టికి, లయకి సంబంధించిన కలలు. ఈ కలలలో ఎక్కడా క్రైస్తవ మత బోధనకి గాని, ప్రభావానికి గాని సంబంధించిన సూచనలేవీ కనిపించడం లేదు. ఇంకా ఆదిమమైన గాధలకి సంబంధించిన కలలవి. నాల్గవ, ఐదవ కలలలో కనిపించే "విశ్వాత్మ గాధ" (మనిషి యొక్క, ప్రపంచం యొక్క సృష్టికి సంబంధించిన గాధ) ఆ సంబంధాన్ని ఎత్తి చూపుతోంది. ఇదే సంబంధం ఇందాక నేను ప్రస్తావించిన I Corinthians xv:22 లో కూడా కనిపిస్తుంది. ఆ సందేశంలో కూడా ఆడం కి, క్రీస్తు కి మధ్య సంబంధం వ్యక్తం చెయ్యబడింది.

క్రీస్తు మోక్షప్రదాత అనే భావన ప్రపంచ వ్యాప్తంగా వుంది. కాని క్రీస్తుకి పూర్వమే మరో గాధ ఉండేది. అందులో ఒక మహా వీరుణ్ణి, ముక్తిదాయకుణ్ణి ఓ రాక్షసుడు మింగేస్తాడు. అప్పుడా మహావీరుడు తనని మింగేసిన రాక్షసుణ్ణి హరించి బయటికి వస్తాడు. అలాంటి భావజాలం ఎక్కణ్ణుంచి వచ్చిందో ఎవరికీ తెలియదు. అసలు అలాంటి గాధ యొక్క పుట్టుపూర్వోత్తరాలు శోధించాలంటే ఎక్కణ్ణుంచి మొదలుపెట్టాలో కూడా తెలియదు. అయితే ఆ గాధ తరతరాలుగా వస్తోందని మాత్రం కచ్చితంగా చెప్పగలం. అసలు వీరగాధ అనేది ఒకటి వుందని కూడా మనిషికి తెలియని రోజుల్లో అలాంటి కథ "ఆవిర్భవించింది" అని చెప్పగలం. మనిషికి తన మాటల పట్ల తనకే సరైన అవగాహన లేని రోజుల్లో ఆ కథ పుట్టి ఉంటుంది. కాబట్టి మహావీరుడు అనే గాధ ఒక మూలాకృతి. అది అనాదిగా వుంది.



పైన చెప్పుకున్న పాపకి  వచ్చిన కలలో సృష్టి, మరణం, పునర్జన్మ మొదలైన భావనలకి చెందిన ప్రతీకలు ఉన్నాయి. కొన్ని సంస్కృతులలో కౌమారం నుండి యవ్వనంలోకి ప్రవేశించబోయే ముందు ఇలాంటి అంశాల మీద బోధన ఇవ్వడం జరుగుతుంది. అలాంటి దీక్షకి అంతంలో ఎడారికి వెళ్ళి ఒంటరిగా ధ్యానిస్తున్న ఒక నవాహో తెగకి చెందిన అమ్మాయి.


చిన్నపిల్లలకి మూలాకృతులు స్ఫురించడం చాలా విశేషం. ఎందుకంటే చిన్నపిల్లలకి ఆ సాంప్రదాయానికి సంబంధించిన విషయాలు తెలిసే అవకాశం లేదు. ఈ సందర్భంలో ఆ పాప కుటుంబానికి క్రైస్తవ సాంప్రదాయం

గురించి పైపై పరిచయం మాత్రమే వుంది. క్రైస్తవ సాంప్రదాయంలో తరచు కనిపించే అంశాలు దేవుడు, దేవతలు, స్వర్గం, నరకం, దుష్టత్వం. కాని ఈ పాప కలలలో ఆ అంశాలు కనిపించిన తీరుని గమనిస్తే వాటికి క్రైస్తవేతర మూలాలు ఉన్నట్టు కనిపిస్తోంది.

ఓసారి మొదటి కలనే తీసుకుందాం. ఇందులో ఒక దేవుడిలోనే నలుగురు దేవుళ్లు ఉండడం, నలుగురూ "నాలుగు మూలల" నుండి రావడం జరుగుతుంది. ఆ నాలుగు మూలలు దేనికి చెందిన మూలలు? ఆ కలలో గది గురించిన ప్రస్తావన లేదు. విశ్వస్థాయిలో జరిగిన ఘటనలో, విశ్వాత్మ తానే ప్రత్యక్షమైన వృత్తాంతంలో గది వంటి భావన ఇమడదు. అసలు చతుష్టయం అనే భావనే కాస్త చిత్రమైన భావన. ఎన్నో మతాలలో, తత్వచింతనలలో అది ముఖ్య పాత్ర పోషిస్తుంది. దాని స్థానంలో క్రైస్తవ మతంలో త్రయం (Trinity) అన్న భావన వచ్చింది. ఈ భావన పాపకి తెలిసి ఉండాలని అనుకుంటాము. కాని ఈ రోజుల్లో మధ్యతరగతి కుటుంబాల్లో దివ్యచతుష్టయం అనే భావన ఎంతమందికి తెలుస్తుంది? మధ్య యుగంలో హెర్మెటిక్ తత్వంతో పరిచయం వున్న శిష్యగణానికి మాత్రమే ఆ భావన గురించి తెలిసి వుంటుంది. కాని 18 వ శతాబ్దపు తొలిదశలకే ఆ భావన కనుమరుగైపోయింది. గత 200 ఏళ్లలో ఆ భావన పూర్తిగా విస్మరించబడింది. మరి ఆ చిట్టిపాపకి ఆ భావన ఎలా తెలిసింది? ఇజికీల్ స్వప్నదర్శనం నుండి తెలుసుకుందా? కాని మరి అతగాడు దేవుడితో సమానం అని తెలిపే క్రైస్తవ బోధన ఎక్కడా లేదే?

అదే విధంగా కొమ్ములు ఉన్న పాము కల విషయంలో కూడా ఇలాంటి ప్రశ్ననే లేవదీయొచ్చు. బైబిల్ లో Book of Revelations లో కొమ్ములు ఉన్న జంతువులు ఎన్నో ఉన్నాయి. కాని అవన్నీ నాలుగు కాళ్ల జంతువులు. అయితే వాటి నేత మాత్రం ఒక డ్రాగన్. ఇది గ్రీకు పదం డ్రకొన్ (drakon) నుండి వచ్చింది. ఆ పదానికి అర్థం పాము. కొమ్ములు గల పాము ప్రస్తావన పదహారవ శతాబ్దపు లాటిన్ పరుసవేదంలో కనిపిస్తుంది. దాని పేరు quadricornutus serpens (నాలుగు కొమ్ముల పాము). ఇది మెర్క్యురీ దేవతకి

చిహ్నం. క్రైస్తవ త్రయానికి ఇది విరోధ శక్తి. అయితే ఈ ప్రస్తావన గురించి పెద్దగా ఎవరికీ తెలియదు. నాకు తెలిసి దాని గురించి రాసిన రచయిత ఒక్కడే ఉన్నాడు. ఆ పాపకి ఆ సంగతి తెలిసే అవకాశం తక్కువ.



స్పానిష్ చిత్రకారుడు గోయా వేసిన చిత్రం. ఇందులో ఒక నల్లని కుక్క నల్లని నేపథ్యం లోంచి బయటికి వస్తున్నట్టు కనిపిస్తుంది. తనకి రానున్న మృత్యువుని గుర్తించి చిత్రకారుడు ఈ చిత్రాన్ని వేశాడని విమర్శకుల అభిప్రాయం.  ఎన్నో సంస్కృతులలో కుక్కలు మృత్యులోకాని దారి చూపే మార్గదర్శకులుగా వర్ణించబడతాయి.

ఇక రెండవ కలలో కనిపించిన అంశం కచ్చితంగా క్రైస్తవేతరమైనది. సర్వసమ్మతమైన విలువలకి అది విరుద్ధంగా ఉంది. ఎందుకంటే ఈ కలలలో ఒక చోట స్వర్గంలో మనుషులు pagan  నృత్యాలు చేస్తుంటారు. మరో చోట నరకంలో దేవతలు సత్కర్మలు చేస్తుంటారు. ఈ కల నైతిక విలువలన్నీ సాపేక్షమైనవని ప్రతీకాత్మకంగా సూచిస్తోంది. అంత ప్రగాఢమైన భావన ఆ పాపకి ఎలా తట్టింది? నీషే మేధస్సుతో తులతూగేటంతటి గొప్ప ఆలోచన ఆ పాపకి ఎలా స్ఫురించింది?

ఈ ప్రశ్నలన్నీ మరో మౌలికమైన ప్రశ్నకి అవకాశాన్ని ఇస్తున్నాయి? ఈ కలల వల్ల ఆ పాపకి కలిగే ప్రయోజనం ఏమిటి? ఆమె ఆ కలలని తన తండ్రికి క్రిస్మస్ బహుమతిగా అందించింది అంటే తన దృష్టిలో ఆ కలలకి ఎంతో ప్రాముఖ్యత ఉన్నట్టే కదా?

ఆ కలలు కన్న వ్యక్తి ఏ కోయ తెగలకి చెందిన వైద్యుడో అయితే, ఆ కలలు మృత్యువు, పునరుజ్జీవనం, విశ్వావిర్భావం, మానవజననం, విలువ సాపేక్షత వంటి చిరకాల తాత్విక సమస్యలకి సంకేతాలు అని సరిపెట్టుకోవచ్చు. కాని ఆ కలలని వ్యక్తిగత స్థాయిలో అన్వయించడం అతి కష్టం అనిపిస్తుంది. అందులో ఉన్నవి "సమిష్టికి చెందిన దృశ్యాలు." కొన్ని కోయతెగలలో యువకులు పెద్దల కూటమిలోకి ప్రవేశించే ముందు వారికి ఒక విధమైన శిక్షణ ఉంటుంది. ఆ శిక్షణలో భాగంగా వాళ్లు దేవుడి గురించి, దేవతల గురించి, మూలకర్తలైన మృగాల గురించి, లోకసృష్టి గురించి, మానవ సృష్టి గురించి, విశ్వాంతం గురించి, మృత్యువు గురించి నేర్చుకుంటారు. క్రైస్తవ సంస్కృతిలో అలాంటి బోధనని మనం ఏ దశలో ఇస్తాం? కౌమార దశలో ఇస్తాం. మళ్లీ ముసలితనంలో, చావు దగ్గర పడుతుంటే, మనుషులు ఇలాంటి ఆలోచనలు ఆలోచిస్తుంటారు.

ఇంతవరకు మనం చెప్పుకున్న పాప ఈ రెండు దశలని ఎదుర్కొంది. ఆ పాప అప్పుడే కౌమార దశలోకి అడుగుపెడుతోంది. అంటే ఒక జీవన దశ యొక్క ముగింపు దగ్గర పడుతోంది. ఆ కలలలోని ప్రతీకాత్మక్తని

గమనిస్తే అవి సాధారణ యవ్వనంలోకి ప్రవేశిస్తున్న పరిస్థితిని సూచించడం లేదు. అందులో వినాశనానికి, పునరుజ్జీవనానికి సంబంధించిన చిహ్నాలెన్నో కనిపిస్తున్నాయి. తన కలల గురించి మొట్టమొదట విన్నప్పుడు అవన్నీ ఏదో ఉపద్రవాన్ని సూచిస్తున్నట్టే కనిపించాయి. ఆ ప్రతీకలలో నాకు ఒక విధమైన పరిహారం స్పష్టంగా కనిపిస్తోంది. అంత చిన్న వయసులో ఆ పాప చేతనలో ఎలాంటి అంశాలు ఉంటాయని మనం ఆశిస్తామో వాస్తవం అందుకు పూర్తిగా విరుద్ధంగా వుంది.

ఈ కలలు జీవన్మరణాలకి సంబంధించిన ఓ కొత్త, భయంకర పార్శ్వానికి అద్దం పడుతున్నాయి. జీవితాన్ని సంహావలోకనం చేసుకునే ఓ వృద్ధుడి చిత్తంలో అలాంటి చిత్రాలు మెదులుతాయి. భావిజీవన సత్పరిణామాల కోసం ఉత్సాహంగా, ఆశాభావంతో ఎదురుచూసే పిల్లల చిత్తంలో కాదు. ఈ నేపథ్యంలో "జీవితం ఓ క్షణికమైన కల" అనే రోమన్ నానుడి గుర్తొస్తోంది. అది వసంతకాలపు వైభవం కాదు. ఒక రోమన్ కవి మాటలలో చెప్పాలంటే, ఈ పాప దృష్టిలో జీవితం ఒక "వసంతకాలపు బలిదానం (ver sacrum vovendum)." తెలియకుండా ముంచుకొస్తున్న మృత్యువు క్షతగాత్రుడి జీవితం మీద నీలినీడలు (adumbratio) విసుర్తుంది. క్రైస్తవ చర్చిలలో పూజామందిరం కూడా ఒక విధంగా చూస్తే సమాధిమందిరం, మరో విధంగా చూస్తే పునరుజ్జీవన మందిరం. మరణం శాశ్వత జీవనంగా మారే అద్భుత వేదిక.

అలాంటి భావజాలాన్ని పాప చిత్తంలోకి ఆ కలలు తీసుకువచ్చాయి. అవన్నీ చిట్టిపొట్టి కథల ద్వార వ్యక్తమైన మరణ సన్నాహాలు. ఆ కథలు ఆదిమ తెగలు అనుసరించే దీక్షావ్రతాలని, జెన్ బౌద్ధమత సాంప్రదాయానికి చెందిన కవోన్ కవితలని తలపిస్తున్నాయి. ఈ సందేశానికి సాంప్రదాయక క్రైస్తవ భావజాలానికి మధ్య పెద్దగా సంబంధం లేదు. దాని వేళ్లు ఇంకా పురాతనమైన తత్వచింతనలో కనిపిస్తున్నాయి. జీవన్మరణాల గురించి లోతైన అవగాహన కలిగిన ప్రాచీన యుగాల నుండి ఆ భావజాలం పుట్టినట్టు అనిపిస్తోంది.

ఏవో భావిజీవన ఘట్టాలు, సాధారణంగా నిద్రాణమై ఉండే కొన్ని భావరూపాలని ఆ పాప చిత్తంలో అంకురింపజేస్తున్నట్టు కనిపిస్తోంది. రానున్న ఏదో దారుణ ఉపద్రవాన్ని సూచించే భావరూపాలవి. ఆ

భావరూపాలు వ్యక్తిగతంగా ఆ పాప చిత్తంలో వ్యక్తమైనా, వాటి సారం మాత్రం సార్వజనీనమైనది, సమిష్టికి చెందినది. అనాదిగా అన్నిచోట్ల ఆ భావాలు వ్యక్తమవుతూ వస్తున్నాయి. ఎలాగైతే జీవజాతుల్లో వాటి సహజప్రవృత్తి పరంగా ఎంతో వైవిధ్యం ఉన్నా, వాటి సామాన్య ప్రయోజనం మాత్రం ఒక్కటే. అదే విధంగా ఈ భావరూపాలు వ్యక్తిగతంగా అభివ్యక్తం అయ్యే తీరులో తేడాలు ఉన్నా, వాటి విశ్వజనీన సారం ఒక్కటే. అప్పుడే పుట్టిన ప్రతీ కూన సొంతంగా ప్రపంచాన్ని పరిశీలించి తన ప్రత్యేక ప్రవృత్తిని తీర్చిదిద్దుకుంటుందని అనుకోలేము. అలాగే పుట్టిన ప్రతీ వ్యక్తి అనితరంగా తనకంటూ పూర్తిగా భిన్నమైన మానవ ప్రవృత్తిని అలవరచుకుంటాడు అని కూడా అనుకోలేము. ప్రవృత్తి లాగానే మానవ జాతికి చెందిన సమిష్టి భావరూపాలు కూడా స్వతస్సిద్ధమైనవి, అనువంశికంగా సంక్రమించినవి. సందర్భాన్ని బట్టి అవి మనందరిలో ఒకే విధంగా పని చేస్తాయి.

భావావేశం వ్యక్తమయ్యే విధానాలు ఇంచుమించు ప్రపంచం అంతటా ఒకే విధంగా ఉంటాయి. వాటిని జంతు ప్రపంచంలో కూడా గుర్తుపట్టవచ్చు. భిన్న జాతులకి చెందిన జంతువులు కూడా ఒకదాన్నొకటి అర్థం చేసుకోగలుగుతాయి. మరి కీటకాల మాటేమిటి? వాటి పరస్పర జీవన (symbiotic) క్రియల సంగతి ఏమిటి? పురుగులకి సాధారణంగా వాటి తల్లిదండ్రులు ఎవరో తెలియదు. కోరి నేర్పించేవాళ్లు ఎవరూ ఉండరు. కాబట్టి సహజ ప్రవృత్తి లేని జీవజాతి ఒక్క మానవ జాతి మాత్రమేనని ఎందుకు అనుకోవాలి? మానవ చిత్తంలో జీవపరిమాణానికి చెందిన ఆనవాళ్లు ససేమిరా ఉండవని ఎందుకు అనుకోవాలి?

చిత్తం (psyche), చైతన్యం (consciousness) రెండూ ఒక్కటే ననుకుంటే మనిషి ఈ లోకంలోకి ఖాళీ చిత్తంతో వస్తాడని అనుకోవలసి ఉంటుంది. కాలాంతరంలో ఆ చిత్తంలో వ్యక్తిగత అనుభవం ద్వారా నేర్చుకున్న సంగతులు తప్ప మరేమీ ఉండవని అనుకోవలసి ఉంటుంది. జంతువులలో చైతన్యం స్వల్పంగానే ఉంటుంది;

కాని వాటిలో ఉండే ప్రేరణలు, ప్రతిచర్యలు చూస్తే చిత్తం అనేది ఉందని తనుకోక తప్పదు. ఆదిమానవ జాతులు అర్థం తెలియకుండా ఎన్నో పనులు చేస్తుంటారు.

క్రిస్మస్ చెట్టు గురించి గాని, ఈస్టర్ గుడ్డు గురించి గాని వాటి అసలు అంతరార్థం ఏమిటి అని చదువుకున్న వారిని నలుగుర్ని పిలిచి అడగండి. వారికి తెలియకపోవచ్చు. చాలా మంది ఎందుకు చేస్తున్నారో తెలియకుండా పనులు చేస్తుంటారు. నా ఉద్దేశంలో మనుషులు ముందు ఒక విధంగా పని చెయ్యడం ప్రారంభించి ఉంటారు. అలా కొంత కాలం పోయాకనే అలా ఎందుకు చేస్తున్నాం అని తమని తాము ప్రశ్నించుకోవడం మొదలెడతారు. మనస్తత్వ శాస్త్రవేత్త వద్దకి వచ్చే రోగులు చిత్రవిచిత్ర రీతుల్లో ప్రవర్తిస్తుంటారు. వాళ్లు చదువుకున్న వారు, తెలివైన వారు కావచ్చు. కాని అలా వాళ్లు ఎందుకు ప్రవర్తిస్తారో వాళ్లకే తెలియదు. అకారణంగా ఏదో భావావేశం వారి చిత్తాన్ని క్రమ్ముకుంటుంది. ఎందుకు, ఏమిటి అన్న స్పృహ లేకుండా వారి ద్వార పని జరిగిపోతుంది.

పైపైన చూస్తే అలాంటి ప్రతిచర్యలు, ప్రేరణలు అన్నీ వ్యక్తిగతాలు అనుకుంటాం. వ్యక్తిగత స్వభావంలో కనిపించే వింతైన పోకళ్లు అనుకుని తీసిపారేస్తాం. కాని నిజానికి మనిషికే ప్రత్యేకమైన సహజ ప్రవృత్తిలో అవన్నీ వేళ్లూని ఉంటాయి. ఇవన్నీ మనిషిలో వివేచన అంకురించక ముందే ఏర్పడ్డ ఈ ఆలోచనా రూపాలు, లోకవిదితమైన చేష్టలు, మనోభావాలు అన్నీ ఒక పంథాలోనే ఉన్నట్టు కనిపిస్తుంది.

బాధామయ సన్నివేశాల లోంచి, తీవ్రమైన సంఘర్షణ లోంచి మానవ వివేచన అంకురిస్తుందని అనుకోవచ్చు. ఈ భావనకి సమర్ధనగా ఒక సన్నివేశం పేర్కొంటాను. ఒక రోజు వేటలో విఫలమైన ఒక ఆటవికుడు కోపంలో తన చిన్నారి కొడుకుని గొంతుపిసికి చంపాడని అనుకుందాం. ఒళ్లు తెలియని కోపంలో ఎంత ఘాతుకం

చేశాడో ఆ తరువాత అతడికి స్పృహ కలుగుతుంది. పశ్చాత్తాపంతో మరణించిన కొడుకు శరీరాన్ని తన గుండెలకి హత్తుకు ఏడుస్తాడు. ఆ క్షణం అతడు అనుభవించిన బాధ కలకాలం అతడి చిత్తంలో ముద్రించబడుతుంది.

ఇలాంటి బాధామయ సంఘటనలే మానవ చైతన్య వికాసానికి హేతువులు అని కచ్చితంగా చెప్పలేము. కాని మనుషులకి తాము చేస్తున్న కృత్యాల పట్ల లోతైన స్పృహ కలగాలంటే ఇలాంటి బాధామయ సంఘటనల అంకుశపు పోడుపులు అవసరం అనిపిస్తుంది. ఇందుకు ఉదాహరణగా 13 వ శతాబ్దానికి చెందిన స్పెయిన్ లో జరిగిన ఒక సంఘటన గురించి చెప్పుకోవాలి. రేమండ్ లల్ అనే రాచబిడ్డ తను ఎంతో కాలంగా ప్రేమిస్తున్న ఒక కన్యని ఒక రోజు రహస్యంగా కలుసుకుంటాడు. ఆ కన్య తన దుస్తుల పొరలు తెరిచి కాన్సర్ వ్యాధితో కుళ్లిపోయిన తన రొమ్మును ప్రియుడికి ప్రదర్శిస్తుంది. ఆ దృశ్యం అతణ్ణి తీవ్రంగా కలవరపెడుతుంది. అతడి మనసంతా వైరాగ్యం క్రమ్ముకుంటుంది. క్రైస్తవ సాధువుగా మారి గొప్ప మిషనరీగా పేరు తెచ్చుకుంటాడు. ఇలాంటి సందర్భాల్లో ఒక మూలాకృతి (archetype) అతడి అచేతనలో ఎంతో కాలంగా రహస్యంగా పని చేస్తోందని, అలాంటి సంకట పరిస్థితికి దారితీసేలా అతడి జీవన ఘట్టాలని అమర్చి ఉంటుందని ఊహించవచ్చు.

అలాంటి మూలాకృతులు కేవలం స్తబ్దుగా, తటస్థంగా ఉండే రూపాలు కావు. అవి సంచలిత శక్తులు. మానవ చేతనలో, చేష్టల ద్వార అవి వ్యక్తమవుతాయి. కొన్ని సార్లు కొన్ని ప్రత్యేకమైన కలలు, మనో చిత్రాలు, లేదా ఆలోచనలు తటాలున చిత్తంలో మెరుస్తాయి. అవి ఎక్కణ్ణుంచి వచ్చాయో చెప్పలేం. ఎంత శోధించినా వాటి వేళ్లు ఎక్కడ ఉంటాయో తెలుసుకోలేం. అలాగని వాటికి అసలు కారణమే లేదని కాదు. నిశ్చయంగా వుంది. కాని అది ఎంత అస్పష్టంగా ఉంటుందంటే దాన్ని కచ్చితంగా కనిపెట్టలేం. అలాంటి పరిస్థితుల్లో ఆ కల గాని, దాని అంతరార్థం గాని పూర్తిగా అవగతం అయినంత వరకు ఎదురుచూడాలి. లేకుంటే కొన్ని సార్లు ఏదో బాహ్య సంఘటన జరిగి ఆ కలకి అర్థం తెలుపుతుంది.

కల వచ్చిన తరుణంలో ఆ ఘటన ఇంకా భవిష్యత్తులో ఉండొచ్చు. ఎలాగైతే మన సచేతన మానసానికి చెందిన ఆలోచనలు తరచు భవిష్యత్తు మీదకి మరలి ఉంటాయో, అదే విధంగా మన అచేతన, అది పుట్టించే కలలు కూడా భవిష్యత్తును సూచించేవిగా ఉంటాయి. అసలు కలల యొక్క ముఖ్య ప్రయోజనం భవిష్యత్తును వెల్లడించడం అని ఒక నమ్మకం కుడా చలామణిలో ఉంది. ప్రాచీన కాలంలోను, మధ్య యుగాల వరకు కూడా, కలలు రోగనిర్ణయంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని నమ్మేవారు. రెండవ శతాబ్దానికి చెందిన ఆర్టిమిడోరస్ డాల్డిస్ వర్ణించిన ఒక కలలో భవిష్యనిర్ణయానికి చెందిన ఆనవాళ్లు దాగి వున్నాయని ఒక ఆధునిక కలని బట్టి చెప్పగలను. ఆ మనిషికి వాళ్ల ఇల్లు తగలబడిపోతున్నట్టు, అందులో తన తండ్రి చనిపోతున్నట్టు కల వచ్చింది. అనతి కాలంలో ఆ మనిషి తానే తీవ్రమైన జ్వరంతో ప్రాణాలు వదిలాడు. అది న్యుమోనియా అయ్యుంటుందని నా అనుమానం.

ఒకసారి నా సహోద్యోగి ఒకడు phlegmone  అనే ఓ భయంకరమైన జ్వరంతో బాధపడుతున్నాడు. అయితే ఆ డాక్టర్ కి ఇలాంటి వ్యాధి వచ్చిందని తెలియని అతడి పేషెంట్ ఒకడు ఆ డాక్టర్ ఏదో అగ్నిప్రమాదంలో మరణించినట్టు కలగన్నాడు. ఆ కల వచ్చిన సమయానికి ఆ డాక్టర్ అప్పుడే ఆసుపత్రిలో చేరాడు. రోగలక్షణాలు అప్పుడప్పుడే కనిపిస్తున్నాయి. డాక్టర్ కి ఏదో జబ్బు చేసిందని, ఆసుపత్రిలో చేర్పించారన్న విషయం తప్ప పేషెంట్ కి మరేమీ తెలియదు. మూడు వారాల తరువాత డాక్టర్ ప్రాణాలు వదిలాడు.

దీన్ని బట్టి కల ద్వార భవిష్యవాణి వ్యక్తం కావచ్చని తెలుస్తోంది. కలలని అన్వయించడానికి ప్రయత్నించినప్పుడు  ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ముఖ్యంగా ఒక కల అర్థవంతంగా తోచినా దాని సందర్భం అర్థం కానప్పుడు ఈ కోణం నుండి చూడడం అవసరం. అలాంటి కల ఎలాంటి పూర్వోత్తరాలు లేకుండా ఎక్కణ్ణుంచో ఊడి పడ్డట్టు వస్తుంది. దాని కారణాలు ఏమై ఉంటాయో వెంటనే అర్థం కాదు. అయితే దాని సందేశం లోని సారాంశం అర్థమైతే, దాని కారణం అర్థమవుతుంది. రహస్యం తెలియనిది మనలోని

సచేతన భాగాలకే. అచేతనకి ముందే పూర్తి నిజం తెలిసి ఉంటుంది. ఆ నిజాన్నే అది కలల రూపంలో సచేతన భాగాలకి చేరవేస్తుంది. వాస్తవాలని పరిశీలించి నిర్ణయాలు తీసుకోవడంలో మన సచేతన ఎలాంటి సమర్థత చూపిస్తుందో, అచేతన కూడా అంతే సమర్థత చూపిస్తుంది. ఇంకా చెప్పాలంటే సచేతనకి తెలియని వాస్తవాలని కూడా పరిశీలించి వాటి పర్యవసానాలని ఊహించగల సమర్థత అచేతనలో వుంది.

కలల బట్టి మనకి అర్థమయ్యేది ఏమిటంటే అచేతనలో జరిగే ఈ క్రియలు అనాలోచితంగా, అప్రయత్నంగా జరుగుతాయి. ఈ తేడాని గుర్తించడం చాలా ముఖ్యం. తార్కిక విశ్లేషణ సచేతనకే ప్రత్యేకమైన ఒక సామర్థ్యం. కాని అచేతన మాత్రం మూలాకృతుల అధీనంలో ఉన్న పోకళ్లని  వ్యక్తం చేస్తుంది. ఒక వైద్యుణ్ణి రోగపరిణామం గురించి అడిగితే "జ్వరం," "ఇన్ఫెక్షన్" వంటి పదజాలాన్ని వాడుతాడు. కాని కలలలో కవితాధోరణి వ్యక్తమవుతుంది. అది మానవ శరీరాన్ని ఒక గృహం గాను, జ్వరాన్ని ఆ ఇంటిని కాలుస్తున్న అగ్నిగాను ప్రదర్శిస్తుంది.



జేమ్స్ థుర్బర్ వేసిన ఈ కార్టూన్ లో ఓ గయ్యాళి భార్యతో వేగలేక బాధపడుతున్న ఒక భర్త తన ఇంటిని, భార్యని ఒకే రూపంగా చూస్తున్నాడు.

ఆర్టెమిడోరస్ (Artemidorus) కాలం నుండి నేటి వరకు ఉపచేతన మన జీవనపరిస్థితులతో వ్యవహరించే తీరులో మార్పు లేదని అర్థమవుతోంది. లీలామాత్రంగా మాత్రమే అవగతమైన ఒక నిజాన్ని ఉపచేతన

భావాతీతంగా గ్రహించి దాన్ని తనదైన శైలిలో వ్యక్తం చేస్తుంది. సచేతన మనస్సులా దాంతో తార్కిక పద్ధతిలో వ్యవహరించక, మూలాకృతి పద్ధతిలో భవిష్యత్తుని నిర్ణయించే కార్యం చేపడుతుంది. దీన్ని బట్టి మూలాకృతులలో స్వతస్సిద్ధమైన శక్తి ఉంటుందని, ఉద్దేశం ఉంటుందని తెలుస్తోంది. ఈ శక్తుల సహాయంతో మూలాకృతులు సత్యాన్ని తమదైన ప్రతీకాత్మక పద్ధతిలో అన్వయించగలగడమే కాక, తమ సొంత ప్రేరణలతో, భావరూపాలతో ప్రత్యేక జీవన పరిస్థితులలో కల్పించుకుని తమ ప్రభావాన్ని చూపించగలవు. ఈ విషయంలో మాత్రం అవి మానసిక సంక్లిష్టాలకి (complexes) మల్లె పని చేస్తాయి. అవి ఇష్టం వచ్చినట్టు వచ్చి పోతుంటాయి. మన సచేతన లక్ష్యాలకి, ఉద్దేశాలకి అడ్డుపడుతూ నానా రకాలుగా కలవరపెడుతుంటాయి.

మూలాకృతులకి మన చిత్తం మీద ఎంత గాఢమైన ప్రభావం ఉంటుందో ఒకసారి గుర్తిస్తే వాటి శక్తి ఎలాంటిదో తెలుస్తుంది. వాటికి మన మీద ఒక విధమైన సమ్మోహనం ఉంటుంది. వ్యక్తిగత మనోజాలాలకి కూడా అలాంటి ప్రత్యేక లక్షణమే ఉంటుంది. కాబట్టి వ్యక్తిగత మానసిక సంక్లిష్టాలకి అయితే వాటి కంటూ ఒక చరిత్ర ఉంటుంది. అలాగే సమిష్ఠి స్థాయిలో పని చేసే మూలాకృతులకి కూడా అలాగే ఒక చరిత్ర ఉంటుంది. అయితే వ్యక్తిగత సంక్లిష్టాలు మహా అయితే వ్యక్తి యొక్క దృక్పథంలో ఒక రకమైన ఏకపక్ష ధోరణిని కలుగజేస్తాయంతే. కాని మూలాకృతులు మాత్రం మొత్తం దేశాల, జాతుల, యుగాల పరిణామాన్ని శాసించే పురాణాలని, మతాలని, తత్వచింతనలని సృష్టిస్తాయి. వ్యక్తిగత మనోజాలాలని కేవలం వ్యక్తిగత చేతనలోని దోషాల పర్యవసానాలుగా పరిగణిస్తాము. అదే విధంగా మానవజాతిని పీడించే ఆకలి, యుద్ధం, వ్యాధి, వార్ధక్యం, మృత్యువు వంటి సమస్యలతో యాతన చెందే మానవాళికి పురాణ గాధలు ఒక విధమైన మానసిక చికిత్స కింద పని చేస్తాయి.

ఉదాహరణకి యుగపురుషుడు అనే భావన ఎవరో మహాపురుషుడు వచ్చి కాలసర్పాలు, రాక్షసులు, దయ్యాలు, డ్రాగన్ లు తదితర దుష్టశక్తులని దునుమాడి మృత్యువు నుండి, వినాశనం నుండి మానవజాతిని రక్షిస్తాడు అనే నమ్మకానికి చిహ్నం అవుతుంది. అధ్యాత్మిక గ్రంథాల పారాయణ, మంత్ర జపం, నృత్య, గీత,

ప్రార్థనాదులతో ఇష్టదేవతోపాసన, మొదలైన పద్ధతుల వల్ల, చిత్తంలో భక్తి భావం క్రమ్ముకుంటుంది. మనసు ఉన్నత చేతనా స్థితులని చేరుకుంటుంది. అంతవరకు అంధకారంలో కొట్టుమిట్టాడుతున్న వ్యక్తి ఒక్క క్షణం అంతర్యంలోని వేలుపుతో తాదాత్మ్యం చెందుతాడు.

అలాంటి పరిస్థితిలో సాధారణ మానవుడు కూడా తన వ్యక్తిగత పరిమితులని విడనాడి, యాతనలకి స్వస్తి చెప్పి, మానవాతీత శక్తితో భాసిస్తాడు. అసలు తనలో అలాంటి శక్తి దాగి వుందన్న విశ్వాసమే అతడికి జీవితంలో దన్నుగా నిలుస్తుంది. అలాంటి ఆలోచనా విధానం, సంస్కృతి మొత్తం సమాజాన్నే ఉద్ధరిస్తుంది. అలాంటి సంస్కృతికి ఉదాహరణ ఎల్యూసియన్ గూఢసంస్కృతి (Eleusinian mysteries). అయితే క్రైస్తవ శకపు ఏడవ శతాబ్దంలో ఆ సంస్కృతిని పూర్తిగా అణచివేశారు. ఆ సంస్కృతితో పాటు, డెల్ఫిక్ దివ్యవాణి (Delphic oracle) సాంప్రదాయం ప్రాచీన గ్రీస్ కి చెందిన సారాన్ని, నాగరికతని వ్యక్తం చేశాయి. అసలు క్రైస్తవ యుగానికి మూలాలు కూడా ఇంకా ప్రాచీనమైన దేవ-మానవుడు (నర నారాయణుడు) అనే భావనతో ముడివడి ఉన్నాయి. ఇంకా లోతుగా తవ్వుకుపోతే ఆ భావనకి ప్రాచీన ఈజిప్ట్ కి చెందిన ఒసిరిస్ – హోరస్ గాధతో సంబంధం వుంది.

ఏ ప్రాచీన, పూర్వచారిత్రక యుగంలోనో ఎవడో తెలివైన తాత్వికుడు ఈ పౌరాణిక గాధలని "కనిపెట్టి" (invent) ఉంటాడని, ఇక అప్పటి నుండి అమాయక, పామర జనం ఆ కథలని గుడ్డిగా నమ్ముతూ వచ్చారని కొంత మంది కొట్టిపారేస్తుంటారు. అధికార దాహం గల మతాధికారులు ఈ కట్టుకథలని అల్లి ఉంటారని కొందరు అంటుంటారు. కాని అసలు invent (కనిపెట్టడం) అనే ఇంగ్లీష్ పదం invenire అనే లాటిన్ పదం నుండి వచ్చింది. దాని అర్థం శోధించి తెలుసుకోవడం. ఆ శోధన మనకి ఏం తెలియజేస్తుందో ముందే తెలిసినట్టు, ఒక విధమైన పూర్వజ్ఞానం ఉన్నట్టు ఆ పదం సూచిస్తోంది.

ఇంతవరకు మనం చెప్పుకుంటున్న ఆ చిన్నారి కలల్లో దాగి వున్న విచిత్ర భావాలని ఒకసారి పరిశీలిద్దాం. ఆ కలలని ఆ పాప కోరి తెచ్చుకుందని చెప్పలేము. అసలు అలాంటి కలలు తనకి రావడం ఆమెని ఆశ్చర్యపరిచింది. అవన్నీ ఆమెకి విడ్డూరమైన, విస్మయమైన కథలుగా తోచాయి. అందుకే అన్నిటినీ జతకూర్చి తన తండ్రికి క్రిస్మస్ బహుమతిగా ఇచ్చింది. అలా చెయ్యడం వల్లా ఆ కలలని సజీవమైన క్రైస్తవ తత్వం స్థాయికి ఉద్ధరించింది. ఆ కలల పుట్టుక, ప్రభువు అవతరణకి, నిత్యనూతన వృక్షంలో మొలకెత్తిన నవ్యకాంతికి చిహ్నమయ్యింది. (ఇది ఐదవ కల యొక్క సారాంశం.)

క్రీస్తుకి, వృక్షపు చిహ్నానికి మధ్య ప్రతీకాత్మక సంబంధం వుందనడానికి చారిత్రక ఆధారాలు ఉన్నాయి. కాని క్రీస్తు పుట్టుక సందర్భంగా ఒక చెట్టుని మండుతున్న కొవ్వొత్తులతో అలంకరించడంలో అంతరార్థం ఏంటని ఆ పాప తల్లిదండ్రులని అడిగితే వాళ్లు తెల్లబోతారు. మహా అయితే “అదో క్రిస్మస్  ఆచారం” అని ఊరుకుంటారేమో. కాని ఆ ప్రశ్నకి లోతైన సమాధానం ఇవ్వాలంటే అందుకు బారైన వ్యాఖ్యానం ఇవ్వాల్సి ఉంటుంది. మరణిస్తున్న దేవుడు అనే ఒక పురాతన ప్రతీక గురించి, దానికి జగజ్జననికి ఉన్న సంబంధం గురించి, జగజ్జనని ప్రతీక అయిన తరువు గురించి – ఇలా ఎన్నో రహస్యాలు ఏకరువు పెట్టాల్సి ఉంటుంది.

దీనికి ఉదాహరణగా ఆఫ్రికాలో ఎల్గాన్ పర్వతం మీద జీవించే ఆటవికులతో నాకు కలిగిన ఒక అనుభవం గురించి చెప్తాను. ప్రతి ఉదయం వాళ్లు నిద్ర లేవగానే వారి గుడిసెల్లో నుండి బయటికి వచ్చి వాళ్ల చేతుల్లో ఊదుకోవడం గాని, ఉమ్ముకోవడం గాని చేస్తారు. అప్పుడు ఆ శ్వాసని గాని, ఉమ్మిని గాని సూర్యుడికి నివేదిస్తున్నట్టుగా తమ చేతుల మీద భానుడి తొలికిరణాలు పడేలా చాచుతారు. ఈ చర్యకి వాళ్ల పదం ‘ముంగు.’ (ఇదొక స్వాహిలి భాషకి చెందిన పదం. అది ‘మన’ లేదా ‘ములుంగు’ అనే పాలినేషియాకి చెందిన భాషా శబ్దం నుండి వచ్చింది.) ఈ పదం, ఆ భాషకి చెందిన ఇటువంటి మరి కొన్ని పదాలు, గొప్ప లోకోత్తర శక్తిని, ప్రభావాన్ని సూచిస్తాయి. దీన్నే మన భాషల్లో అయితే దైవం అనో, దివ్యత్వం అనో అంటాము. కాబట్టి

వాళ్ల భాషలో 'ముంగు' అనే పదం మన భాషల్లో అల్లా, దేవుడు తదితర పదాలకి సమానం అనుకోవచ్చు.)

ఆ చర్యకి అర్థమేంటని, అలా ఎందుకు చేస్తారని, నిలదీస్తే వాళ్లు ఆశ్చర్యపోయారు. "ఇది అనాదిగా పాటిస్తున్న ఆచారం. సూర్యుడు ఉదయించినప్పుడు ఎప్పుడూ తప్పనిసరిగా ఇలా చేస్తాం," అన్నారు వాళ్లు. 'ముంగు' అంటే సూర్యుడా అని అడిగితే నవ్వారు. నింగి నేల కలిసే రేఖకి బాగా దూరంగా వచ్చేశాక ఇక సూర్యుణ్ణి ముంగు అనమని వాళ్లు స్పష్టం చేశారు. ముంగు అంటే వారి ఉద్దేశంలో సూర్యోదయ  సుముహూర్తం.



పై చిత్రంలో ఒక జూలూ జాతి భూతవైద్యుడు ఒక రోగి చెవిలో ఏదో ఊది రోగాన్ని నయం చెయ్యాలని చూస్తున్నాడు.




13  వ శతాబ్దం నాటి ఈ ఇటాలియన్ చిత్రంలో జీసస్ తన ఉమ్మితో ఒక అంధుడికి దృష్టిని ప్రసాదిస్తున్నాడు. శ్వాసకి మల్లె ఉమ్మికి కూడా జీవం పోయగల శక్తి ఉంటుందనే నమ్మకం చాలా కాలంగా వుంది.

వాళ్లు ఏం చేస్తున్నారో నాకు అర్థమయ్యింది. కాని వాళ్లు ఆ పనిని అలవాటుగా, అనాలోచితంగా చేస్తున్నారు అనిపించింది. కాబట్టి ఎందుకు చేస్తున్నారో వివరించలేకపోయారు. ఆ చేష్ట ద్వార వాళ్లు తమ ఆత్మలని

ముంగుకి సమర్పించుకుంటున్నారని అర్థమయ్యింది. ఎందుకంటే వారి దృష్టిలో శ్వాస గాని, ఉమ్మిగాని "ఆత్మ పదార్థం" అవుతుంది. ఒకదాని మీద ఊదడం గాని, ఉమ్మడం గాని "మహిమాన్విత" చర్యగా పరిగణించవచ్చు. ఉదాహరణకి క్రీస్తు తన ఉమ్మితో గుడ్డివారి అంధత్వం నయం చేశాడు. అలాగే తన తండ్రి యొక్క తుదిశ్వాసని లోపలికి పీల్చుకుంటున్న కొడుకు ప్రతీకాత్మకంగా తండ్రి ఆత్మని స్వీకరిస్తున్నట్టు అనుకోవచ్చు. ఆఫ్రికాకి చెందిన ఈ ఆటవికులు, బాగా పురాతన కాలంలో కూడా వాళ్ళు చేస్తున్న చర్యలలోని అంతరార్థాన్ని గ్రహించి ఉంటారని అనుకోను. నిజానికి వాళ్ల పూర్వీకులకి ఇంకా తక్కువ తెలిసి ఉంటుంది. వాళ్ల చేష్టలని ఇంకా గాఢమైన అచేతనత్వం ఆవరించి ఉంటుంది. ఎందుకు చేస్తున్నారో తెలియకుండా గుడ్డిగా చేస్తూ ఉండొచ్చు.

అందుకే గోథే రచనల్లో ఫౌస్ట్ అనే పాత్ర "ఆదిలో కృత్యం వుంది" అని ఎంతో అర్థవంతంగా అంటాడు. "కృత్యాన్ని" ఎవరూ కనిపెట్టరు. వాటిని ఊరికే అలా ఆచరిస్తారంతే. మానవ పరిణామంలో ఆలోచనలు చాలా ఆలస్యంగా వచ్చి ఉంటాయి. మొదట్లో ఏవో అచేతన కారణాల ప్రేరణ వల్ల తెలియక ఏవో చేష్టలు చేస్తాడు. ఆ అది జరిగిన చాలా కాలం తరువాత ఎప్పుడో ఆ చేష్టల వెనుక కారణాల గురించి వివేచన చేస్తాడు. ఆ కర్మకి కర్త తనేనన్న అవగాహన కలగడానికి చాలా కాలం పట్టి వుంటుంది. ఆ కర్త మరెవరో కారని, తానేనని తన మనస్సు ఆలస్యంగా గ్రహించి ఉంటుంది.

ఒక మొక్క గాని, జంతువు గాని తనని తాను ఆవిష్కరించుకోగలదు అనే భావన విని మనం నవ్వుకుంటాం. కాని మన చిత్తం, మనస్సు దానినది ఆవిష్కరించుకుంటుందని, తన ఉనికికి తానే సృష్టికర్త అని చాలా మంది నమ్ముతారు. విత్తు వృక్షంగా మారినట్టే, కూన మృగంగా మారినట్టే మనస్సు కూడా ప్రస్తుత చేతనా స్థితికి ఎదిగిందని అర్థం చేసుకోవాలి. దాని వికాసం ఇంకా సమాప్తం కాలేదు. కాబట్టి బాహ్య ప్రేరణల చేతనే కాక అంతరంగ ప్రేరణలు కూడా మనని కదిలించగలవు, మనని రూపుదిద్దగలవు.

ఇలాంటి అంతరంగ ప్రేరణలన్నీ సచేతన కన్నా ఎంతో లోతులో ఉండే చేతనా భూమికల నుండి పెల్లుబుకుతాయి. ప్రాచీన కాలంలో ఇలాంటి అంతశ్శక్తులన్నిటినీ, అంటే దేవతలు, దెయ్యాలు అన్నిటినీ, ఉమ్మడిగా "మన", అనే శబ్దంతో సూచించేవారు. ఆ శక్తులన్నీ అప్పుడు ఎంత సక్రియంగా ఉన్నాయో, ఇప్పుడూ అంతే సక్రియంగా ఉన్నాయి. అవి మనకి అనుగుణంగా పని చేస్తే మనకి అదృష్టం కలిసొచ్చింది అంటాం, నా అంతట వాడు లేడనుకుంటాం. అనుగుణంగా లేకపోతే దురదృష్టమని వాపోతాం, ప్రత్యర్థులెవరో ద్రోహం తలపెట్టారని నిందిస్తాం. మన అధీనంలో లేని "శక్తు"ల మీద మనం ఆధారపడి వున్నాం అని మాత్రం ఒప్పుకోము.

ఇటీవలి కాలంలో నాగరిక మానవుడు గణనీయమైన ఇచ్ఛాశక్తిని పెంపొందించుకున్నాడని తెలుస్తోంది. ఆ శక్తిని మనిషి తన ఇష్టానుసారం వాడి దుర్వినియోగం చేస్తున్నాడు. మంత్రజపాలతోను, నృత్యగీతాలతోను పని లేకుండా, ఉన్నత చేతనా స్థితుల్లోకి ప్రవేశించకుండా, భౌతిక సాధనాలని ఉపయోగించి, తన చుట్టూ ఉండే ప్రపంచం మీద అమితమైన ప్రభావాన్ని చూబించగలుగుతున్నాడు. అనుకున్నది సాధించగలుగుతున్నాడు. భావాలని సునాయాసంగా వాస్తవీకరించుకో గలుగుతున్నాడు. కాని ప్రాచీన ప్రపంచంలో మనిషి అడుగడుగునా అవరోధాలని ఎదుర్కుంటూ, అంధవిశ్వాసాలతో నానా రకాల భాయాందోళనలకి గురవుతూ, బిక్కుబిక్కు మని బతికేవాడు. "మనసుంటే మార్గం ఉంటుంది" అనే నానుడి ఆధునిక మానవుడు అలవరచుకున్న ఒక అంధవిశ్వాసం అని చెప్పుకోవచ్చు.

అయితే ఈ విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం కోసం ఆధునిక మానవుడు ఆత్మపరిశీలనా శక్తిని పూర్తిగా కోల్పోయి పెద్ద మూల్యమే చెల్లించాడు. ఒక పక్క హేతుశక్తిని, లౌకిక సామర్థ్యాన్ని పెంచుకున్నా, మరో పక్క తన అధీనంలో లేని "శక్తుల"కి తానే బందీ అయిపోయాడు అన్న సంగతి తాను గుర్తించడం లేదు. అతడి దేవతలు, దెయ్యాలు మటుమాయం కాలేదు; మారురూపం దాల్చారంతే. స్థిమితం లేని మనస్సుతో, అర్థంలేని భయాలతో, మానసిక చిక్కుసమస్యలతో సతమతమవుతూ, వీటన్నిటి నుండి విమోచనం కోసం మాదక

ద్రవ్యాలు, పొగాకు, అదుపు లేని మందుమాకుల వినియోగానికి అధీనమై బతుకుతున్నాడు. పేరులేని మానసిక వ్యావృత్తులతో (neuroses) యాతన పడుతున్నాడు.

మానవాత్మ

నేడు మనం నాగరిక చైతన్యం అని పిలిచేది మనిషిలోని సహజ ప్రవృత్తి నుండి క్రమంగా దూరమవుతూ వస్తోంది. కాని ఆ ప్రవృత్తి మాత్రం ఎక్కడికీ పోలేదు. దానికి మన సచేతనతో కేవలం లంకె తెగిపోయింది. కాబట్టి అది అప్పుడప్పుడు దాని ఉనికిని తెరమాటు నుండి పరోక్షంగా ప్రకటించుకుంటూ ఉంటుంది. అది న్యూరోసిస్ లో కనిపించే భౌతిక రోగలక్షణాల రూపంలో కావచ్చు, భావావేశంలో ఆటుపోట్ల రూపంలో కావచ్చు, తాత్కాలిక విస్మృతుల రూపంలో కావచ్చు, లేదా మాటజారిన సందర్భాలు కావచ్చు.

తన ఆత్మకు తాను స్వామి అని మనిషి నమ్ముతాడు. కాని తన మూడ్ లని, భావావేశాలని నియంత్రించుకోలేనంత కాలం, తనలోని అచేతన బలాలు తన నిర్ణయాలని, చర్యలని రహస్యంగా తన ఎరుక లేకుండా ఎలా ప్రభావితం చేస్తాయో తెలుసుకోలేనంత కాలం, మనిషి తన ఆత్మకి స్వామి అని చెప్పలేము. తన అంతరంగంలో ఏర్పడ్డ చీలిక నుండి తన్ను తాను రక్షించుకోవడం కోసం ఆధునిక మానవుడు తన అంతర్యాన్ని వీలుగా కొన్ని విభాగాలుగా విభజించుకున్నాడు. తన బాహ్య జీవనానికి, తన ప్రవర్తనకి సంబంధించిన వివిధ అంశాలని వేరు వేరు గదులలో దాచి, ఒకదానికొకటి ఎదుటపడకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నాడు.

అలా ఏర్పడ్డ ఈ కొత్త విభాజిత మనస్తత్వానికి ఉదాహరణగా ఒక మద్య వ్యసనపరుడి సంగతి చెప్తాను. మద్య వ్యసనంతో బాధపడుతున్న ఈ వ్యక్తి స్వస్థత కోసం ఒక మతబృందంలో చేరాడు. ఆ బృందం యొక్క ప్రభావం వల్ల తాత్కాలికంగా తన మందు మోజుని మరచిపోయాడు. "జీసస్" కరుణ వల్లనే అతడు మహిమాన్వితంగా నయమైపోయాడు అని ఆ బృందం వారు ఆ మనిషిని బహిరంగంగా గొప్పగా ప్రదర్శించుకున్నారు. ఆ అద్భుతానికి సాక్షులైన జనం తెగ సంతోషించారు. ఈ తంతు కొన్ని వారాలు సాగాక ఈ కొత్త మత్తు వదిలిపోయింది. మనసు మళ్లీ మందు మీదకి మళ్లింది. మళ్లీ తాగడం మొదలెట్టాడు. గాఢమైన వ్యాధి వల్ల ఇలా జరుగుతోందని, ఇతడిక జీసస్ కృపాకటాక్షాలకి నోచుకోడు అని ఆ మతబృందం వాళ్లు చేతులెత్తేశారు. స్వస్థత సభల కన్నా ఇతడికి ఆసుపత్రే మంచి మందు అని అతణ్ణి ఓ ఆసుపత్రిలో చేర్పించారు.

ఆధునిక "నాగరిక" మనస్సు యొక్క ఈ పార్శ్వాన్ని మనం కొంచెం లోతుగా పరిశీలించాలి. అందులో గాఢమైన ఆంతరిక విభజన, అయోమయ స్థితి కనిపిస్తోంది.

మానవాళి అంతటినీ ఒక వ్యక్తిగా ఊహించుకుంటే అచేతన శక్తుల చేత అదిలించబడే వ్యక్తిగా మానవ జాతి కనిపిస్తుంది. మనం మన జాతి ఎదుర్కునే వివిధ సమస్యలని అన్నిటినీ వేరు వేరు పెట్టెల్లో పెట్టి బంధించే ప్రయత్నం చేస్తుంటాం. అందుకే మనం చేసే పనుల పట్ల లోతైన అవగాహన కలిగి ఉండాలి. స్వయంకృతమైన దారుణ విపత్తులెన్నో ఇప్పుడు మానవాళి అస్తిత్వాన్నే సవాలు చేస్తున్నాయి. న్యూరాటిక్ వ్యక్తి చిత్తంలో విభజన ఉన్నట్టే, మానవాళిలో కూడా లోతైన విభజనలు నెలకొని ఉన్నాయి. అలాంటి విభజనకి ఒక తార్కాణం తూర్పు ప్రపంచాన్ని, పశ్చిమ ప్రపంచాన్ని వేరు చేసే ఉక్కుతెర (Iron Curtain). తూర్పు ప్రపంచంలో విజిగీష ప్రబలిపోతోందనే నెపంతో పాశ్చాత్య మానవుడు, ఒక పక్క అసామాన్యమైన భద్రతా ఏర్పాట్లు చేసుకుంటే, ధర్మం పూర్తిగా తన పక్షానే వుందన్న భ్రమలో ఉన్నాడు.

పాశ్చాత్య మానవుడు గుర్తించని సత్యం ఏంటంటే, తన దుర్గుణాలని ఎంతగా కప్పిపుచ్చినా, అంతర్జాతీయ వేదిక మీద తన ప్రవర్తనని ఎంత ముస్తాబు చేసి అందంగా ప్రదర్శించినా, తన నిజస్వరూపానికి కమ్యూనిస్ట్ ప్రపంచం నిర్దయగా, నిక్కచ్చిగా అద్దం పడుతూనే ఉంటుంది, తన దౌష్ట్యాల యొక్క పర్యవసానాల రుచి పదే పదే చూపిస్తూనే ఉంటుంది. పాశ్చాత్య ప్రపంచం లోకం కంటపడకుండా దాచుకున్న దుర్గుణాల (దౌత్యంలో కపటం, నడతలో మారని మోసం, ముసుగేసిన బెదిరింపులు మొ॥) ప్రతిఫలాలు తూర్పు ప్రపంచం నుండి ప్రతిబింబించబడి పాశ్చాత్యాన్ని దెబ్బకొడతాయి. పాశ్చాత్య మానవుడి వికార ప్రతిబింబమే ఉక్కు తెర (iron curtain) మాటు నుండి తనని క్రూరంగా వెక్కిరిస్తోంది.

పాశ్చాత్య మానవులు అనుభవించే నిస్సహాయతకి వేళ్లు ఎక్కడున్నాయో ఇప్పుడు అర్థమవుతుంది. వాళ్లని ఎదుర్కొంటున్న సమస్యలు నైతిక సమస్యలు అని ముందుగా గుర్తించాలి. అణువిస్తరణ ద్వార, ఆర్థిక "పోటీ" ద్వార ఆ సమస్యలని పరిష్కరించాలని చూస్తే బెడిసికొడుతుంది. ఎందుకంటే ఆ పోటీలో పాశ్చాత్యుడిది పైచేయి కావాలన్న నియమం ఏమీ లేదు. అలా కాకుండా మానసిక, ఆంతరిక పద్ధతులు మరిన్ని సత్ఫలితాలని ఇస్తాయని ఈ రోజుల్లో చాలా మంది అభిప్రాయపడుతున్నారు. విస్తరిస్తున్న మానసిక అంటువ్యాధి నుండి అలాంటి పద్ధతులు అధ్యాత్మిక ఆత్మరక్షణని అందిస్తాయి.

ఎందుకంటే అలాంటి ప్రయోజనాలు నిష్ప్రయోజనాలు కాకమానవు. ఎప్పుడూ తప్పు "వాళ్లదే" నని మనని మనం వంచించుకోవాలని చూస్తే, లేదా ప్రపంచానికి నిరూపించాలని చూస్తే ఆ ప్రయత్నం ఎప్పుడూ విఫలం అవుతుంది. మనలో దాగిన చీకటిని తెలుసుకుని, దాని కుటిల చేష్టలని గుర్తించే ప్రయత్నం చేస్తే ఎంతో శ్రేయస్సు ఒనగూరుతుంది. మన నీడని (మన స్వభావం యొక్క చీకటి ముఖ్యాన్ని) మనం చూడగలిగితే

ఎలాంటి మానసిక దాడి అయినా, నింద అయినా మనని ఏమీ చెయ్యలేదు. కాని ప్రస్తుతం జరుగుతున్నది ఏమిటంటే మనం అన్ని రకాల దుష్ట ప్రభావలకి లోనై జీవిస్తున్నాము. ఎందుకంటే నిజానికి “వాళ్లు” చేస్తున్నదానికి మనం చేస్తున్నదానికి పెద్దగా తేడా లేదు.

కమ్యూనిస్ట్ ప్రపంచంలో ఓ పెద్ద అపోహ చలామణిలో వుంది (దాన్ని అపోహ అని, భ్రాంతి అని ఎందుకు అంటామంటే, వారి కన్నా మన వివేచనా శక్తి మరింత ఉన్నతమైనది అనే భ్రమలో మనం ఉంటాం గనుక, మనం అపోహ అనుకునేది ఏదో ఒకనాటికి మాయమై పోతుందని ఆశ). భూమి మీద ఏదో ఒకనాడు ఒక సువర్ణ యుగం నెలకొంటుందని, దివి భువికి దిగి వస్తుందని, అప్పుడిక భూమి మీద జీవనంలో కొరత అనేదే ఉండదని, ఎవరికి ఏం కావాలంటే అది తక్షణమే సిద్ధిస్తుందని, అందరినీ కన్నబిడ్డల్లా చూసే ఓ ధర్మప్రభువు ఇలని పాలిస్తాడని ఆ కలలోని, ఆ శైశవ స్వప్నంలోని సారాంశం. ఆ అమాయకమైన, శైశవ మూలాకృతి వారి మనసులని గాఢంగా ఆక్రమించింది. మన మరింత ఉన్నతమైన దృక్పథంతో ఆ భ్రమ మీద కళ్లెర్ర జేసినంత చూసినంత మాత్రాన కల కరిగిపోదు. పాశ్చాత్య నాగరికతలో అలాంటి శైశవ స్వప్నమే మన మనసుల్లో కూడా ఒకటి గూడు కట్టుకుంది. అచేతనంగానైనా అలాంటి ఆశలు, ఆశయాలు, అపోహలు మన మనసుల్లో కూడా పేరుకొని ఉన్నాయి. మనం కూడా సంక్షేమ రాజ్యాన్ని, విశ్వశాంతిని, సర్వ మానవ సమానత్వాన్ని, అనుల్లంఘనీయమైన మానవ హక్కులని, విశ్వజనీనమైన న్యాయాన్ని, సత్యాన్ని గాఢంగా నమ్ముతాం. మరీ పెద్దగా గొంతెత్తి చాటకపోయినా భూమి మీద దేవుడి పాలన రానుందని మనసు లోతుల్లో ఎక్కడో విశ్వసిస్తాం.

కాని అసలు చేదైన నిజం ఏంటంటే మానవ జీవితం తీర్చరాని పరస్పర వైరుధ్యాల వలయంలో చిక్కుకుని వుంది. రాత్రి – పగలు, పుట్టుక – మరణం, సంతోషం – బాధ, మంచి – చెడు వంటి వ్యతిరేకాల జతలకి మన

జీవితాలు బందీలు. వీటిలో ఒకటి దాని వ్యతిరేకాన్ని జయిస్తుందన్న నమ్మకం లేదు. బాధని ఆనందం తుడిచివేస్తుందని, మంచి  చెడును అణచివేస్తుందని భరోసా ఏమీ లేదు. జీవితం ఒక యుద్ధ భూమి. ఆది నుండి అలాగే ఉంది; ఎల్లకాలం అలాగే ఉంటుంది. ఆ యుద్ధోత్సాహపు ప్రోద్బలమే లేకపోతే పృథ్వీజీవనం అంతరించిపోతుంది.

మనిషి లోతుల్లో నిరంతరం సాగే ఈ సంకుల సమరాన్ని, దాని పర్యవసానాన్ని గుర్తించిన క్రైస్తవులు ఆ లోకం యొక్క అంతం ఏదో త్వరగా వస్తే బాగుంటుందని ఆశపడ్డారు. ఆ సంకుల సమారానికి పరిష్కారంగా బౌద్ధులు అన్ని రకాల కోరికలని, తపనలని త్రోసిపుచ్చాలని బోధించారు. కాని ఈ పరిష్కారాలని తుచ తప్పకుండా పాటించడం ఒక విధంగా సామూహిక ఆత్మహత్యే అవుతుంది. మూల సిద్ధాంతాల మాట ఎలా వున్నా, ఆ రెండు మతాలలోను కాలానుగతంగా ఏర్పడ్డ నైతిక భావాలు, ఆచారాలు, లోకాన్ని త్రోసిపుచ్చే ఆ మతాల పైఖరిని కొంతవరకు సరిదిద్దాయి, శమింపజేశాయి.

ఈ నిజాన్ని ఎందుకంత నొక్కి చెబుతున్నానంటే, ఈ రోజుల్లో చాలా మందికి అసలు మతం అంటేనే విరక్తి పుడుతోంది. అలాంటి వాళ్లు అసలు మతం ఏమిటో అర్థం చేసుకోలేకపోయారు. మతం లేకపోయినా జీవన గతులు సాఫీగా సాగిపోతున్నట్టు కనిపిస్తుంది. కాని మనిషి జీవితంలో మతం లేకపోతే ఎంత నష్టమో గుర్తించకపోవడం పెద్ద పొరబాటు. కాని సంకట పరిస్థితులు ఎదురైనప్పుడు పరిస్థితులు మారుతాయి. యాతనలలో సతమతమవుతున్న మానవుడు జీవన సత్యాల గురించి ఆలోచిస్తాడు. జీవితానికి మూలాలని తెలుసుకోవాలని బయల్దేరుతాడు.

నాకు తెలిసినంత మారకు కాథలిక్కుల కన్నా, యూదులు, ప్రొటెస్టంట్ లు మనస్తత్వ శాస్త్రవేత్తలని ఎక్కువగా సంప్రదిస్తారు. దీనికి కారణాన్ని కొంతవరకు అర్థం చేసుకోవచ్చు. కాథలిక్ చర్చి ‘ఆత్మల సంరక్షణకి,

శ్రేయస్సుకి (cura animarum) బాధ్యత తీసుకుంటుంది. కాని ఈ వైజ్ఞానిక యుగంలో ఒకప్పుడు మతగురువుల రంగానికి చెందిన ప్రశ్నలకి సమాధానాలు మనస్తత్వ శాస్త్రవేత్తలు చెప్పవలసి వస్తోంది. జీవితానికి ఒక పరమార్థం ఉంటుందని, దైవం, అమరత్వం అనేవి ఉన్నాయన్న నమ్మకం మనిషికి తప్పనిసరిగా అవసరం అని చాలా మంది అనుకుంటారు. మృత్యు ఘడియలు దగ్గర పడుతున్నప్పుడు మనిషి మనసు ఇలాంటి ఆలోచనల మీదకి మళ్లుతుంది. విశ్వాత్మ లేదా పరమాత్మ ను గురించి, లోకోత్తర జీవనాన్ని గురించిన భావన మనిషి మనసులో అనాదిగా నాటుకుని వుంది. ఒక్క ఆధునిక మానవుడే అలాంటి ఆలోచనలతో పని లేదని అనుకుంటాడు.

సింహాసనారూఢుడై ఆకాశంలో కొలువున్న దేవుణ్ణి ఏ టెలిస్కోప్ తోనో  మనిషి కనిపెట్టలేకపోవచ్చు. దివ్యమైన మాతృత్వం లేదా పితృత్వం అనేవి నిజమేనని మనిషి గుర్తించలేకపోవచ్చు. అంత మాత్రం చేత ఆ భావనలన్నీ కల్లలని కాదు. పూర్వచారిత్రక యుగాల నుండి అలాంటి భావనలు మనిషిని అంటిపెట్టుకుని ఉన్నాయి. అతడి చేతనలో ఎప్పుడూ తెర మాటున పొంచి వుంటాయి. ఏ కాస్త అవకాశం దొరికినా తెరను చీల్చుకుని ముందుకు తోసుకొస్తాయి.

అలాంటి భావనలకి తిలోదకాలు వదిలేయాలని ఆధునిక మానవుడు బలంగా వాదించొచ్చు. వాటికి వైజ్ఞానిక ఆధారాలు లేవు కనుక అవన్నీ వట్టి అబద్ధాలని వాదించొచ్చు. లేదంటే తన నమ్మకాలు వమ్ము అవుతున్నాయని చింతించొచ్చు. మనం అదృశ్యమైన, అజ్ఞేయమైన విషయాల (మరి దేవుడు మానవ చింతనకి అందని వాడు, అమరత్వాన్ని నిరూపించే మార్గం లేదు) గురించి మాట్లాడుతున్నాం కనుక ఆధారాల గురించి ఎందుకు ఆలోచించాలి? ఆహారంలో ఉప్పు ఎందుకు అవసరమో తెలియకపోయినా దాన్ని రోజు వంటల్లో వాడుతూ మేలు పొందుతున్నాం కదా? ఉప్పు వినియోగానికి కారణం కేవలం ఒక మూఢ నమ్మకం అనో, రుచి వల్ల కలిగే భ్రాంతి అనో వాదించవచ్చు. తెలిసి వాడినా, తెలియక వాడినా, ఎలా

వాదించినా దాని వాడకం మాత్రం మనకి శ్రేయస్సు కలిగిస్తుంది. కాబట్టి జీవితానికి ఒక అర్థాన్ని ఇచ్చి, సంకట పరిస్థితుల్లో ఆదుకునే భావాల నుండి ఎందుకు దూరం కావాలి?

మరి అలాంటి భావాలు నిజమో కాదో ఎలా తెలుస్తుంది? అలాంటి భావనలు వట్టి మిథ్య అంటే చాలా మంది ఒప్పుకుంటారు. వాళ్లకి అర్థం కానిది ఏంటంటే అలాంటి భావాలని నిజమని నిరూపించడం ఎంత కష్టమో, అబద్ధమని నిరూపించడం కూడా అంతే కష్టం. మనం ఎలాంటి దృక్పథాన్ని తీసుకుంటామో అది మన ఇష్టం. పూర్తిగా వ్యక్తిగత నిర్ణయం అవుతుంది, దాని వెనుక బలమైన తర్కం ఏదీ ఉండదు.

అయితే ఎప్పటికీ నిరూపించలేని ఆలోచనలని పెంచుకోడానికి కొన్ని బలమైన కారణాలు ఉన్నాయి. ఎందుకంటే ఆ భావాలకి ఎన్నో మంచి ప్రయోజనాలు ఉన్నాయి. మనిషికి తన జీవితానికి ఒక అర్థాన్నిచ్చి, జీవితం మీద ఒక పట్టునిచ్చి, విశ్వంలో తనకొక సముచిత స్థానం ఉందని ఒప్పించే కొన్ని భావాలు చాలా అవసరం. వచ్చే కష్టాలకి ఒక కారణం వుందని తెలిస్తే మనిషి ఎన్ని కష్టాలకైనా ఓర్చుకుంటాడు. జీవితంలో తనని పీడించే దురదృష్టాలన్నీ "ఎవడో పెర్రి వాడు వల్లించే కల్లబొల్లి కథ" అనిపిస్తే మనిషి క్రుంగిపోతాడు.

మనిషి జీవితానికి ఒక అర్థాన్ని ఇవ్వడం అధ్యాత్మిక ప్రతీకల ప్రయోజనం. ప్యూబ్లో ఇండీయన్లు (Pueblo Indians) వాళ్లంతా తండ్రి సూర్యుడి పిల్లలని నమ్మేవాళ్లు. ఆ నమ్మకం వారి జీవితానికి ఒక దిశని, లక్ష్యాన్ని చూపిస్తుంది. తమ పరిమిత జీవితానికి ఆవల మరేదో అస్తిత్వం ఉందన్న స్ఫురణ కలిగిస్తుంది. తమ వ్యక్తిత్వ వికాసానికి కావలసినంత అవకాశాన్ని కల్పిస్తుంది. పరిపూర్ణులైన వ్యక్తులుగా నిండైన జీవితాన్ని ఎలా గడపాలో నేర్పిస్తుంది. వాళ్లకి కష్టాలు వచ్చినా వాటి వెనుక ఒక అర్థం ఉన్నట్టు అనిపిస్తుంది కనుక అందులో

సంతృప్తి ఉంటుంది. కాని తనది ఎలాంటి అర్థంపర్థం లేని కుక్క బతుకు అనుకునే ఆధునిక మానవుడి అనుభవం చాలా భిన్నంగా ఉంటుంది.



దక్షిణ అమెరికాలో కయపాస్ ఇండియన్ తెగకి చెందిన ఒక వ్యక్తి యొక్క శవపేటిక చిత్రం. మృతుడికి అవసరం అవుతాయనే నమ్మకంతో అందులో ఆహారాన్ని, బట్టలని ఉంచుతారు.

డబ్బు సంపాదించి ఖర్చుపెట్టడం కన్నా జీవితానికి మరింత విశాలమైన అర్థం ఏదో ఉన్న ఎరుకే మనిషిని మరింత ఉన్నత స్థాయికి ఉద్ధరిస్తుంది. అలాంటి ఎరుకలేని మనిషి దారి తప్పిన వాడు అవుతాడు. సెయింట్ పాల్ తాను కేవలం ఒక డేరాలు చేసేవాడు అనుకుని వుంటే ఎప్పటికీ ఆ స్థాయిలోనే ఉండిపోయేవాడు. ప్రభువు సందేశాన్ని మానవాళికి మోసే భారం తనది అన్న అవగాహన అతడి జీవితానికి ఓ గొప్ప అర్థాన్నిచ్చింది. వట్టి అహంకారి అని అతణ్ణి కొందరు ఆడిపోసుకోవచ్చు. కాని భావి తరాల తీర్పు అలాంటి విమర్శను వమ్ము చేస్తుంది. అతడి చిత్తాన్ని ఆక్రమించిన ఓ మహోన్నత భావన అతణ్ణి ఒక హస్తకళాకారుడి స్థాయి నుండి గొప్ప ఎత్తుకు తీసుకెళ్లింది.

అలాంటి భావన వెనుక కొన్ని గొప్ప ప్రతీకలు ఉంటాయి. అవన్నీ ఎవరి చేతనో సచేతనంగా, ఉద్దేశపూర్వకంగా కనిపెట్టబడినవి కావు. దివ్యపురుషుడు అనే మహత్తర భావనని జీసస్ సృష్టించలేదు. అతడి జననానికి పూర్వం ఎన్నో శతాబ్దాలకి ముందే అలాంటి భావన ఉండేది. ముందే ఉన్న ఆ మహత్తర భావన అతడి చిత్తాన్ని గాఢంగా ఆవరించింది. సెయింట్ మార్క్ చెప్పిన వృత్తాంతం ప్రకారం ఆ మహత్తర భావనే నాజరీన్ లో ఒక మామూలు వడ్రంగిగా  జీవించే అతణ్ణి ఓ మహోన్నత స్థాయికి ఉద్ధరించింది.

ప్రాచీన కథకులతో, వారి కలలతో పౌరాణిక గాథలు మొదలయ్యాయి. మనిషి మనసులో ఊహాప్రపంచాలు మొలకెత్తిననాడు పౌరాణిక గాథలు మొదలయ్యాయి. అలాంటి కథకులకి, తదుపరి తరాలలో కవులు, తాత్వికులు అని పిలువబడ్డ వారికి మధ్య పెద్దగా తేడా లేదు. ప్రాచీన కాలపు కథకులు వారి కల్పనలకి మూలాలు ఎక్కడున్నాయో పెద్దగా పట్టించుకునే వారు కారు. ఆ కథలు ఎక్కడి నుండి పుట్టాయి అన్న ఆలోచన ఎన్నో తరాల తరువాతే మనుషులకి స్ఫురించింది. ఎన్నో శతాబ్దాల క్రితం మన “ప్రాచీన” గ్రీస్ అని పిలిచే కాలంలోనే మేధావులు పౌరాణిక గాథల గురించి ఎంతో అధునాతనమైన దృక్పథాన్ని కలిగి ఉండేవారు. దేవతల కథలన్నీ ఎప్పుడో భూస్థాపితమైన రాజుల, భూస్వాముల కథలేనని, వాటికే కాస్త హంగు కూర్చి, వారి గుణగణాలని సంవర్ధనం చేసి, వారిని దేవతల్లా ప్రదర్శించి, ఆ ప్రాచీన కథకులు నానా కథలూ అల్లారని

గ్రీకులు అర్థం చేసుకున్నారు. పురాణాలు అసంభవం అని, వాటిని యదాతథంగా స్వీకరించలేమని అప్పటికే మనుషులు అర్థం చేసుకున్నారు. కాబట్టి ఆర్వాచీన మనసత్వానికి సమ్మతమైన రీతిలో వాటిని మార్చి రాసుకున్నారు.

ఇటీవలి కాలంలో స్వప్నప్రతీకల విషయంలో కూడా ఇలాంటి పరిణామమే జరిగినట్టు కనిపిస్తుంది. మనస్తత్వ శాస్త్రం ఇంకా శైశవ దశలలో ఉన్న కాలంలోనే కలలకి కొంత ప్రాముఖ్యత ఉందని మనకి తెలుసు. ఎలాగైతే ప్రాచీన గ్రీకులు, సహేతుకమైన, "మామూలు" చరిత్రకి మహిమల తొడుగు వెయ్యగా పుట్టినవే పురాణాలు అని అర్థం చేసుకున్నారో, అదే విధంగా కలలని కూడా యదాతథంగా అర్థం చేసుకోకూడదని మన మనస్తత్వ రంగపు పురోగాములు అభిప్రాయపడ్డారు. సచేతన మానసంలో అణచివేయబడ్డ అంశాలే వికట రూపంలో కలలుగా పైకి తన్నుకొస్తాయని, కలలని వాళ్లు తీసిపారేశారు. కాబట్టి కలలలో పైపైన కనిపించే అర్థం కన్నా, వేరే లోతైన అర్థం ఉంటుందని మొదటి నుండి గ్రహించారు.

అయితే ఇలాంటి ఆలోచనా విధానాన్ని నేను వ్యతిరేకిస్తానని ముందే చెప్పాను. ఆ వ్యతిరేకత తోనే నేను కలల యొక్క సారాన్ని మాత్రమే కాక రూపాన్ని కూడా అధ్యయనం చెయ్యడం మొదలెట్టాను. కలల లోని అంశాలతో సంబంధం లేకుండా వాటికి వేరే అర్థం ఎందుకుంటుంది? కల అనేది ఒక సామాన్య, సహజ పరిణామం. "కల దాని అన్వయాన్ని అదే ప్రకటించుకుంటుంది," అంటుంది యూదుల పవిత్ర గ్రంథం టాల్ముడ్. అయితే సమస్య ఎక్కడ వస్తుందంటే కలల అంశాలు ప్రతీకాత్మకంగా ఉంటాయి గనుక, ప్రతీకలని బహుళార్థాలు ఉంటాయి. మనం సచేతన మానసంతో గ్రహించే దాని కన్నా ప్రతీకలు వేరే దిశలలో దారి చూపిస్తాయి. కాబట్టి అవి అచేతనమైన దాన్ని, లేదా పూర్తిగా సచేతనం కాని దాన్ని సూచిస్తాయి.

శాస్త్రీయ దృక్పథం గల వారికి ఈ స్వప్న ప్రతీకలు, వాస్తవ ప్రపంచంలో వాటికి ప్రభావం ఉండడం, మొదలైన భావాలు అంతగా రుచించవు. ఎందుకంటే భౌతిక పరిణామాల తర్కంలో అవి ఇమడవు. అయితే ఇలాంటి ఇబ్బందికరమైన భావనలు మనస్తత్వశాస్త్రంలో కోకొల్లలు. ఉదాహరణకి భావావేశం (emotion) అనే భావనని మనస్తత్వశాస్త్రవేత్త కచ్చితంగా నిర్వచించాలని ఎంత ప్రయత్నించినా అది పట్టుచిక్కదు. రెండు సందర్భాల్లోను సమస్యకి కారణం ఒక్కటే – రెండిట్లోను అచేతన యొక్క ప్రమేయం ఉండడమే.

పూర్తిగా అర్థం కాని, లేదా అంతుచిక్కని వాస్తవాలతో వ్యవహరించడం ఎంత ఇబ్బందికరంగా ఉంటుందో, అది వైజ్ఞానిక దృక్పథానికి ఎలా అడ్డుపడుతుందో నాకు బాగా తెలుసు. ఇలాంటి పరిణామాలతో ఇబ్బంది ఎక్కడ వస్తుందంటే, ఇక్కడ వాస్తవాలు కాదనరానివి. కాని వాటిని తార్కికంగా వివరించాలంటే గొప్ప అవరోధం ఎదురవుతుంది. అలా వివరించగలగాలంటే ముందు అసలు జీవితాన్ని అర్థం చేసుకోవాలి. ఎందుకంటే జీవితమే ఈ ప్రతీకలని, భావావేశాలని జనింపజేస్తోంది.

కేవలం సిద్ధాంతానికే ప్రాధాన్యత నిచ్చే మనస్తత్వ శాస్త్రవేత్త (academic psychologist) భావావేశాలని, లేదా అచేతనని (లేదా రెండిటినీ) త్రోసిపుచ్చుతూ, తన మేధోవ్యవస్థ నుండి తొలగించవచ్చు.  కాని తన జ్ఞానాన్ని వాస్తవ ప్రయోజనాలలో ఉపయోగిస్తూ, రోగులతో వ్యవహరించే వైద్య మనస్తత్వశాస్త్రవేత్తకి (clinical psychologist) ఆ వెసులుబాటు ఉండదు. భావావేశాలు, అచేతన అనేవి ఉన్నాయని వైద్య మనస్తత్వ శాస్త్రవేత్తకి ఒప్పుకోక తప్పదు.  ఎందుకంటే భావావేశపు సంఘర్షణలు, వాటిలో కలుగజేసుకుంటూ అచేతన నుండి పుట్టే ప్రభావాలు – ఇవి రెండూ అతడి శాస్త్రరంగంలో ముఖ్యాంశాలు. అతడు తన రోగికి చికిత్స చెయ్యాలంటే, తర్కవిరుద్ధంగా తోచే ఈ రెండు అంశాలతోను వ్యవహరించక తప్పదు. సైద్ధాంతికంగా వాటిని

ఎలాంటి పరిభాషతో వ్యక్తం చేసుకున్నా, వాస్తవ ఆచరణలో మాత్రం వాటితో వ్యవహరించాల్సిందే. అందుకే ప్రశాంత సైద్ధాంతిక శోధనకే అలవాటు పడ్డ మనస్తత్వ శాస్త్రవేత్త, వైద్య మనస్తత్వ శాస్త్రవేత్తకి ఉండే అనుభవం లేకుండా, నిజ జీవన సవాళ్లతో తలపడాలని బయల్దేరితే గొప్ప అవరోధాలే ఎదురవుతాయి. నెట్ ప్రాక్టీస్ చెయ్యడనికి, కఠినమైన అంతర్జాతీయ క్రికెట్ టూర్నమెంట్లలో ఆడడానికి మధ్య తేడా లాంటిదే ఇదీను. సంతృప్తికరమైన శాస్త్ర పరిభాషతో వర్ణించలేకపోయినా ఈ  ఆత్మిక  వాస్తవాలతో వ్యవహరించక తప్పదు. అందుకే పాఠ్యపుస్తకాల సహాయంతో మనస్తత్వ శాస్త్రాన్ని నేర్చుకోవడం సాధ్యం కాదు. వాస్తవ జీవన అనుభవం మాత్రమే ఆ పాఠాలని నేర్పగలదు.

కొన్ని ప్రముఖమైన ప్రతీకలని పరిశీలిస్తే ఈ సంగతి బాగా అర్థమవుతుంది –

క్రైస్తవ మతంలో శిలువ చాలా అర్థవంతమైన ప్రతీక. ఎన్నో రకాల భావాలకి, భావావేశాలకి అది అద్దం పడుతుంది. కాని అది పేర్ల జాబితా చివర్లో కనిపిస్తే ఫలానా వ్యక్తి చనిపోయాడని అర్థం. అలాగే హిందూ మతంలో సర్వత్ర సాక్షాత్కరించే ఒక ప్రతీక లింగం. కాని ఎవరైనా ఆకతాయి ఆ బొమ్మని వీధి గోడ మీద వేస్తే అది అతడి లైంగిక దృష్టిని సూచిస్తుంది. ఎందుకంటే బాల్య, కౌమార దశలకి చెందిన లైంగిక ఊహాగానాలు, యవ్వనంలో కూడా కొనసాగుతాయి కనుక నిస్సందేహమైన లైంగిక ప్రస్తావన కలిగిన కలలు ఎన్నో వస్తాయి. కాబట్టి వాటిని ఆ కోణం నుండే అర్థం చేసుకోవాలి. అదే విధంగా ఒక ఎలక్ట్రీషియన్ male plugs గురించి female sockets గురించి మాట్లాడుతున్నప్పుడు అతడు శృంగార భావజాలంలో పరవశించిపోతున్నాడని అనుకోవడం అర్థరహితం. ఇక్కడ అతడు లైంగిక భావనలని తను రోజు వాడే వస్తుజాలానికి అనువైన ప్రతీకలుగా వాడుతున్నాడు. అదే విధంగా ఒక విద్యావంతుడైన హిందువు లింగం గురించి మాట్లాడేటప్పుడు (హైందవ మతంలో అది శివుడు అనే దేవతామూర్తికి ప్రతీక), పాశ్చాత్యులు ఊహించేటట్టు అతడు పురుషాంగం గురించి మాట్లాడడం లేదు.  కాబట్టి శివలింగానికి శృంగారానికి సంబంధం లేదు. అదే విధంగా

శిలువ కేవలం మృత్యువుకి చిహ్నం కాదు. ఆ కల వచ్చిన వ్యక్తి యొక్క అంతరంగ పరిపాకాన్ని బట్టి కలలో కనిపించిన ప్రతీక అర్థం మారుతుంది.

కలలని, కలల ప్రతీకలని సరిగ్గా అన్వయించడానికి తెలివితేటలు కావాలి. దాన్నొక యాంత్రికమైన పద్ధతిగా మార్చి ఊహాశక్తి కొరవడ్డ మెదళ్లలోకి కూరాలని చూస్తే ఆ ప్రయత్నం విఫలం అవుతుంది. ఆ ప్రయత్నం సఫలం కావాలంటే అందుకు స్వప్నకారుడి వ్యక్తిత్వం పట్ల లోతైన అవగాహన ఉండాలి. అంతేకాక అసలు అన్వయకారుడికే గాఢమైన ఆత్మస్పృహ ఉండాలి. కలల అన్వయంలో కొన్ని పనికొచ్చే చిట్కాలు ఉన్నాయన్న మాటను ఎవరూ కాదనరు. కాని వాటిని తెలివిగా, జాగ్రత్తగా ఉపయోగించాలి. నియమాలని గుడ్డిగా అనుసరిస్తూ పూర్తిగా తప్పుదోవ పట్టే ప్రమాదం లేకపోలేదు. అదే తెలివైన వాడైతే ఏదో చిన్న వివరాన్ని పట్టుకుని దాని సహాయంతో కచ్చితంగా కలని అన్వయించగలుగుతాడు. ఎంత బుద్ధికుశలత గలవాడైనా, తగినంత లోదృష్టి లేకపోతే తప్పుదారి పట్టే అవకాశం ఎంతైనా వుంది.

ప్రతీకలని అర్థం చేసుకోవాలని బయల్దేరినప్పుడు, మన దృష్టి కేవలం ఆ ప్రతీకలకే పరిమితమైతే సరిపోదు. ఎవరి చేతనలో అయితే ఆ ప్రతీకలు జనించాయో ఆ వ్యక్తిని లోతుగా, సమగ్రంగా అర్థం చేసుకోవాలి. అతడి సాంస్కృతిక నేపథ్యం గురించి తెలుసుకోవాలి. అలాంటి ప్రయత్నం చేత మన ఎరుకలోనే ఉన్న వెలితిని పూరించడానికి వీలవుతుంది. అందుకే నా వద్దకి వచ్చే ప్రతీ వ్యక్తిని ముందే ఒక మూసలో బంధించి ఆ కోణం నుండి చూడక, ప్రతీ వ్యక్తిని కొత్తగా అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తాను. శాస్త్ర నియమాలు వాడితే వ్యక్తి గురించి పైపైన తెలుసుకోడానికి వీలవుతుందేమో. అలా కాకుండా కీలక సమస్యలని స్పృశించాలని చుస్తే

మాత్రం, మనం అసలు మొత్తం జీవితాన్నే ఎదుర్కోవాల్సి వస్తుంది. అలాంటి పరిస్థితిలో ఎంత శాస్త్రీయ పరిభాష గుప్పించినా అన్నీ నిష్ఫల పదాలే అవుతాయి.

ఊహాశక్తి, లోజ్ఞానం (intuition) మన అవగాహనకి ఎంతో అవసరం. మామూలుగా అలాంటి సామర్థ్యాలు కవులకి, కళాకారులకి చాలా అవసరం అని నమ్ముతారు (అయితే ఇంద్రియాల పాత్రం బలంగా ఉండే రంగాల్లో వాటిని నమ్మకూడదు అని కూడా అనుకుంటాం). కాని అన్ని ఉన్నత విద్యా రంగాల్లోను వాటి పాత్ర ఎనలేనిది. అనువర్తిత శాస్త్రాలు అన్నిట్లోకి అతి కఠోరమైన భౌతిక శాస్త్రంలో కూడా నమ్మలేనంత స్థాయిలో లోజ్ఞానం పాత్ర కనిపిస్తుంది. ఎన్నో సందర్భాల్లో అచేతన ద్వార పని చేసి సమాధానాలు తెలుసుకోవడం జరుగుతుంది. (అలా సమాధానాలు తెలుసుకున్న తరువాత తార్కిక పద్ధతులతో శోధించి ఆ సమాధానాలు సరైనవేనని  కావాలంటే నిర్ధారించుకోవచ్చు.)

స్వప్న ప్రతీకల అన్వయంలో లోజ్ఞానం చాలా అవసరం. లోజ్ఞానం ఉన్న స్వప్నకారుడు తన కలల అంతరార్థాన్ని ఇట్టే పట్టేయగలడు. లోజ్ఞానం లేకుండా నిరాధారిత ఊహాగానికి పాల్పడితే తాత్కాలిక సంతృప్తి కలుగుతుందేమో గాని ఆ పద్ధతి  ప్రమాదకరమని గుర్తుంచుకోవాలి. అసలుసిసలైన లోజ్ఞానం లేకుండా కల్లబొల్లి అన్వయాలు చేస్తే అటు అన్వయకారుడికి, ఇటు స్వప్నకారుడికి ఇద్దరికీ ఎంతో పురోగతి సాధించిన భ్రమ కలుగుతుంది. కాని లోజ్ఞానంతో గుర్తించిన సంగతులని, వాస్తవాలతో పోల్చి చూసుకుని, వాటికొక తార్కికమైన వివరణని ఇచ్చినప్పుడు మాత్రమే అన్వయం స్థిరమైన పునాది మీద నిలుస్తుంది.

నిజాయితీ గల మనోవిశ్లేషకుడు అయితే ప్రతీ సందర్భంలో అలాంటి శుద్ధమైన లోజ్ఞానం దొరకదని ఒప్పుకుంటాడు. ఈ వాస్తవాన్ని ఎప్పుడూ మనసులో పెట్టుకోకపోతే ఆ మనోవిశ్లేషకుడికి నిజాయితీ లేదన్నమాట. కాని శాస్త్రవేత్త కూడా మనిషేనని మర్చిపోకూడదు. కాబట్టి మనోవిశ్లేషకుడికి అంతుచిక్కని

సమస్య ఎదురైతే దాని పట్ల కోపం రావడం సహజమే. కాని చాలా మంది ప్రస్తుతం మనకి తెలిసిందే పరమ సత్యమని, అంతకు మించి తెలుసువాల్సింది మరేమీ లేదన్న భ్రమలో ఉంటారు. కాని ఒక వైజ్ఞానిక సిద్ధాంతం కన్నా పెళుసైనది, క్షణికమైనది మరేమీ లేదు. అది కేవలం పట్టెడు వాస్తవాలని గ్రహించడం కోసం అల్లిన ఒక తాత్కాలిక వివరణ. అంతేగాని అది సనాతన సత్యం కాదు.

ప్రతీకల పాత్ర

ఒక వైద్య మనస్తత్వశాస్త్రవేత్త ప్రతీకలని అధ్యయనం చేసేటప్పుడు ముందుగా రెండు రకాల ప్రతీకలని గుర్తిస్తాడు – మొదటివి "సహజ" ప్రతీకలు, రెండవ వర్గానివి "సాంస్కృతిక" ప్రతీకలు. సహజ ప్రతీకలు వ్యక్తుల అచేతన మూలాల నుండి పుట్టుకొచ్చినవి. కొన్ని మూలాకృతులు (archetypes) అసంఖ్యాకంగా వైవిధ్యం చెందగా ఏర్పడ్డ ప్రతీకలవి. కొన్ని సార్లు వాటి మూలాలని తవ్వుకుంటూ పోతే వాటి ప్రాచీన మాతృకలని పసిగట్టవచ్చు. అంటే అతి పురాతన కృతులలోను, ఆదిమ సమాజాలలోను ఎదురయ్యే చిత్రాలతోను, భావాలతోను వాటిని ముడిపెట్టవచ్చు. ఇందుకు భిన్నంగా సాంస్కృతిక ప్రతీకలు ఇప్పటికీ ఎన్నో మతాలలో చలామణిలో ఉండే "సనాతన సత్యాల"ని వ్యక్తం చేస్తాయి.  అవి కాలానుగతంగా ఎన్నో రూపాంతరాలకి నోచుకున్నాయి. దీర్ఘకాలంగా ఎంతో వికాసం చెంది నేడు నాగరిక సమాజాలలో విశ్వజనీన చిత్రాలు విలసిల్లాయి.

ఆ సాంస్కృతిక ప్రతీకలలో కూడా ఆ ప్రప్రథమ మహత్తు ఇంకా మిగిలి ఉంటుంది. అవి ఇప్పటికీ కొంతమంది వ్యక్తుల్లో ప్రగాఢమైన భావావేశాన్ని కలుగజేస్తాయి. మూఢనమ్మకాలకి మల్లె అవి వ్యక్తిలో గాఢమైన పరివర్తన కలుగజేసి బలమైన ప్రభావాన్ని చూపిస్తాయి. కాబట్టి మనస్తత్వశాస్త్రవేత్త వాటి ఉనికిని గుర్తించి వాటితో తగిన రీతిలో వ్యవహరించాలి. హేతుదృష్టితో చూసినప్పుడు అవి అహైతుకంగా కనిపిస్తాయని వాటిని కొట్టిపారేస్తే సరిపోదు. మన మానసిక వ్యవస్థకి అవి పునాదిరాళ్లు అవుతాయి. మానవ సమాజాలని తీర్చిదిద్దే ప్రబల శక్తులు అవుతాయి. వాటిని తొక్కిపెట్టినప్పుడు, నిర్లక్ష్యం చేసినప్పుడు, వాటిలోని శక్తి అచేతనలో విలీనమైపోయి, చెప్పరాని పర్యవసానాలకి దారితీస్తుంది. ఆ విధంగా వినష్టమైపోయినట్టు కనిపించే చేతనా శక్తి అచేతన యొక్క పైపొరలలోని అంశాలని ప్రబలీకృతం చేస్తుంది. వాటిలో కొత్త ఊపిరి పోస్తుంది. అంతవరకు వ్యక్తీకరణకి అవకాశం లేని ధోరణులు వ్యక్తం కావడానికి ఆ విధంగా అవకాశం దొరుకుతుంది.

అలాంటి ధోరణులన్నీ మన సచేతన మానసం వెనుక ఎప్పుడూ పొంచి ఉండే ఒక వినాశాత్మక "ఛాయారూపం"గా ఏర్పడతాయి. కొన్ని పరిస్థితుల్లో శ్రేయస్కరమైన ప్రభావాన్ని ప్రసరించే ధోరణులు కూడా, వాటిని అణిచిపెడితే, భూతాలుగా మారి పీడిస్తాయి. అందుకే చాలా మంది అచేతన అంటే ఎందుకు భయపడతారో, అసలు మనస్తత్వ శాస్త్రం అంటేనే ఎందుకు విముఖత చూపుతారో సులభంగా అర్థం చేసుకోవచ్చు.

అధోలోకపు ద్వారాలు తెరుచుకుంటే ఏం జరుగుతుందో ఆధునిక యుగంలో మనం స్పష్టంగా చూశాం. ఇరవయ్యవ శతాబ్దపు తొలి దశకంలో  శాంతియుత వాతావరణం నెలకొన్న ఆ కాలంలో, ఎవరూ ఊహించలేనంత దారుణాలు తదుపరి దశకాల్లో సంభవించి ప్రపంచాన్ని అతలాకుతలం చేశాయి. అప్పట్నుంచి ప్రపంచం అంతటా ఒక విధమైన స్కిజోఫ్రీనియా (schizophrenia) నెలకొంది. గొప్ప సంస్కారం గల జర్మనీలో పాశవికత సంకెళ్లు తెంచుకుంది. పశుత్వం రష్యాపై రాజ్యం చేసింది. యుద్ధాగ్నితో ఆఫ్రికా ఖండం రగిలిపోయింది. పాశ్చాత్య ప్రపంచం అంతటా ఆందోళన ఆవరించిందంటే మరి ఆశ్చర్యం లేదు.

ఆధునిక మానవుడికి తన "హేతువాదం" తన చైతన్య స్థితిని ఎంతగా బలహీనపరిచిందో అర్థం కావడం లేదు. (హేతువాదం వల్ల అతడు మహత్తర ప్రతీకలకి, భావాలకి స్పందించే శక్తిని కోల్పోయాడు). దాని వల్ల చేతనాలోకపు "అధఃపాతాళం" నుండి పుట్టుకొచ్చే శక్తుల ధాటికి తట్టుకోలేకపోతున్నాడు. "మూఢనమ్మకాల" నుండి దూరం అయ్యే ప్రయత్నంలో అతడు తన అధ్యాత్మిక విలువలకి దూరమై ఒక ప్రమాదకర పరిస్థితిలోకి జారుకున్నాడు. అతడి అధ్యాత్మిక, నైతిక సంస్కారాలన్నీ కకావిలం అయిపోయాయి. అతడి ఆంతరిక విభజన ధరావ్యాప్తమైన గందరగోళంగా అభివ్యక్తం అవుతోంది.

ఆధునిక నాగరికత ప్రభావం వల్ల ఆదిమ సమాజాల అధ్యాత్మిక విలువలు ఎంతగా తరిగిపోతాయో మానవశాస్త్రవేత్తలు అధ్యయనం చేశారు. వాళ్ల జీవితానికి పరమార్థం అర్థం కాకుండా పోతుంది. సామాజిక వ్యవస్థ ముక్కలు చెక్కలవుతుంది. మొత్తం సమాజం నైతికంగా దిగజారిపోతుంది. మనం ప్రస్తుతం సరిగ్గా అదే స్థితిలో ఉన్నాం. మనం ఏం పోగొట్టుకున్నామో మనకి తెలియదు. దురదృష్టవశాత్తు మన మతగురువులు తమ వ్యవస్థలని కాపాడుకోవాలని తాపత్రయ పడతారే గాని, ఏ ప్రతీకలనైతే వాళ్లు సంరక్షింపజూస్తున్నారో, వాటి అంతరార్థాన్ని అర్థం చేసుకోలేకున్నారు. నా ఉద్దేశంలో విశ్వాసానికి, ధీశక్తికి (ఇదే మనిషి యొక్క అతి శక్తివంతమైన శస్త్రం). కాని దురదృష్టవశాత్తు మతవిశ్వాసం గలవారు సైన్స్ అంటే భయపడతారు. (అలాగే మనస్తత్వ శాస్త్రం అన్నా కూడా భయపడతారు). అలా చేయడం వల్ల మానవ భవితవ్యాన్ని శాసించే మహత్తర చైత్య శక్తులని చేజేతులా వదులుకుంటున్నారు. మనం చూసే ప్రపంచంలో ఎక్కడా మహిమ, మహత్తు అనేవి లేకుండా ఏరిపారేశాం. మన దృష్టిలో ఏదీ పవిత్రం కాదు.

గడచిన యుగాలలో, మానవ చేతనలో అప్రయత్నంగా భావనలు పెల్లుబికినప్పుడు మనిషి వాటన్నిటినీ కుదురుగా ఒక ఆంతరిక విన్యాసంలో ఇముడ్చుకోగలిగాడు.  కాని "నాగరిక" మానవుడు ఆ ఫలితాన్ని సాధించలేకపోతున్నాడు. తనకి ఏదో "అధునాతన" చేతన ఉందని పొంగిపోతున్నాడే గాని, ఆ చేతన తన

ఉపచేతన లోనుండి వచ్చే ప్రోద్బలాలని, ప్రేరణలని జీర్ణించుకోలేకపోతోంది. అలా జీర్ణం చేసుకునే ప్రయత్నంలో, గ్రహించే ప్రయత్నంలో లోకసమ్మతమైన కొన్ని మహత్తర ప్రతీకలు ఎంతో ఉపయోగపడతాయి.

ఈ రోజుల్లో మనం "పదార్థం" గురించి మాట్లాడతాం. దాని భౌతిక లక్షణాల గురించి మాట్లాడతాం. కాని ఆ "పదార్థం" అనే భావన ఒక అమానుషమైన, కేవలం బుద్ధిగతమైన భావనగా మిగిలింది. ఆ భావనలో మనకి ఆంతరికమైన సాన్నిహిత్యం, చైతన్య పరమైన అనుబంధం స్ఫురించవు. కాని తొలి యుగాలలో పదార్థం పట్ల అవగాహన చాలా భిన్నంగా ఉండేది. విశ్వైక పదార్థాన్ని జగజ్జననిగా అభివర్ణించాము, అందులో భాగమైన భూతలాన్ని భూమాతగా తలచి కొలిచాము. ఒకప్పుడు ఆత్మ అనుకున్న దాన్ని ఇప్పుడు బుద్ధితో అభిన్నం చేసుకున్నాము. అది ఇప్పుడు మనిషి మనసులోని అహంకార పూరిత ఆలోచనల స్థాయికి దిగజారిపోయింది. "మన పితృదేవుడు" ("our Father") అనే భావం వెనుక దాగి వున్న అపారమైన చైత్యశక్తి ఇప్పుడు బుద్ధి అనే ఎడారిలో ఇంకిపోయింది.

ఈ రెండు మూలసూత్రాలు ప్రాక్ పశ్చిమాల పరస్పర విరుద్ధ సంస్కృతులకి పునాదులుగా ఉన్నాయి. పశ్చిమ సంస్కృతి ప్రపంచాన్ని పురుషతత్వంగా, పితరుడిగా అభివర్ణిస్తుంది. కమ్యూనిస్ట్ లు పదార్థాన్ని స్త్రీతత్వంగా, తల్లిగా అభివర్ణిస్తారు. ఈ రెండు దృక్పథాల మధ్య నిజానికి తేడా లేదు. కాని మనకి ఈ రెండిటి గురించి పెద్దగా తెలియదు. వెనకటి రోజుల్లో కనీసం ఈ రెండు తత్వాలని నానా రకాలుగా పూజించేవారు. దాన్ని బట్టి మావన చేతనలో వాటికి ఎంత ప్రాధాన్యత ఉండేదో అర్థమవుతుంది. కాని ఈ రోజుల్లో అవి కేవలం నిస్సారమైన అమూర్తభావాలుగా మిగిలిపోయాయి.

వైజ్ఞానిక పురోగతి పెరుగుతున్న కొద్ది మన ప్రపంచం క్రమక్రమంగా అమానవీయం అయిపోతోంది. ఈ విశ్వంలో మనిషి ఒంటరివాడిగా మిగిలిపోయాడు. ఈ రోజుల్లో మనిషి జీవితం ప్రకృతిలో అనుసంధానమై లేదు కనుక,

ప్రకృతితో తనకి సహజంగా ఉండే, "అచేతనమైన తాదాత్మ్యాన్ని" పోగొట్టుకున్నాడు. ప్రకృతిగతమైన అంశాలకి ఒకప్పుడు మన జీవితాలలో ప్రతీకాత్మకమైన విలువ ఉండేది. ఇప్పుడు అదంతా కోల్పోయాము. పర్జన్య గర్జన విన్నప్పుడు ఇప్పుడు ఏ దేవతకో కోపం వచ్చిందని అనుకోము. మెరుపు మెరిసినప్పుడు వజ్రాయుధాన్ని తలచుకోము. నదిని నదీమతల్లిగా పూజించము. తరువును బ్రతుకు తెరువు చూపే తల్లిగా కొలవము. నాగుపాము జ్ఞానానికి చిహ్నమని అనుకోము. గుహలలో భూతాలు ఉంటాయని బెదరము. రాళ్లలో, గూళ్లలో, పశువుల్లో, పాషాణాలలో విశ్వమంతా కోటి గొంతికలతో మనతో ఇక ఊసులాడదు. ఆ గొంతికలకి మనం బదులివ్వడం ఏనాడో మరిచాము. ప్రకృతితో మనిషి తన బాంధవ్యాన్ని కోల్పోయాడు. ఆ అనుబంధంతో వచ్చే ప్రగాఢమైన చైత్యశక్తి కూడా ఇప్పుడు చేజారిపోయింది.



ఆస్ట్రేలియాకి చెందిన ఆదిమ తెగలు తమ సంస్కృతికి చెందిన మౌలిక భావనలకి దూరమై పతనమయ్యారు.

మన స్వప్నప్రతీకలు కొంతవరకు ఈ అపారమైన నష్టాన్ని భర్తీ చేస్తున్నాయి. ఆ ప్రతీకలు మనని మళ్లీ మన మూలప్రకృతితో ముడిపెడుతున్నాయి. వెనకటి ప్రవృత్తిని, చింతనా ధోరణులని మళ్లీ తవ్వి తెస్తున్నాయి. దురదృష్టవశాత్తు అవి చెప్పే కబుర్లన్నీ ప్రకృతి గతమైన పరిభాషలో వ్యక్తమై ఉన్నాయి. ఆ భాష మనకిప్పుడు విడ్డూరంగా, అర్థరహితంగా కనిపిస్తుంది. కాబట్టి వాటిని సహేతుక పదాలతో, ఆధునిక భావజాలంతో తర్జుమా చేసే సవాలు ఎదురవుతోంది. ఇది ముఖ్యంగా ఎందుకు సవాలు అవుతోందంటే ఆధునికుల భాష దాని ఆదిమ మూలాల నుండి దూరమైపోయింది. ఏ వస్తుసంజాతాన్ని అయితే భాష వర్ణిస్తోందో దాంతో అధ్యాత్మికంగా ఒక్కటయ్యే అలవాటును మర్చిపోయింది. ఈ రోజుల్లో మనం భూతాల గురించో, లేదా ఏవో అభూత జీవాల గురించో మాట్లాడుతున్నప్పుడు వాటిని మనం సృష్టి చెయ్యలేకపోతున్నాం. ఒకప్పుడు భావాలకి ప్రాణం పోసి వాస్తవీకరించే శక్తి మాటలకి ఉండేది. ఇప్పుడా శక్తిని కోల్పోయాం. మంత్రతంత్రాల మీద నమ్మకం పోయింది. అర్థంలేని కట్టుబాట్లకి బందీలైపోయాం. అన్ని రకాల "మూఢనమ్మకాల" నుండి మన భావజాలాన్ని ప్రక్షాళన చేసుకున్నాం. "నేపాళ మాంత్రికులని, పేదరాసి పెద్దమ్మలని, మంత్రాల మరిడమ్మలని" ఆ కథల పుస్తకాల్లోంచి బయటికి రాకుండా నిర్బంధించాం. విపినాలలో జుట్టు విరబోసుకు తిరిగే వికటాకృతులని ఆ ఆడవుల్లోంచి బయటికి రావద్దని శాసించాం. అద్భుతం, మహత్తరం అనే పదాలకి అర్థం లేకుండా మన నాగరికతని పరిశుభ్రం చేసుకున్నాం.

మన జీవితపు పైపై భాగాలలో మూఢనమ్మకాలు, అహైతుక అంశాలు లేకుండా శుభ్రం చేసుకున్నాం. అయితే మానవ చేతన లోతుల్లో కూడా మన ఆదిమ తత్వపు ఆనవాళ్లని తొలగించగలిగామా లేదా అన్నది వివాదాంశమే. చాలా మంది 13 సంఖ్యని ఒక అపశకునంగా చూస్తారు. అహైతుకమైన నమ్మకాలు, పిల్లతనపు భ్రాంతులు గల వాళ్లు ఇంకా ఎంత మంది లేరు? మానవ మానసాన్ని వస్తుగత దృష్టితో పరిశీలిస్తే, అలాంటి ఆదిమ ధోరణులు, ప్రవృత్తులు చేతనలో ఇప్పటికీ సజీవంగా మసలుతున్నాయని తెలుస్తుంది. గత 500 ఏళ్లుగా మనలో ఏ మార్పు జరగలేదా అని ప్రశ్నించుకోవలసి వస్తుంది.

ఈ సత్యాన్ని లోతుగా అర్థం చేసుకోవడం ఎంతైనా అవసరం. ఆధునిక మానవుడు తన సుదీర్ఘ మనోవికాస చరిత్రలో సమీకరించుకున్న నానా రకాల లక్షణాల విచిత్ర మిశ్రమం. అలాంటి మిశ్రమ జీవి అయిన మనిషిని, తన ప్రతీకలని లోతుగా  అధ్యయనం చేయాలి. హేతువాదం, వైజ్ఞానిక దృక్పథం ఒక పక్క, మరో పక్క పాతకాలపు నమ్మకాలు, వెనకటి ఆలోచనా ధోరణులు, గుడ్డి అజ్ఞానం అన్నీ ఆగర్భ స్నేహితుల్లా చేతనలో కలిసే ఉంటాయి.

అలాంటి చేతన కలిగిన నేటి మనుషులని, వారి చేతన నుండి పుట్టే ప్రతీకలని, మాటోటి మనస్తత్వ శాస్త్రవేత్తలు అధ్యయనం చేస్తారు. ఆ ప్రతీకలని, వాటి అంతరార్థాన్ని వివరించాలంటే, అవన్నీ వ్యక్తిగత అనుభవం నుండి వచ్చాయా, లేక ఆ వ్యక్తి కన్న స్వప్నం సార్వత్రిక సచేతన జ్ఞానం లోనుండి ఆ ప్రతీకని ఎంచుకుందా అన్నది ముందు చూడాలి.

ఉదాహరణకి ఒక కలలో 13  సంఖ్య కనిపించింది అనుకుందాం. ఇక్కడ ప్రశ్న ఏంటంటే ఆ కల గన్న వ్యక్తికి ఆ సంఖ్య అపశకునాన్ని సూచిస్తుందని గాఢమైన నమ్మకం వుందా, లేక ఆ కల కేవలం అలాంటి వాళ్లు ఉంటారని ఆ వ్యక్తికి సూచిస్తోందా అన్నది ఆలోచించాలి. ఈ రెండిట్లో ఏది వాస్తవం అన్న దాని మీద ఆ కల యొక్క అన్వయం ఆధారపడుతుంది. మొదటిది నిజమైతే, ఆ వ్యక్తి ఇంకా 13  దుశ్శకునం అనే భావనలో ఉన్నాడన్న నిజాన్ని జ్ఞాపకం పెట్టుకోవాలి. అలాంటి వ్యక్తి హోటల్ లో 13 అంకె గదిలో ఉండడానికి గాని, లేదా 13  మంది కూర్చునే బల్ల వద్ద కూర్చోడానికి ఇష్టపడకపోవచ్చు. రెండవది నిజమైతే, 13 కి అర్థం ఒక దురుసుమాటతో సమానం అనుకోవచ్చు. “మూఢనమ్మకం” గల స్వప్నకారుడు 13  సంఖ్య యొక్క “సమ్మోహనం” నుండి ఇంకా విముక్తుడు కాలేదు; “హేతువాది” అయిన స్వప్నకారుడి విషయంలో 13 సంఖ్యకి ఆ మనిషి మీద భావావేశంతో కూడిన ప్రభావం ఇక లేదు.

దైనిక జీవితంలో మూలమాతృకలు (archetypes) అలా కనిపిస్తాయో పై వాదన సాదోహరణంగా వివరిస్తుంది. ఆ మూలమాతృకలు కేవలం చిత్రాలు మాత్రమే కాదు, వాటి వెనుక భావావేశపు బలం ఉంది. ఈ రెండు

ముఖాలు ఉన్నప్పుడే దాన్ని మూలమాతృక అనగలం. భావావేశం లేని చిత్రం మాత్రమే ఉంటే దానికి పెద్దగా ప్రభావం ఉండదు. ఆ చిత్రలోకి భావావేశాన్ని దట్టిస్తే దానికొక మహత్తు ఏర్పడుతుంది; అది సంచలితమవుతుంది, దానికి ఏదో ఒక రకమైన ప్రభావం ఉంటుంది.

ఈ భావనని గ్రహించడం కొంచెం కష్టం అని నాకు తెలుసు. ఎందుకంటే నేను చెప్పేదాన్ని కచ్చితంగా మాటల్లో నిర్వచించడం సాధ్యం కాదు. ఎందుకంటే చాలా మంది నిపుణులు మూలమాతృకలని ఒక యాంత్రిక వ్యవస్థగా వర్ణించడానికి ప్రయత్నించారు. ఏవో కొన్ని పొడిపొడి మాటల జాబితాగా ప్రదర్శించాలని చూశారు. కాని అవి వట్టి మాటలు కావని, కనీసం తాత్విక భావాలు కూడా కావని గుర్తించాలి. అవి జీవనశక్తులు. భావావేశమనే సేతువు ద్వార సచేతనమైన వ్యక్తితో అవి అనుసంధానం అవుతాయి. అందుకే వాటికి ఇష్టం వచ్చిన అన్వయాన్ని, లేదా విశ్వజనీనమైన అన్వయాన్ని కూడా ఇవ్వడానికి వీలుపడదు. దాన్ని సంపర్కించిన వ్యక్తి యొక్క జీవన పరిస్థితిని బట్టి, ఆ వ్యక్తి యొక్క జీవితానుభవాలని బట్టి, సందర్భాన్ని బట్టి దాన్ని అన్వయించవలసి ఉంటుంది.

కాబట్టి క్రైస్తవుల విషయంలో శిలువ అనే ప్రతీకని క్రైస్తవ నేపథ్యాన్ని బట్టి అన్వయించాలి. ప్రత్యేక సందర్భాల్లో ఆ స్వప్నం ఆ నేపథ్యాన్ని దాటి పరిశీలించాలని సూచిస్తే అది వేరే విషయం. అప్పటికీ క్రైస్తవ సంస్కృతిలో దానికి ఇచ్చే అర్థాన్ని తప్పకుండా దృష్టిలో పెట్టుకోవాలి. కాని అన్ని సందర్భాల్లోను, పరిస్థితుల్లోను శిలువకి అర్థం ఒక్కటేనని చెప్పడానికి లేదు. అదే నిజమైతే ఇక అందులో మహత్తు ఉండదు, అందులోని జీవశక్తి ఆవిరైపోతుంది. అది వట్టి మాటగా మిలిగిపోతుంది.

మూలమాతృక వెనుక ఉండే ఆ భావావేశపు తాపాన్ని గుర్తించలేని వారు, పౌరాణిక భావాల గందరగోళంలో మునిగితేలుతుంటారు. ప్రతీ ప్రతీకకి శతకోటి అర్థాలు ఇస్తూ అల్లకల్లోలం సృష్టిస్తారు. లోకంలోని శవాలన్నీ

రసాయనికంగా ఒక్కలాంటివే కావచ్చు. కాని వాటిని కలిగిన సజీవ వ్యక్తుల స్వభావాలు వేరు. ఒక సజీవ వ్యక్తి జీవితంలోకి అవి ఎందుకు ప్రవేశించాయి, ఆ వ్యక్తికి అవి ఎందుకు ముఖ్యం అన్నది తెలుసుకున్నప్పుడే మూలమాతృకలు ఊపిరి పోసుకుంటాయి.

మాటల అర్థం తెలియకుండా ఊరికే మాటలు ప్రయోగిస్తే లాభం ఉండదు. మనస్తత్వశాస్త్రంలో ఇది పూర్తిగా నిజం. ఆనిమా, ఆనిమస్ వంటి మూలాకృతుల గురించి, మహాగురువు గురించి, జగజ్జనని గురించి, విచ్చలవిడిగా మాట్లాడతాము. లోకంలో ఉన్న ఋషుల, మునుల, ప్రవక్తల, దేవుడమ్మల పేర్లన్నీ తెలిసి ఉండొచ్చు గాక. కాని వాటి మహత్తుని మీరు అనుభూతి చెందకపోతే అవన్నీ వట్టి మాటలుగానే, ఖాళీ చిత్రాలుగానే మిగిలిపోతాయి. మీ పరిస్థితి కలలో ఏదో మాట్లాడుతున్నట్టు ఉంటుంది. మీరు ఏం మాట్లాడుతున్నారో మీకే తెలియని పరిస్థితి. మీరు మాట్లాడే మాటలు అర్థశూన్యమవుతాయి, నిస్సారమవుతాయి. వాటి వెనుక దాగిన మహత్తుని గుర్తించినప్పుడే ఆ పదాలు ఒక జీవాన్ని, అర్థాన్ని సంతరించుకుంటాయి. అలా గుర్తించాలంటే సజీవ వ్యక్తికి, ఆ పదాలకి మధ్య సంబంధాన్ని గుర్తించాలి. కాబట్టి ఆ పదాలకి మీకు ఎలాంటి సంబంధం వుంది అన్నది చాలా ముఖ్యం.

మానవుడి యొక్క ఆదిమానసాన్ని “అధునాతన”, వైవిధ్యభరిత, అవకలిత చైతన్యంగా మార్చే ప్రయత్నంలో కలల యొక్క ప్రతీకలని ఉత్పత్తి చేసే క్రియ మొదటి మెట్టు అవుతుంది. అనన్యమైన, అద్వైతమైన ఆదిమానసం నుండి వైవిధ్యంతో కూడిన అవకలిత చైతన్యం (differentiated consciouness) పుట్టింది. ఆ ఆదిమానసం ఎప్పుడూ ఆత్మపరీక్షకి గురికాలేదు. ఎందుకంటే గడచిన యుగాల్లో మనిషి యొక్క మొత్తం అంతర్యం ఆ ఆదిమానసమే అయ్యుండేది. మనిషి మనస్సు వికాసం చెందుతున్న కొద్ది అతడి సచేతన మానసం అతడి అంతర్యానికి పునాది అయిన అద్భుత చైత్య శక్తి నుండి, ఆ ఆదిమానసం నుండి వేరుపడిపోయింది. సచేతన మనస్సుకి, ఆ ఆదిమానసానికి మధ్య దూరం పెరిగింది. దాంతో సచేతన మనస్సు

ఆదిమానసాన్ని పూర్తిగా మర్చిపోయింది. అవకలిత చైతన్యం వికాసం చెందే క్రమంలో ఆ సంబంధాన్ని తెంచుకుంది.

అయితే ప్రస్తుతం మనం అచేతన అని పిలిచేది ఆ ఆదిమ లక్షణాలని తనలో ఇంకా భద్రపరచుకుంది. ఏ లక్షణాలైతే ఆదిమానసంలో ఉంటాయో అవి గుప్తంగా అచేతనలో కనిపిస్తాయి. ఈ లక్షణాలనే స్వప్న ప్రతీకలు మనకు గుర్తుచేస్తాయి. సచేతన మనస్సు వికాసం చెందే క్రమంలో ఏ అంశాలనైతే (భ్రాంతులు, కల్పనలు, ప్రాచీన భావరూపాలు, మూల ప్రవృత్తులు మొ॥) వదులుకుందో, వాటన్నిటినీ అచేతన తిరిగి తేవాలని చూస్తున్నట్టు అనిపిస్తుంది.

అచేతన విషయాలని ఎదుర్కోవడంలో చాలా మంది ఎందుకు విముఖత చూపుతారో, భయపడతారో దీన్ని బట్టి అర్థమవుతుంది. ఈ పురాతన చేతనాంశాలు కేవలం నిర్లిప్తంగా, నిస్సారంగా ఉండవు. అవి గొప్ప చైత్య శక్తితో తొణికిసలాడుతుంటాయి. వాటితో సంపర్కం మన సచేతన మనోస్థితిని తబ్బిబ్బు చేస్తుంది. భయం పుట్టిస్తుంది. వాటిని ఎంతగా అణచిపెడితే, అవి అంతగా వ్యక్తి యొక్క అంతర్యం మొత్తాన్ని ఆక్రమించి న్యూరోసిస్ కలుగజేస్తాయి.

వాటిలో దాగిన చైత్యశక్తిని గుర్తిస్తే అవి ఎంత ప్రధానమో అర్థమవుతుంది. దీనికి ఉదాహరణ చెప్పుకోవాలంటే ఇది కొంత కాలం విస్మృతి ఆవరించిన వ్యక్తి తన జ్ఞాపకాలలో ఏదో వెలితి ఉందని గుర్తించడం లాంటిది. తనకి జ్ఞాపకం లేని ముఖ్యమైన సంఘటనలేవో జరిగాయని లీలగా తోచడం లాంటిది. అంతర్యం అనేది పూర్తిగా వ్యక్తిగత వ్యవహారం అని నమ్మినంత కాలం తన పసి నాటి జ్ఞాపకాలని తిరిగి తెచ్చుకోవాలని విశ్వప్రయత్నం చేస్తాడు. కాని చిన్నప్పటి జ్ఞాపకాలకి సంబంధించిన ఈ విస్మృతి నిజానికి ఇంకా విస్తారమైన, లోతైన విస్మృతికి చిహ్నం. అది ఆదిచైతన్యంలో బంధాన్ని కోల్పోవడం వల్ల ఏర్పడ్డ విస్మృతి.

ఎదుగుతున్న పిండం జీవపరిణామ చరిత్రలోని దశలని మళ్లీ అనుసరిస్తుంది. అదే విధంగా మనసు కూడా పలు పూర్వచారిత్రక దశల మీదుగా వికాసం చెందుతుంది. ఆ పూర్వచారిత్రక యుగాల యొక్క, అతి ప్రాచీన ప్రవృత్తుల యొక్క "జ్ఞాపకాలని" తిరిగి తీసుకురావడమే కలల యొక్క ముఖ్యమైన పని. అలాంటి జ్ఞాపకాలు కొన్ని సందర్భాలలో మనసుకి గొప్ప స్వస్థత చేకూర్చగలవు. ఈ విషయాన్ని ఫ్రాయిడ్ ఎప్పుడో గుర్తించాడు. దీన్ని బట్టి శైశవ విస్మృతి  వల్ల మన చిత్తంలో  నిజంగా పెద్ద నష్టమే వాటిల్లిందని తెలుస్తోంది. ఆ జ్ఞాపకాలని తిరిగి తెచ్చుకోగలిగితే గొప్ప శ్రేయస్సు కలుగుతుంది.

పసికందులు భౌతికంగా చాలా చిన్నగా ఉంటారు కనుక, వాళ్లకి పెద్దగా సచేతన ఆలోచనలు ఉండవు కనుక, దానికి మూలమానసంతోను, పూర్వచారిత్రక  అంతర్యంతోను గల గాఢమైన సంబంధాన్ని గుర్తించము. పరిణామాత్మక దశలు పిండవృద్ధిలో ఎలా కనిపిస్తాయో, శిశువు చిత్తం వెనుక మూలమానసం ఇప్పటికీ వుంది, ప్రచ్ఛన్నంగా దాని ప్రభావాన్ని చూపిస్తోంది. తన కలలని తండ్రికి బహుమతిగా ఇచ్చిన పాప సంగతి ఒకసారి గుర్తుతెచ్చుకుంటే, ఇక్కడ నేను ఏం చెప్తున్నానో పాఠకులకి అర్థమవుతుంది.

శైశవ విస్మృతిలో కొన్ని పౌరాణిక చిన్నెలు కనిపిస్తాయి. కాలంతరంలో అవి కొన్ని సైకోసిస్ (psychosis) లలో కూడా వ్యక్తమవుతాయి. ఇలాంటి చిత్రాలలో ఎంతో మహత్తు ఉంటుంది, కాబట్టి అవి చాలా ముఖ్యమైనవి. అలాంటి జ్ఞాపకాలు ఎదిగిన వయసులో వస్తే అవి ప్రగాఢమైన చిత్తచాంచల్యాన్ని కలుగజేయగలవు. మరి కొందరిలో అయితే అవి చేతనలో మహత్యాలు చేసి, గొప్ప పరివర్తనలు కలుగజేయగలవు. ఎంతోకాలంగా లేని జీవనసౌరభాన్ని ఆ జ్ఞాపకాలు తిరిగి తీసుకురాగలవు. ఓ కొత్త జీవనోత్సాహాన్ని ప్రవేశపెట్టి, జీవన పరమార్థపు స్ఫురణ కలిగించగలవు.

శైశవ జ్ఞాపకాలని తిరిగి తెచ్చుకోవడం వల్ల, మూలమాతృకలని పునరుద్ధరించడం వల్ల గొప్ప చిత్తవిస్తారం జరగే అవకాశం వుంది. అది సఫలం కావాలంటే తిరిగి తెచ్చుకున్న చైతన్య అంశాలని సచేతన మనసులోకి ఆకళింపు చేసుకోవాలి, సచేతన మనసుతో సమన్వయ పరచుకోవాలి. అలాంటి ఆకళింపు వల్ల వ్యక్తిత్వంలో

సమూలమైన మార్పు వస్తుంది. వ్యక్తిత్వం రూపుద్దికునే క్రమంలో, అంటే "వ్యక్తీకరణ ప్రక్రియ"లో ప్రతీకలు ఎంతో ముఖ్యమైన పాత్ర ధరిస్తాయి. ఎందుకంటే అంతర్యంలోని భిన్న ధృవాల మధ్య సామరస్యం కుదిర్చి, సమైక్యత సాధించే ప్రయత్నంలో ప్రతీకలు సహజంగా ఉత్పన్నమవుతాయి.

కాబట్టి ప్రతీకలని ఊరికే చూసి వెంటనే త్రోసిపుచ్చితే పెద్దగా ఫలితం ఉండదు. వెనకటి న్యూరాటిక్ పరిస్థితి మళ్లీ ముదిరిపోయి, సమన్వయాన్ని సాధించే ప్రయత్నం విఫలం అవుతుంది. కాని దురదృష్టవశాత్తు కొంతమంది అరుదైన వ్యక్తులు మూలమాతృకల ఉనికిని తిరస్కరించకపోయినా, వాటి మహత్తుని అర్థం చేసుకోక, వాటి వెనుక ఉన్న సజీవ యదార్థాన్ని గుర్తించక, వాటిని కేవలం పొడిపొడి పదాలుగా తీసుకుంటారు. వాటి మహత్తును గుర్తించకపోవడం వల్ల అలాంటి వాళ్లు ఒక మూలమాతృక నుండి మరో మూలమాతృకకి అనంతంగా మారుతూ పోతుంటారు. అప్పుడిక ఏదీ సరిగ్గా అర్థం కాదు. అన్నిటి అర్థం ఒక్కలాగానే తోచుతుంది. మూలమాతృకల బాహ్యరూపాలని కొంత వరకు ఒకదానికొకటి వాడొచ్చునన్న విషయం నిజమే. కాని వాటి మహత్తు మాత్రం వాస్తవం. ఆ మహత్తే మూలమాతృక యొక్క అసలు విలువని చాటుతుంది.

కలలని అన్వయం చేసే ప్రయాసలో ప్రతీకల వెనుక ఉండే భావావేశాన్ని తప్పకుండా గుర్తించాలి. అయితే వాస్తవంలో తరచు భావావేశపు విలువని నిర్లక్ష్యం చేస్తుంటాము. ఎందుకంటే ఆలోచన, భావావేశం భిన్న ధృవాల వద్ద ఉంటాయి గనుక, ఆలోచన అడుగుపెట్టగానే భావావేశం నిష్క్రమిస్తుంది. భావావేశానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన శాస్త్రరంగం ఒక్క మనస్తత్వ శాస్త్రం మాత్రమే. ఎందుకంటే ఆ శాస్త్రం భౌతిక సంఘటనలకి, జీవితానికి మధ్య లంకె పెడుతుంది. ఆ కారణం చేత మనస్తత్వ శాస్త్రం అసలు శాస్త్రమే

కాదంటుంటారు; కాని భావావేశానికి ప్రాధాన్యత నివ్వడం ఎంత శాస్త్రీయమో ఆ విమర్శకులు గుర్తించలేకున్నారు.

స్వస్థత చెందిన అంతర్యం

మనిషి బుద్ధి ప్రకృతి మీద హుకుం చేసే నాగరిక ప్రపంచాన్ని తయారు చేసింది.  ఆ ప్రపంచాన్ని ఘోరమైన యంత్రాలతో పూరించింది. ఆ యంత్రాలకి మనం ఎంతగా బానిసలైపోయాం అంటే అవి లేకుండా బతకలేని స్థాయికి దిగజారాం. వైజ్ఞానిక, సాంకేతిక, ఆర్థిక లక్ష్యాలనే అనన్యంగా అనుసరిస్తూ మనిషి బతకడం నేర్చుకున్నాడు. ఆ ప్రయత్నంలో తను సాధించిన విజయాలు చూసుకుని తెగ మురిసిపోతుంటాడు. తన తెలివితేటలు ఉపయోగించి ఇంకా ఇంకా ప్రమాదకరమైన యంత్రాలు తయారు చెయ్యడంలో మునిగిపోయాడు.  వాటితో సామూహిక ఆత్మహత్య ఎలా చేసుకోవాలో నిరంతరం ఆలోచిస్తుంటాడు.

ఒక పక్క ప్రపంచ జనాభా అడ్డు అదుపు లేకుండా పెరిగిపోతోంది. ఆ వృద్ధిని అదుపు చెయ్యడానికి మనిషి ఎన్నో సాధనాలు కనిపెడుతున్నాడు. కాని మన పన్నాగాలు అన్నీ పసిగట్టిన ప్రకృతి మనిషిని తన సృజనాత్మకతకి తానే వ్యతిరేకంగా పని చేసేలా తిప్పింది. ప్రకృతి మీద మనం ఎంతగా అధిపత్యం చెయ్యాలని చూసినా, మనం ప్రకృతికి అధీనులం. ఎందుకంటే మనం ముందు మన ప్రకృతిని ఎలా అధీనం చేసుకోవాలో నేర్చుకోలేదు. అంచెలంచెలుగా, అనివార్యంగా ఓ ఘోరవిపత్తును మన నెత్తికి తెచ్చుకుంటున్నాం.

అదే జరిగిననాడు ఏ దేవుడు, దేవతలు మనని ఆదుకోలేరు. ప్రపంచంలోని ప్రధాన మతాలన్నీ క్రమంగా నిస్సారమై, నీరసించిపోతున్నాయి. ఎందుకంటే అడవుల్లో, నదుల్లో, కొండల్లో, పశుపక్ష్యాదుల్లో, మునీశ్వరుల్లో దాగిన మహత్తు అంతా మటుమాయం అయిపోయి ఉపచేతన పొరల్లో దాక్కుంది. అక్కడ మన ప్రాచీన గతపు శిధిలాల మధ్య అవన్నీ బిక్కుబిక్కు మని జీవిస్తుంటాయని భ్రమపడతాం. ఆధునిక జీవితం హేతుదేవత చెప్పుచేతల్లో నడుస్తోంది. ఆ హేతుశక్తి మన పాలిటి అత్యంత  ప్రమాదకరమైన, వినాశకరమైన భ్రాంతి అని గుర్తించలేకున్నాం. ఆ హేతుశక్తి సహాయంతో మనం "ప్రకృతిని జయించేశాం" అని సంబరపడుతుంటాం.

కాని అదొక పనికిమాలిన నినాదం మాత్రమే. ఎందుకంటే మనం ప్రకృతిని జయించే పేరుతో అధికజనాభాని సృష్టించి భూమి మీద జీవన పరిస్థితులని అస్థిరపరుస్తున్నాం. ఆ పరిస్థితులతో తలపడగల రాజకీయ మార్పులు చేసుకోగల మానసిక పరిపాకం లేకపోవడం వల్ల మన సమస్యలు రెండింతలు అవుతున్నాయి. అధిపత్యం కోసం మనుషులు ఒకరి మీద ఒకరు కత్తులు దూయడం అలవాటైపోయింది. మరి ఇక "ప్రకృతిని జయించినట్టు" ఎక్కడయ్యింది?

ఏ మార్పు అయినా ఎక్కడో ఒక చోట మొదలవ్వాలి. సత్యాన్ని అనుభూతి చెందిన ఒక్క వ్యక్తి ఉంటే చాలు, మార్పుకి నాంది జరుగుతుంది. మార్పు అంటూ జరిగితే అది వ్యక్తితోనే మొదలవ్వాలి. ఆ వ్యక్తి మనలో ఎవరమైనా కావచ్చు. మనకే రుచించని పనిని మరెవరో వచ్చి నెత్తిన వేసుకుంటారని అనుకోవడం భ్రమే అవుతుంది. కాని మరి ఏం చెయ్యాలో ఎవరికీ తెలిసినట్టు కనిపించడం లేదు. మన ఉపచేతన మనకి దారి చూపిస్తుందేమో అడిగి చూస్తే ఎలా ఉంటుందో? ఈ సందర్భంలో మన సచేతన మానసం మనకి పెద్దగా ఉపయోగపడుతున్నట్టు లేదు. మనిషికి తెలిసిన గొప్ప గొప్ప మతాలు గాని, తత్వశాస్త్రాలు గాని ప్రస్తుత ప్రపంచ సవాళ్లని ఎదుర్కునే శక్తిని ఇవ్వలేకపోతున్నాయన్న అవగాహన మనిషిని కలవరపెడుతోంది.

బౌద్ధులు ఏవంటారో నాకు తెలుసు – ధర్మబద్ధమైన “అష్టాంగ మార్గాన్ని” మనుషులంతా పాటిస్తే అంతా సరైపోతుందని, ఆత్మసాక్షాత్కారం కలుగుతుందని అంటారు. దైవం మీద అచంచల విశ్వాసం ఉంటే మరింత మెరుగైన ప్రపంచం మనదవుతుంది అంటాడు క్రైస్తవుడు. మనుషులంతా తెలివిగా, హేతుబద్ధంగా బతికితే మన సమస్యలు అన్నిటినీ చక్కబెట్టుకోవచ్చు నంటాడు హేతువాది. కాని చిక్కేంటంటే వీళ్లందరూ కూడా వాళ్లకి వాళ్లే తమ సమస్యలని పరిష్కరించుకోలేక పోతున్నారు.

వెనకటి రోజుల్లో చేసినట్టు ఈ రోజుల్లో దేవుడు తమతో ఎందుకు మాట్లాడటం లేదని క్రైస్తవులు వాపోతూ ఉంటారు. ఇలాంటి మాటలు విన్నప్పుడు నాకొక రాబై (rabbi) కథ గుర్తొస్తుంది. వెనకటి రోజుల్లో దేవుడు మనుషులకి కనిపించేవాడు గాని ఈ రోజుల్లో ఎందుకు కనిపించడం లేదని ఎవరో ఇతగాణ్ణి అడుగుతారు. అందుకు రాబై ఇలా సమాధానం చెప్పాట్ట - “ఈ రోజుల్లో మరి అంతగా వంగి ఎవరూ సలాము చెయ్యడం లేదు.”

ఇది ఆ ప్రశ్నకి సరైన సమాధానం. మనం మన మానసిక, ఆలోచనాభరిత చేతనలో పూర్తిగా చిక్కుకుపోయి జీవిస్తుంటాం. భగవంతుడు కలల ద్వార, ఆత్మదర్శనాల ద్వార మాట్లాడుతాడు అన్న చిరకాల సత్యాన్ని మనం మర్చిపోతున్నాం. అచేతనకి చెందిన వ్యవహారాలు అన్నిటినీ వట్టి పనికిమాలిన విభ్రాంతులు అని బౌద్ధులు కొట్టిపారేస్తారు. క్రైస్తవుడు తనకి తన అచేతనకి మధ్య చర్చిని, బైబిల్ ని అడ్డుగోడగా పెట్టుకున్నాడు. తన సచేతన మనస్సు తన పూర్తి చేతనలో చాలా చిన్న భాగమేనని హేతువాదికి తెలియదు. అలాంటి అజ్ఞానం ఇప్పటికీ ప్రబలిపోయి వుంది. గత 70 ఏళ్లుగా మనస్తత్వ శోధన అంతటిలోను అచేతన ఒక కేంద్రభావనగా చలామణి అయినా ఆ అజ్ఞానం మాత్రం సమసిపోలేదు.

దేవుళ్లా బడాయి పోతూ ప్రకృతి పరిణామాల మీద తీర్పు చెప్పే న్యాయనిర్ణేతల్లా ప్రవర్తించడానికి ఇక వీలుపడదు. పనికొచ్చే మొక్కలు, పనికి రాని మొక్కలుగా వృక్షశాస్త్రాన్ని రెండుగా విభజించడం కుదరదు. అలాగే సాధు జంతువులు, క్రూరమృగాలు అంటూ జంతు ప్రపంచాన్ని రెండుగా విభజించలేము. కాని చైతన్యం విషయంలో మాత్రం సచేతన అర్థవంతమైనదని, అచేతన అర్థరహితమైనదని వర్గీకరించి పొరబడతాం. వైజ్ఞానిక రంగంలో అలాంటి విభజనలు వింటే జనం పొట్టపగిలేలా నవ్వుతారు. సూక్ష్మక్రిములు అర్థవంతమైనవా, అర్థరహితమైనవా, అని అడిగితే ఏం చెప్తాం?

అచేతన అర్థవంతమైనది అయినా కాకపోయినా, అది పుట్టించే ప్రతీకలు సహజమైనవి, ఉపయోగకరమైనవి. మైక్రోస్కోప్ లో ఒక్కసారి కూడా తొంగి చూడని వ్యక్తిని సూక్ష్మక్రిముల మీద నిపుణుడు అని ఎలా ఒప్పుకుంటాం? అదే విధంగా సహజ ప్రతీకలని ఒక్కసారి కూడా అధ్యయనం చెయ్యని వాణ్ణి వాటి మీద నిపుణుడిగా ఎలా అంగీకరిస్తాం? కాని ఆధునిక సంస్కృతి మానవాత్మని ఎంతగా నిర్లక్ష్యం చేస్తుందంటే, అటు మతాలు, తత్వచింతనలు, ఇటు వైజ్ఞానిక హేతువాదాలు కూడా దాని పట్ల తగినంత లోతుగా ధ్యాస పెట్టవు.

కాథలిక్ చర్చి somnia a Deo missa (దేవుడు పంపిన కలలు) అనేవి ఉంటాయని ఒప్పుకుంటుంది. ఆ చర్చికి చెందిన పండితులు కూడా కలలని లోతుగా అర్థం చేసుకునే ప్రయత్నం చెయ్యరు. అలాగే ఏ ప్రొటెస్టంట్ ల కృతి అయినా, మత గ్రంథమైనా కలలో దైవవాణి (vox Dei) వినిపిస్తుందని ఒప్పుకుంటుందని అనుకోను. మరి మత గురువులకి నిజంగా దేవుడి పట్ల నమ్మకమే వుంటే, దేవుడు కలల ద్వార మాట్లాడడని అంత నమ్మకంగా ఎలా చెప్పగలుగుతున్నారు?

సహజ ప్రతీకలని శోధిస్తూ సుమారు అర్ధ శతాబ్దం గడిపాను. కలలు, అవి చూపించే ప్రతీకలు అర్ధరహితం కావని నమ్ముతున్నాను. స్వప్నప్రతీకలని అర్థం చేసుకునే ప్రయత్నం చేసే వారికి అవి ఎంతో విలువైన సమాచారం అందిస్తాయని అంటాను. అయితే ఆ ప్రతీకలు చెప్పే కబుర్లకి, క్రయవిక్రయాల వంటి ప్రాపంచిక వ్యవహారాలతో పెద్దగా సంబంధం ఉండకపోవచ్చు. జీవితానికి అర్థం వట్టి విత్త వ్యవహారాలకే పరిమితం కాకపోవచ్చు. మానవ హృదయం యొక్క తీరని దాహాన్ని బాంకు ఖాతా తీర్చలేకపోవచ్చు.

మానవ చరిత్రలో మనిషి ఎంతో కాలంగా తన శక్తుయుక్తులన్నిటినీ ప్రకృతి అధ్యయనం మీద కేంద్రీకరించాడే గాని, తన అంతర్యాన్నే విస్మరిస్తూ వచ్చాడు. ఏ చేతనా విభాగం లోంచి అయితే ప్రతీకలు పుట్టుకొస్తున్నాయో, ఆ సంక్లిష్టమైన, అపరిచితమైన చేతనా విభాగాన్ని బాగా నిర్లక్ష్యం చేశాడు. దాని నుండి మనకు ప్రతీ రాత్రి ఎన్నో సందేశాలు అందుతున్నా ఆ సందేశాలలోని రహస్యాలని ఛేదించే ప్రయత్నాలు ఎవరో కొద్ది మంది మహానుభావులు తప్ప ఎవరూ చెయ్యరు. మనిషికి అందుబాటులో ఉన్న అతి ముఖ్యమైన సాధనం అతడి చేతన. కాని మనిషి దాన్ని పట్టించుకోడు, దాన్ని విశ్వసించడు, పైగా తృణీకరిస్తాడు. “అంతా కేవలం నీ మనసులో ఉంది,” అంటుంటారు. అంటే మనసు అంత ముఖ్యం కాదని మన తాత్పర్యం.



“తెరిచిన పుస్తకం ఎదుట తాత్వికుడు” అనే చిత్రం. దీని కర్త డచ్ చిత్రకారుడు రెంబ్రాంట్. చిత్రంలో పుస్తకం ఎదుట ధ్యానముద్రలో కూర్చున్న తాత్వికుడి ప్రతిరూపం, చిత్రం కుడి పక్క చీకట్లో కూర్చుని అగ్నిని పోషిస్తున్నాడు. మనిషి తన అచేతననే తానే శోధించాలి అనే యుంగ్ బోధనకి ఈ చిత్రం అద్దం పడుతోంది.

చేతన అంటే ఎందుకంత చులకన? మనం ఏమిటి అని ఆలోచిస్తూ ఆ ఆలోచనలలో చిక్కుకుపోయి ఉంటాం గాని, మన అచేతన మన గురించి ఏమనుకుంటోందో ఆలోచించం. చాలా మంది మనుషుల్లో అంతర్యం పట్ల ఉండే తృణీకార భావాన్ని సిగ్మండ్ ఫ్రాయిడ్ సిద్ధాంతాలు సమర్ధించాయి. ఫ్రాయిడ్ కాలానికి ముందు ఆ

విషయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసేవారు. ఫ్రాయిడ్ తరువాత అచేతనని మన నైతిక వ్యర్థాలన్నీ పోగయ్యే చెత్తబుట్టలా పరిగణించడం మొదలెట్టారు.

ఈ ఆధునిక దృక్పథం కూడా పూర్తిగా ఏకపక్షమైన, అసంపూర్ణమైన, అన్యాయమైన దృక్పథం. మనకి తెలిసిన వాస్తవాలతో కూడా ఆ దృక్పథం పొసగదు. అచేతన గురించి మనకు ఇంతవరకు తెలిసిన దాని బట్టి అది ప్రకృతి లాగానే తటస్థంగా, నిష్పక్షపాతంగా, నిర్లిప్తంగా ఉంటుందని తెలుస్తోంది. మానవ స్వభావానికి చెందిన లక్షణాలన్నీ అక్కడ ప్రతిబింబిస్తాయి.  తెలుపు - నలుపు, అందం – అందవిహీనం,  మంచి – చెడు, మేధ – మూర్ఖత్వం అన్నీ అందులో కనిపిస్తాయి.  వ్యక్తిగతమే కాకుండా, సమిష్టి ప్రతీకల అధ్యయనం కూడా ఒక బృహద్ యత్నం. ఇప్పుడిప్పుడే మొదలవుతున్న ఆ ప్రయాసలో ఇంకా ఎవరూ దక్షత సాధించలేదు. ఆరంభం అంటూ జరిగింది. అదే సంతోషకరం. ప్రప్రథమ  ఫలితాలే ఎంతో ప్రోత్సాహకరంగా ఉన్నాయి. ఆధునిక మానవుణ్ణి వేధిస్తున్న ఎన్నో ప్రశ్నలకి తీరైన సమాధానాలని సూచిస్తున్నాయి.